
ప్రభాతనవ
SINGIDI తెలుగు దినపత్రిక
# సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
singidinews.com
సోమవారం 21 సెప్టెంబర్ 2026 | సంపుటి: 1 సంచిక: 95 పేజీలు 12 వెల: 6.50
Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nizamabad,Mahabubnagar

## సర్ చిత్రవిచిత్రాలు

**జైశంకర్, ఎల్‌కే అద్వానీ, మనీష్ సిసోడియాకు ఈసీ నోటీసులు** 2

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా పలువురు ప్రముఖులకు ఎన్నికల సంఘం నోటీసులిస్తోంది. ఇప్పటికే ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, ఆయన కుటుంబ సభ్యులకు నోటీసులివ్వడంపై ప్రతిపక్షాల నుంచి తీవ్ర దుమారం రేగిన సంగతి తెలిసిందే.

**- న్యూఢిల్లీ (సింగిడి)**





2

## పశ్చిమాసియా ఉద్రిక్తతలు

**తమ పౌరులకు యూఎస్ అలర్ట్**

# ఆస్తులపై విచారణకు మేం సిద్ధం.. మీరు సిద్ధమా?

## రేవంత్ ఎల్ నినో కంటే ప్రమాదకరం: హరీశ్ రావు

2

**అవకాశం ఉన్నా కరెంట్ ఇవ్వకుండా కరవును సృష్టిస్తున్నారు: హరీశ్ రావు**

**24 గంటల కరెంట్ పోయి 6-7 గంటలకే పరిమితమైందని విమర్శలు**

**మూడు పంటల నుంచి రైతుబంధు పెండింగ్‌లో పెట్టారని ఆరోపణ**

**పిట్ట బెదిరింపులకు భయపడేది లేదని ప్రభుత్వానికి హెచ్చరిక**



కాంగ్రెస్ పాలన వల్ల ఎవరికీ లాభం లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. మహిళలకు నెలకు రూ.2,500 చొప్పున ఇస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఎవరికైనా ఇచ్చారా? 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు.. ఇచ్చారా?'' అని ప్రశ్నించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా ఆపేశారని విమర్శించారు. యాదాద్రి జిల్లా మోటకొండూరులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డికి, వారి కుటుంబ సభ్యులు, సన్నిహితులకు ఉద్యోగాలు వచ్చాయి తప్ప.. సాధారణ యువతకు లబ్ధి చేకూరలేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్క కాల్వ కూడా తవ్వలేదని ఆక్షేపించారు. '' కాంగ్రెస్ నేతలు చేస్తున్న భూ కబ్జాపై మాట్లాడినందుకే మాపై దాడి చేశారు. మీ ఆస్తులు, మా ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా? ఇక్కడ యాత్రలు చేయడం కాదు.. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం ఎంపీలు ఢిల్లీలో కొట్లాడాలి. మీ యాత్రలు రేవంత్‌రెడ్డి ఇంటికి చేయండి'' అని హరీశ్‌రావు అన్నారు.

**- యాదాద్రి, సెప్టెంబర్ 20 (సింగిడి)**

# దళితుల భూములపై పొంగులేటి భరోసా

## భూ రికార్డుల పరిశీలన హక్కుల పరిరక్షణకేనని, భూసేకరణ కాదని వివరణ

**కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపణ**

**దళితులు, గిరిజనుల భూ హక్కులకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ**

**కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణ నేపథ్యంలో దళిత రైతులకు నోటీసులు**

2

రాష్ట్రంలోని దళితుల భూముల్లో అంగుళం కూడా ప్రభుత్వం తీసుకోదని, వారి భూములకు పూర్తి భద్రత కల్పిస్తామని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం స్పష్టం చేశారు. దళితులు, గిరిజనుల భూములను లాక్కోవడం ప్రజల ప్రభుత్వ విధానం కాదని ఆయన తేల్చిచెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం దళితుల భూములకు పూర్తి రక్షణ కవచంగా నిలుస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. దళితులు, గిరిజనులు, బడుగు బలహీన వర్గాల ఆశీస్సులతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని పొంగులేటి పేర్కొన్నారు. సామాజిక న్యాయం, పేదల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వాల ప్రధాన ప్రాధాన్యతలని అన్నారు.

**- హైదరాబాద్, సెప్టెంబర్ 20 (సింగిడి)**





# రష్యాపై విరుచుకుపడ్డ ఉక్రెయిన్

## మాస్కో చరిత్రలోనే అతిపెద్ద డ్రోన్ దాడి

**పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ వేళ అటాక్**

**రాత్రికి రాత్రే వెయ్యికిపైగా డ్రోన్లను ప్రయోగించిన ఉక్రెయిన్**

**ఇద్దరు మృతి, 20 మందికిపైగా గాయాలు**

**రాజధాని మాస్కో లక్ష్యంగా వందలాది డ్రోన్లు ప్రయోగం**

రష్యా– ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తతలు తారా స్థాయికి చేరుకున్నాయి. పార్లమెంటర్ ఎన్నికలు జరుగుతున్న వేళ రాజధాని మాస్కోపై ఉక్రెయిన్ విరుచుకుపడింది. మునుపెన్నడూ లేని స్థాయిలో రాత్రికి రాత్రే వందలాది డ్రోన్లను ప్రయోగించింది. ఈ దాడుల్లో ఇద్దరు పౌరులు ప్రాణాలు కోల్పోగా పదుల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. పలు భవనాలు, చమురు శుద్ధి కర్మాగారాలు దెబ్బతిన్నాయి. మరోవైపు, ఉక్రెయిన్ ప్రయోగించిన చాలా డ్రోన్లను తమ బలగాలు మార్గమధ్యంలోనే అడ్డుకున్నాయని రష్యా ప్రకటించింది.

**- న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20 (సింగిడి)** 2

## జోధ్‌పుర్‌లో భారత్- జపాన్ సైనిక విన్యాసాలు

**తేజస్‌లో ప్రయాణించిన భారత్- జపాన్ ఎయిర్‌ఫోర్స్ చీఫ్‌లు**

**ఆకట్టుకున్న ఇరుదేశాల సైనిక విన్యాసాలు**

**ఈ విన్యాసాలలో భారత్ తరఫున పాల్గొన్న తేజస్, సుకోయ్-30ఎంకేఐ, రఫేల్- జపాన్ నుంచి పాల్గొన్న ఎఫ్-2ఏ ఫైటర్ జెట్**

2

# ఫోకస్ ఆన్ సీఎం ఇలాకా

ఒకవైపు అన్న పాలమూరు ప్రాంతంలో పర్యటిస్తే.. మరోవైపు చెల్లెలు సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గాన్ని వేదికగా ఎంచుకున్నారు. వరుసగా రెండు రోజుల వ్యవధిలో చోటుచేసుకున్న ఈ పర్యటనలు ఇప్పుడు రాజకీయంగా ఆసక్తి రేపుతున్నాయి. **- హైదరాబాద్ బ్యూరో - సింగిడి**

## ఎవరి పొట్టకూటి కోసం వారన్నట్లు.. ఎవరి రాజకీయ బాట వారిది

**సీఎం ఇలాఖాపై అన్నాచెల్లెళ్ల వరుస పర్యటనలు.. శనివారం పాలమూరులో కేటీఆర్ పర్యటన**

**ఆదివారం కొడంగల్‌లో కవిత సభ.. తొలిసారి చౌదరిగూడెంలో.. ఇప్పుడు కోస్గిలో సభ**

**పాలమూరు నుంచి ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శలు.. కొడంగల్ వేదికగా కవిత రాజకీయ కార్యాచరణ**

**పాలమూరులో కేటీఆర్..**

శనివారం కేటీఆర్ పాలమూరు ప్రాంతంలో పర్యటించారు. కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఆయన.. అనంతరం పెబ్బేరులో మీడియాతో మాట్లాడారు. గుమ్మడం సబ్‌స్టేషన్‌ను పరిశీలించి రైతులతో విద్యుత్ సరఫరాపై మాట్లాడారు. సాగునీరు, కరెంట్ సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. వనపర్తిలో రోడ్‌షో నిర్వహించిన కేటీఆర్.. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు, రైతులకు సాగు నీరు, విద్యుత్ సరఫరా వంటి అంశాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వంపై ప్రశ్నలు సంధించారు. ఇవి కేటీఆర్ తాజా పర్యటనలో ప్రధాన రాజకీయ అంశాలుగా మారాయి.

**కొడంగల్‌లో కవిత..**

అదే సమయంలో ఆదివారం కవిత కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో 'పాంచజన్య సంకల్ప సభ' నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే బహిరంగ సభ ఏర్పాటు చేయడంతో సహజంగానే రాజకీయ ప్రాధాన్యం ఏర్పడింది. కొడంగల్ నుంచి కోస్గి వరకు ర్యాలీ కూడా నిర్వహించారు. ఇదే ప్రాంతంలో కవిత గతంలో షాద్‌నగర్ సమీపంలోని చౌదరిగూడెంలో తొలిసారిగా సభ నిర్వహించారు. ఇప్పుడు మరోసారి సీఎం నియోజకవర్గానికి సమీపంలోని వేదికను ఎంచుకోవడం.. ఆమె రాజకీయ విస్తరణలో భాగంగా కనిపిస్తోంది.

**అన్న దారి.. చెల్లె దారి..**

కేటీఆర్ పాలమూరు జిల్లాల పర్యటనలో రైతులు, సాగు నీరు, విద్యుత్ అంశాలను ముందుకు తెస్తుండగా.. కవిత కొడంగల్ సభలో ప్రభుత్వం, సామాజిక న్యాయం, ఉపాధి, విద్య, వైద్యం వంటి అంశాలను ప్రస్తావించే కార్యాచరణతో ముందుకు వెళ్తున్నారు. అంటే.. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు నేతలు ఒకే రాజకీయ ప్రత్యర్థి పరిధిలో వేర్వేరు ప్రాంతాలు, వేర్వేరు అంశాలతో తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నారన్న చర్చ మొదలైంది.



**సీఎం ఇలాఖానే ఎందుకు..**

రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్.. కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజకీయంగా ప్రత్యేక ప్రాధాన్యం ఉన్న ప్రాంతం. అలాంటి చోట కవిత సభ నిర్వహించడం.. మరోవైపు పాలమూరు ప్రాంతంలో కేటీఆర్ పర్యటించడం యాదృచ్ఛికమేనా.. లేక వ్యూహాత్మక రాజకీయ కార్యక్రమాలా అన్న చర్చ జరుగుతోంది. అయితే కేటీఆర్ తన పర్యటనలో రైతు సమస్యలను ప్రధానంగా ప్రస్తావిస్తే.. కవిత తన సభ ద్వారా కొత్త రాజకీయ వేదిక, భవిష్యత్ కార్యాచరణను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. కాబట్టి ఇద్దరి పర్యటనల ఉద్దేశాలు, అంశాలు వేర్వేరుగానే కనిపిస్తున్నాయి.

### రాజకీయంగా కొత్త లెక్కా..

బీఆర్ఎస్ నుంచి కేటీఆర్ ఇప్పటికే ప్రధాన ప్రతిపక్ష స్వరంగా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు కవిత కొత్త రాజకీయ వేదికతో స్వతంత్రంగా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో అన్నాచెల్లెళ్ల రాజకీయ కార్యకలాపాలు ఒకే ప్రాంతంలో వరుసగా కనిపించడం.. తెలంగాణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు సంకేతమా అన్న చర్చకు దారితీస్తోంది. ఎవరి రాజకీయ బాట వారిదే అయినా.. ఇద్దరి పర్యటనల్లోనూ రేవంత్‌రెడ్డి రాజకీయ ప్రభావం ఉన్న ప్రాంతాలే కేంద్రంగా మారడం ఇప్పుడు ఆసక్తికర పరిణామంగా కనిపిస్తోంది. పాలమూరులో అన్న.. కొడంగల్‌లో చెల్లె.. ఇద్దరి గురి ఒక్కటేనా.. లేక ఎవరి రాజకీయ లెక్క వారిదేనా అన్నదే ఇప్పుడు చర్చ.

## సూర్యాపేటలో ఘోర ప్రమాదం

**కారులో సజీవదహనమైన వైద్యుడు.. డివైడర్‌ను ఢీకొట్టి కారులో చెలరేగిన మంటలు**



**ఖమ్మం న్యూరో సర్జన్ కాసకుర్తి జగదీశ్ సజీవదహనం**

**తలుపులు లాక్ అవ్వడంతో బయటకు రాలేకపోయిన వైద్యుడు** 2



## విద్యార్థులకు అండగా రాహుల్: కాంగ్రెస్

విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసిన బీజేపీ, ఆర్‌ఎస్ఎస్

మోదీపై చేసిన విమర్శలను ఖండించిన బీజేపీ

2

## బంగాళాఖాతంలో అల్పపీడనం

### తెలంగాణకు వర్ష సూచన

2



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉండటంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది.

**- హైదరాబాద్, సెప్టెంబర్ 20 (సింగిడి)**

# అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండూ ముఖ్యమే

**ఇప్పుడు మరో చక్కటి నగరాన్ని నిర్మించే అవకాశం దేవుడు నాకు ఇచ్చాడు: బెంగళూరులో చంద్రబాబు**

**బెంగళూరులో 'ది ఎర్త్ సెంటర్' ప్రారంభోత్సవం .. కర్ణాటక సీఎం డీకేతో కలిసి పాల్గొన్న సీఎం చంద్రబాబు**

**గ్రే గ్రోత్ నుంచి గ్రీన్ గ్రోత్ వైపు వెళ్లాలని పిలుపు.. పర్యావరణ హిత నగరంగా అమరావతి నిర్మాణం చేపడతామని వెల్లడి**



బెంగళూరులోని వైట్ ఫీల్డ్ లో ఆదివారం జరిగిన 'ది ఎర్త్ సెంటర్ – విష్టా స్పేసెస్' ప్రారంభోత్సవంలో ఏపీ సీఎం చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో కలిసి చంద్రబాబు ఈ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా సైబరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేశాను. ఇప్పుడు అమరావతి రూపంలో మరో చక్కటి నగరాన్ని నిర్మించే అవకాశం నాకు దేవుడు ఇచ్చాడు" అని అన్నారు. ప్రకృతి, సాంకేతికత, ఆధునిక మౌలిక వసతులతో అమరావతిని భవిష్యత్ తరాలకు అనువైన, పర్యావరణ హిత నగరంగా తీర్చిదిద్దుతున్నామని ఆయన స్పష్టం చేశారు.

**- బెంగళూరు, సెప్టెంబర్ 20 (సింగిడి)** 2

## ఎల్ నినో ప్రభావాన్ని ముందే అంచనా వేశాం

ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలి: సీఎం చంద్రబాబు

**ఎల్ నినో ప్రభావం, ప్రభుత్వ కార్యాచరణపై సీఎం చంద్రబాబు సమీక్ష**

**రైతులను ఆదుకోవడం, నిత్యావసరాల ధరల నియంత్రణే ప్రధాన లక్ష్యం**

**బియ్యం, ఉల్లి, పామాయిల్, కందిపప్పు ధరలు అదుపులో ఉంచాలని ఆదేశం**

**డిమాండ్‌కు తగిన పంటల సాగు, వర్షాధార వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని సూచన**

## ఏపీలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

**రాష్ట్రంలో 9 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేసిన ప్రభుత్వం**

**సీఐడీ సైబర్ క్రైమ్స్ ఐజీగా జయలక్ష్మికి నియామకం**

**ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ఐజీగా కాంతి రాణాకు పోస్టింగ్**

**విశాల్ గున్నికి శిక్షణ విభాగం డీఐజీగా బాధ్యతలు**

**పల్నాడు, మార్కాపురం, పోలవరం జిల్లాలకు కొత్త ఎస్పీలు**

**తక్షణమే బాధ్యతలు చేపట్టాలని ప్రభుత్వ ఆదేశాలు**

2



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పోలీసు శాఖలో కీలక మార్పులు చేపట్టింది. ఈ మేరకు 9 మంది సీనియర్ ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

**- విజయవాడ (సింగిడి)**

## దళితుల భూములపై
# పొంగులేటి భరోసా

భూసంస్కరణలు, భూ పంపిణీ వంటి చారిత్రక నిర్ణయాలతో నిరుపేద దళితులకు భూములు ఇచ్చి హక్కులు కల్పించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో సుమారు 25 లక్షల ఎకరాల భూమిని దళితులకు, 2 లక్షల ఎకరాల పోడు భూములను గిరిజనులకు పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని పేర్కొన్నారు. అధికారంలోకి వస్తే దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని చెప్పి మోసం చేసిన 'దొర' కేసీఆర్ మాటలను నమ్మవద్దని ఆయన ప్రజలను కోరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌పై విచారణ జరుపుతామని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన నేపథ్యంలో ఈ వివాదం మొదలైంది. ఈ ఫామ్‌హౌస్ దాదాపు 700 ఎకరాల్లో విస్తరించి ఉందని, అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ముఖ్యమంత్రి ఆరోపించారు. ఈ క్రమంలోనే ఎర్రవల్లి గ్రామానికి చెందిన 120 మంది దళిత రైతులకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. భూ యాజమాన్య హక్కులకు సంబంధించిన పత్రాలతో హాజరుకావాలని ఆ నోటీసుల్లో పేర్కొనడంతో దళితుల్లో ఆందోళన మొదలైంది. ఈ నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. "ప్రభుత్వం మీ భూమిలో అంగుళం కూడా తీసుకోదు. మీ భూములను స్వాధీనం చేసుకునే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి లేదు. మీ భూముల విషయంలో ఎలాంటి భయం, ఆందోళన అవసరం లేదు. ప్రజల ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది" అని దళితులకు భరోసా ఇచ్చారు. భూ రికార్డుల పరిశీలన, సర్వే, భూ సమస్యల పరిష్కారం వంటి ప్రక్రియలను భూములు లాక్కోవడంగా చూడటం సరికాదని ఆయన హితవు పలికారు. ప్రజల భూ హక్కులను స్పష్టంగా నమోదు చేయడం, వివాదాలను పరిష్కరించడం, వారి హక్కులకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. కొంతమంది శక్తిమంతమైన వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం దళితులను రెచ్చగొట్టేందుకు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తూ భయాందోళనలు సృష్టిస్తున్నారని మంత్రి ఆరోపించారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఇలాంటి ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్య చట్టబద్ధంగా, పారదర్శకంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# విద్యార్థులకు అండగా రాహుల్


**న్యూఢిల్లీ (సింగిడి)**

బీజేపీ– ఆర్‌ఎస్‌ఎస్ దేశంలోని విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసి, అవినీతిమయం చేశాయని కాంగ్రెస్ పార్టీ ఆదివారం ఆరోపించింది. అయితే, వ్యవస్థలోని లోపాలపై జవాబుదారీతనం కోసం పరితపిస్తున్న విద్యార్థులకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అండగా నిలుస్తున్నారని స్పష్టం చేసింది. మధ్యప్రదేశ్‌లో బీజేపీకి కంచుకోట అయిన ఇండోర్‌లో శనివారం రాహుల్ గాంధీ నిర్వహించిన ఐదో విడత 'ఛాత్రోన్ కీ గూంజ్' సదస్సుపై కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. విద్యార్థులను అణచివేస్తున్న ప్రస్తుత వ్యవస్థ వెనుక ఉన్నది బీజేపీ ఆర్‌ఎస్‌ఎస్ వాళ్లేనని ఆరోపించారు.

**రాహుల్ గాంధీ ఏమన్నారంటే?**

దేశం నుంచి ద్వేషాన్ని తరిమిగొట్టగలిగేది అంధ భక్తులు కాదని, ఆ పని కేవలం విద్యార్థులవల్లే అవుతుందని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఛాత్రోం కీ గూంజ్ ఐదో కార్యక్రమంలో భాగంగా మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో శనివారం విద్యార్థులతో సమావేశమయ్యారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీలకు మద్దతుగా నిలుస్తున్న వారిని అంధ భక్తులుగా ఆయన అభివర్ణించారు. యావద్దేశం వ్యవస్థ గుప్పిట్లో ఉందని, విద్యార్థులు ప్రశ్నించడాన్ని అది కోరుకోవట్లేదని రాహుల్ వ్యాఖ్యానించారు. ఏ దేశానికైనా యువతే భవితవ్యమని, వారు లేకుండా దేశాలేవీ బలపడలేవని స్పష్టం చేశారు. దేశంలో 10 లక్షల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, లక్ష పాఠశాలలు మూతపడ్డాయని దుయ్యబట్టారు. యూపీఏ సర్కారు ఉన్నప్పుడు విద్య కోసం 4.6% బడ్జెట్‌ను కేటాయిస్తే, ప్రస్తుత ప్రభుత్వం 2.6 శాతం కేటాయించిందని ధ్వజమెత్తారు. అలాగే, సోషల్ మీడియా సహా అన్నింటినీ జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ నియంత్రిస్తున్నారని, నిఘా కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎంపీపీఎస్సీలో అక్రమాలను ప్రశ్నిస్తే తమపై కేసు నమోదు చేసి జైలుకు పంపారని దేవాస్‌కు చెందిన ఓ విద్యార్థి తెలిపారు. మధ్యప్రదేశ్‌లో నియామక పరీక్షలకు సంబంధించిన 13 శాతం కోటాను నిలిపివేసిన అంశాన్ని పలువురు విద్యార్థులు రాహుల్‌తో పంచుకున్నారు. దేశ రాజకీయ, సంస్థాగత, ఆర్థిక అంశాలపై ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, పారిశ్రామికవేత్తలు గౌతమ్ అదానీ, ముకేశ్ అంబానీలు నియంత్రణను కలిగి ఉన్నారని ఆరోపించారు. ఇదిలా ఉండగా, ఛాత్రోం కీ గూంజ్ కార్యక్రమంలో ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రంగా మండిపడింది. కాంగ్రెస్ క్షమించరాని నీచ స్థాయికి దిగజారిందని బీజేపీ అధికార ప్రతినిధి యాసర్ జిలానీ ఆదివారం ఆరోపించారు. గతంలో నిర్వహించిన ఒక ర్యాలీలో మోదీ తల్లి పట్ల, మాతృత్వం పట్ల గౌరవాన్ని అపహాస్యం చేశారని మండిపడ్డారు. అలాగే ఇండోర్ జరిగిన వ్యాఖ్యలు అనుచితమైనవని, దాన్ని ప్రజలు ఎప్పటికీ క్షమించరని వ్యాఖ్యానించారు. అయితే, ఈ ఆరోపణలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. ఛాత్రోం కీ గూంజ్ కార్యక్రమంలో మోదీ తల్లి గురించి ఎవరూ తప్పుగా మాట్లాడలేదని కాంగ్రెస్ నాయకుడు రాకేశ్ సిన్హా తెలిపారు. ఆమె అందరికి తల్లి వంటివారని పేర్కొన్నారు.

# రష్యాపై విరుచుకుపడ్డ ఉక్రెయిన్



అయితే, ఉక్రెయిన్ దాడుల కారణంగా మాస్కో ఆయిల్ రిఫైనరీలో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో సమీప ప్రాంతాల్లో భారీగా పొగ వ్యాపించింది. పలు నివాసాలు దెబ్బతిన్నాయి. మాస్కో చరిత్రలోనే అతిపెద్ద డ్రోన్ దాడి ఇదేనని అధికారులు తెలిపారు. మాస్కో వైపు దూసుకొచ్చిన 450కుపైగా డ్రోన్లను అడ్డుకున్నట్లు రష్యా రక్షణ శాఖ వెల్లడించింది. అటు రష్యా ఆక్రమిత క్రిమియా పైనా ఉక్రెయిన్ పెద్ద ఎత్తున దాడులు కొనసాగిస్తోంది. సైనిక సరఫరాలను, విద్యుత్తు వ్యవస్థల్ని స్తంభింపజేసేలా తాజా దాడులు జరిపింది. వీటి కారణంగా మాస్కోలోని ప్రధాన విమానాశ్రయాలు తాత్కాలికంగా మూతపడ్డాయి. దీంతో పలు విమానాలు రద్దుకాగా మరికొన్ని ఆలస్యంగా నడుస్తున్నాయి.

**రష్యా ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెంచడమే లక్ష్యం**

ఈ దాడులపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పందించారు. రష్యా చమురు, లాజిస్టిక్స్ కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు చేసినట్లు ఎక్స్ వెల్లడించారు. ఈ దాడుల్లో రష్యా చమురు కర్మాగారం దెబ్బతిన్నట్లు తెలిపారు. ఇందుకు గానూ, తమ సైనిక సిబ్బంది, గూఢచర్య విభాగానికి కృతజ్ఞతలు తెలిపారు. అదే సమయంలో రష్యా యుద్ధ యంత్రాంగాన్ని నడిపిస్తున్న బిలియన్ల కొద్దీ డాలర్ల ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెంచడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇకనైనా మాస్కో యుద్ధాన్ని ముగించి, శాంతి దిశగా అడుగులు వేయాలని కోరుకుంటున్నట్లు జెలెన్‌స్కీ తెలిపారు.

**యుద్ధం అనంతరం తొలిసారిగా ఎన్నికలు**

మరోవైపు, ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యాలో తొలిసారిగా పార్లమెంటర్ ఎన్నికలు జరుగుతున్నాయి. అధ్యక్షుడు పుతిన్ విధానాలను వ్యతిరేకించే ప్రతిపక్షం దాదాపుగా లేకుండా సాగుతున్న ఈ ఎన్నికల ద్వారా క్రెమ్లిన్ ఆధిపత్యం మరింత సుస్థిరం కానుంది. అయితే రష్యా ఆక్రమిత ప్రాంతాల్లో కూడా పోలింగ్ నిర్వహించడాన్ని కీవ్ తీవ్రంగా తప్పుబట్టింది. రష్యా ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించేందుకే ఉక్రెయిన్ తాజా దాడులకు పాల్పడిందని, అయితే ఆ కుట్రలో శత్రువులు విఫలమయ్యారని రష్యా పేర్కొంది. ఉక్రెయిన్ డ్రోన్‌లను సమర్థవంతంగా కూల్చివేశాయని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. రష్యా రాజధాని వైపు వస్తున్న 450 డ్రోన్‌లను మార్గమధ్యంలో ధ్వంసం చేశారని మాస్కో మేయర్ సెర్గీ సోబియానిన్ తెలిపారు.

**అత్యాధునిక డ్రోన్ సాంకేతికత**

ఇదిలా ఉండగా, రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమై దాదాపు నాలుగేళ్లు గడుస్తుంది. అయినప్పటికీ ఇరుపక్షాలు సైనికులు ప్రతిదాడులతో విరుచుకుపడుతున్నారు. ఈ నేపథ్యంలో మరో కీలక పరిణామం జరిగింది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఉక్రెయిన్ సైనిక డ్రోన్ సాంకేతికతలో ప్రపంచ అగ్రగామిగా నిలిచింది. రష్యా లోపలికి చొచ్చుకెళ్లి దాడులు చేయడానికి, దేశీయంగా ఉత్పత్తి చేసిన సుదూర డ్రోన్‌లతో పాటు క్షిపణులను కూడా మోహరిస్తోంది. అయితే, ఉక్రెయిన్ డ్రోన్ సాంకేతికత ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వాలను, రక్షణ పరికరాల తయారీదారులను ఆకట్టుకుంది. శాంతి ఒప్పందం కోసం చర్చలు జరపాలని రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై ఒత్తిడి తేవాలని కీవ్ లక్ష్యంగా పెట్టుకుంది. కానీ, యుద్ధాన్ని ఆపే ఉద్దేశం ఉన్నట్లు పుతిన్ ఇప్పటివరకు ఎలాంటి సంకేతాలు చూపలేదు. దీంతో యుద్ధ ముగింపుపై తీవ్ర సందిగ్ధత నెలకొంది.

# అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండూ ముఖ్యమే

**గ్రే గ్రోత్ నుంచి గ్రీన్ గ్రోత్ వైపు పయనం**

ప్రపంచం ఇప్పుడు 'గ్రే గ్రోత్' నుంచి 'గ్రీన్ గ్రోత్' వైపు దృష్టి సారించాల్సిన తరుణం ఆసన్నమైందని చంద్రబాబు పిలుపునిచ్చారు. "కాంక్రీట్ జంగిల్స్ నుంచి పర్యావరణ హిత నిర్మాణాల గురించి అందరూ ఆలోచించాలి. అభివృద్ధి ఆగకూడదు, అదే సమయంలో పర్యావరణానికి గాయం చేయకూడదు. ఈ రెండింటినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలి" అని ఆయన సూచించారు.
దశాబ్దాలుగా నగరాల విస్తరణ 'గ్రే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్' ఆధారంగా జరిగిందని, ఇప్పుడు గ్రీన్ గ్రోత్, సర్క్యులర్ గ్రోత్, రీజెనరేటివ్ గ్రోత్ వంటి విధానాలు అత్యవసరమని పేర్కొన్నారు. వనరులను అధికంగా వాడే భవనాలు కాకుండా, తెలివిగా వినియోగించుకునే నిర్మాణాలను చేపట్టాలని ఉద్బోధించారు.
ప్రస్తుతం ఎదుర్కొంటున్న పర్యావరణ సమస్యలను దృష్టిలో ఉంచుకునే 'ది ఎర్త్ సెంటర్' నిర్మాణం జరిగిందని, ఇలాంటి భవనాలకే భవిష్యత్తు ఉంటుందని చంద్రబాబు ప్రశంసించారు. ప్రకృతి, సాంకేతికత, ఆధునిక పని వాతావరణాన్ని సమన్వయం చేస్తూ, రీ-సైకిల్ చేసిన టెర్రకోట వంటి పదార్థాలతో ఈ



భవనాన్ని నిర్మించడం అభినందనీయమని అన్నారు.

**పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత**

వాతావరణ మార్పులనేవి భవిష్యత్తులో ఎదురయ్యే సమస్య కాదని, ఇప్పటికే మన ముందున్న పెను సవాలని చంద్రబాబు హెచ్చరించారు. పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలని కోరారు. భవన నిర్మాణాల్లో 'నెట్ జీరో' విధానాన్ని పాటించాలని, సోలార్ విద్యుత్ వినియోగానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. "ప్రతి ఇంటి పైకప్పు ఒక పవర్ ప్లాంట్‌గా మారవచ్చు. ప్రతి నీటి చుక్కను తిరిగి వినియోగించవచ్చు. ప్రతి వ్యర్థాన్ని ఒక వనరుగా మార్చవచ్చు. నీటిని, నేలను కాపాడటమంటే సంపదను సృష్టించడమే" అని ఆయన వివరించారు. చెత్తను కంపోస్టుగా మార్చుకోవడం, రీ-యూజ్ విధానాన్ని అవలంబించడం ద్వారానే స్వచ్ఛ భారత్, స్వచ్ఛ కర్ణాటక, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధ్యమవుతుందని అన్నారు.

**అమరావతి - ఒక పర్యావరణ హిత నగరం**

వ్యవసాయంలో జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ గురించి మాట్లాడుతున్నామని, పట్టణాభివృద్ధిలోనూ అదే స్ఫూర్తి అవసరమని చంద్రబాబు అన్నారు. 2030 నాటికి 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి సాధించాలనే జాతీయ లక్ష్యంలో ఆంధ్రప్రదేశ్ కీలక భాగస్వామిగా ఉంటుందని తెలిపారు. ఏపీలో సుమారు 165 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని ప్రణాళిక చేస్తున్నామని వెల్లడించారు. ఈ స్ఫూర్తితోనే అమరావతిని పూర్తి పర్యావరణ హిత నగరంగా తీర్చిదిద్దుతున్నామని పునరుద్ఘాటించారు. ప్రజల అవసరాలను గుర్తిస్తూ, ప్రకృతిని పరిరక్షిస్తూ ఈ అద్భుత ప్రాజెక్టును రూపొందించిన విస్టా స్పేసెస్ బృందాన్ని, వెంకటరమణన్ అసోసియేట్స్ ప్రతినిధులను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

# ఎల్ నినో ప్రభావాన్ని ముందే అంచనా వేశాం

**అమరావతి (సింగిడి)**

ఎల్ నినో వంటి విపత్కర పరిస్థితుల్లో రైతులను ఆదుకోవడం, మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు పెరగకుండా నియంత్రించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని ఆయన స్పష్టం చేశారు. ఈ విపత్తును ఒక సవాలుగా స్వీకరించి, ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, "ఎల్ నినో పరిస్థితులను మనం ముందుగానే అంచనా వేశాం. దీనికోసం సిద్ధం చేసుకున్న యాక్షన్ ప్లాన్ ప్రకారం ప్రతి ఒక్కరూ పనిచేయాలి. ఎల్ నినో ప్రభావం కేవలం రైతులపైనే కాదు, అన్ని వ్యవస్థలపైనా పడుతుంది. కాబట్టి రైతులను కాపాడుకుంటూనే, వినియోగదారులపై ధరల భారం పడకుండా చూడటం మన బాధ్యత" అని అన్నారు. బియ్యం, ఉల్లి, పామాయిల్, కందిపప్పు వంటి నిత్యావసరాల ధరలను కచ్చితంగా అదుపులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. గోదాముల్లోని బియ్యం నిల్వలను మార్కెట్‌లోకి విడుదల చేసి, ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉల్లి కొరతను అధిగమించేందుకు ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేయడంతో పాటు, భవిష్యత్ డిమాండ్‌కు అనుగుణంగా ఉల్లి సాగును ప్రోత్సహించాలని తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను వివరిస్తూ, రాష్ట్రవ్యాప్తంగా 50.7 శాతం లోటు వర్షపాతం నమోదైందని, ముఖ్యంగా ప్రకాశం, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో 30.84 లక్షల హెక్టార్లకు గాను, ఇప్పటివరకు 79 శాతం భూముల్లోనే సాగు పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ఉండేందుకు పంటల బీమా మొత్తాలు వారికి అందేలా చూడాలని, డిమాండ్ ఆధారిత పంటల సాగుపై దృష్టి సారించాలని చెప్పారు. వర్షాధార పంటలు, ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ, హైరిస్క్ జోన్‌లోని ఉద్యాన పంటలను కాపాడేందుకు రూ.190 కోట్లు కేటాయించామని, ఆ నిధులను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఖరీఫ్ కంటింజెన్సీ ప్రణాళిక కోసం రూ.60 కోట్లు సిద్ధం చేశామని, 1.31 లక్షల క్వింటాళ్ల విత్తనాలను 80 శాతం సబ్సిడీతో రైతులకు సరఫరా చేశామని తెలిపారు. స్వయం సహాయక బృందాల ద్వారా కిచెన్ గార్డెన్‌లను ప్రోత్సహించి కూరగాయల ధరలను అదుపులో ఉంచవచ్చని అభిప్రాయపడ్డారు. పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ప్రస్తావిస్తూ, "2014-19 మధ్య మేము ఇరిగేషన్‌పై రూ.65 వేల కోట్లు ఖర్చు చేస్తే, 2019-24 మధ్య నాటి ప్రభుత్వం కేవలం రూ.22 వేల కోట్లే ఖర్చు చేసింది. ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ఎల్ నినో వంటి విపత్తు వచ్చినా ఇబ్బందులు ఉండేవి కావు. మేము అధికారంలోకి వచ్చాక రూ.3,500 కోట్లతో 100 రోజుల్లో హంద్రీ-నీవా కాలువలకు నీరందించగలిగాం" అని చంద్రబాబు గుర్తుచేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని, స్థానిక ఎన్నికలున్నా ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పర్యటించి రైతులకు ధైర్యం చెప్పాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగం, రైతు, సాగునీటి సంఘాలు కలిసికట్టుగా పనిచేసి ఎల్ నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కోవాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

## జోధ్‌పుర్‌లో
# భారత్- జపాన్ సైనిక విన్యాసాలు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20 (సింగిడి)**

భారత్– జపాన్ ద్వైపాక్షిక వాయుసేన సంయుక్త విన్యాసాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. 'వీర్ గార్డియన్-2026'లో భాగంగా జోధ్‌పుర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ నుంచి ఈ సంయుక్త విన్యాసాలు నిర్వహించారు. ఈ క్రమంలో భారత్‌కు చెందిన తేలికపాటి యుద్ధవిమానం తేజస్‌లో జపాన్ ఎయిర్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్ అధిపతి జనరల్ టకెహిరో మొరిటా, భారత వైమానిక దళం చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ కలిసి ప్రయాణించారు. ఈ ప్రయాణం అనంతరం భారత్, జపాన్‌ల వైమానిక దళ చీఫ్‌లు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఇరు దేశాల మధ్య సంబంధాలను ప్రస్తావించారు. కాగా, ఈ విన్యాసాల్లో ఐఏఎఫ్ తరఫున స్వదేశీ తేలికపాటి యుద్ధ విమానం తేజస్, సుకోయ్-30ఎంకెఐ, రఫేల్ వంటి అత్యాధునిక యుద్ధ విమానాలు పాల్గొనగా, జేఏఎస్‌డీఎఫ్ నుంచి ఎఫ్-2ఏ ఫైటర్ జెట్ పాల్గొంది.

**భారత్- జపాన్ రక్షణ సంబంధాలను ఐఏఎఫ్ చీఫ్ హర్షం**

తొలిసారిగా జపాన్ యుద్ధ విమానాలు భారత గడ్డపై నుంచి కార్యకలాపాలు సాగించడంపై భారత వైమానిక దళం చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు. భారత్-జపాన్ మధ్య రక్షణ సహకారంలో ఇదొక ప్రధాన మైలురాయి అని అభిప్రాయపడ్డారు. అలాగే ఇండో-పసిఫిక్‌లో భారత్, జపాన్‌ల మధ్య పెరుగుతున్న వ్యూహాత్మక సమన్వయాన్ని నొక్కి చెప్పారు. ఇరు దేశాల వైమానిక దళాల మధ్య బలపడుతున్న సంబంధాలను వర్ణించడానికి అమర్ ప్రీత్ సింగ్ ఒక ప్రాచీన సంస్కృత పదబంధాన్ని ఉటంకించారు.

**'తేజస్‌లో ప్రయాణాన్ని ఆయన ఆస్వాదించారని అనుకుంటున్నాను'**

జపాన్ ఎయిర్ సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్స్ అధిపతి జనరల్ టకెహిరో మొరిటా ఈ రోజు (ఆదివారం) తేజస్‌లో ప్రయాణించారని భారత వైమానిక దళం చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ తెలిపారు. ఆయన ఈ విమానయానాన్ని ఆస్వాదించారని తాను ఆశిస్తున్నానని చెప్పారు. అయితే, భారత రక్షణ విమానయాన రంగం పరిశోధన, అభివృద్ధి, ఉత్పత్తిలో వేగంగా అభివృద్ధి చెందుతోందని అభిప్రాయపడ్డారు. పెద్ద సంఖ్యలో తేజస్ విమానాలకు ఆర్డర్లు ఇచ్చినప్పటికీ, ప్రపంచ సరఫరా గొలుసు సమస్యల కారణంగా కొన్ని డెలివరీలు ప్రభావితమయ్యాయని పేర్కొన్నారు. అధునాతన మధ్య తరహా యుద్ధ విమానమైన తేజస్ ఎంకే-2 అభివృద్ధి భారతదేశ రక్షణ విమానయాన పరిశ్రమ అభివృద్ధిని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్తుందన్నారు.

**మేక్ ఇన్ ఇండియాకు చిహ్నంగా తేజస్ : జపాన్ వైమానిక దళ చీఫ్**

మరోవైపు, భారతీయ యుద్ధ విమానాన్ని నడిపే అవకాశం లభించినందుకు జపాన్ ఎయిర్ సెల్ఫ్-డిఫెన్స్ ఫోర్స్ చీఫ్ జనరల్ టకెహిరో మొరిటా సంతోషం వ్యక్తం చేశారు. అలాగే, ఈ అనుభవం భారత్-జపాన్ మధ్య పెరుగుతున్న రక్షణ భాగస్వామ్యంలో ఒక కీలకమైన అంశమని పేర్కొన్నారు. తేజస్ యుద్ధ విమానాన్ని దేశ సాంకేతిక ఆవిష్కరణకు, మేక్ ఇన్ ఇండియా కార్యక్రమానికి చిహ్నంగా అభివర్ణించారు. విమానాన్ని నడుపుతున్నప్పుడు, దీని అభివృద్ధికి దోహదపడిన సైనిక, పారిశ్రామిక రంగాల్లోని ఎందరో వ్యక్తుల కృషిని తాను స్మరించుకున్నానని చెప్పారు. తేజస్‌లో ప్రయాణాన్ని తాను ఒక అమూల్యమైన అనుభవంగానే కాకుండా, ఎన్నో ఏళ్లుగా మన రెండు దేశాల వైమానిక దళాల మధ్య ఏర్పడిన నమ్మకం, విశ్వాసం, భాగస్వామ్యానికి ఒక శక్తివంతమైన చిహ్నంగా కూడా గుర్తుంచుకుంటానని వివరించారు.

## ఆస్తులపై విచారణకు
# మేం సిద్ధం.. మీరు సిద్ధమా?

రాష్ట్రంలో జరుగుతున్న సర్వేలన్నీ కేసీఆర్‌కు అనుకూలంగా ఉన్నాయని, అందుకే కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు పెరిగాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని చెప్పుకుంటూనే రాక్షస పాలన సాగిస్తోందని విమర్శించారు. "అవకాశం ఉన్నప్పటికీ విద్యుదుత్పత్తి చేయకుండా బొగ్గు కొరత అనే సాకుతో కరెంట్ కోతలు విధిస్తున్నారు. కేసీఆర్ గారి హయాంలో 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తే.. ఇప్పుడు కేవలం 6-7 గంటల నాణ్యత లేని విద్యుత్ మాత్రమే వస్తోంది. దీంతో పంటలు ఎండిపోతున్నాయి. కృష్ణా నదిలో నీళ్లున్నా కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి లిఫ్టులను ఆన్ చేయడం లేదు," అని హరీశ్ రావు మండిపడ్డారు. మూడు పంటల నుంచి రైతుబంధు నిధులు విడుదల చేయలేదని, కరోనా కష్టకాలంలో కూడా కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు ఆపలేదని గుర్తుచేశారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిపై ప్రమాణం చేసి కూడా సీఎం రేవంత్ రెడ్డి దేవుణ్ని మోసం చేశారని ఆరోపించారు. బాండ్ పేపర్లపై ఇచ్చిన 420 హామీలు, గొర్రెల పంపిణీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాల ఊసే లేదని విమర్శించారు. తనను ప్రశ్నించినందుకు పిట్ట బెదిరింపులకు పాల్పడితే భయపడేది లేదని, ఆయన సంగతి చూస్తామని హెచ్చరించారు.
"కేసీఆర్‌పై బురద చల్లితే రైతులకు న్యాయం జరగదు. పాలించడం చేతకాకపోతే నుదుటిపై 'నామమ్' రాసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలి" అని హరీశ్ రావు హితవు పలికారు.



# బంగాళాఖాతంలో అల్పపీడనం

పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురుగాలులు కూడా వీస్తాయని ఆదివారం విడుదల చేసిన బులెటిన్‌లో స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే, ఆది, సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు పడొచ్చని వాతావరణ శాఖ తెలిపింది. ఇదే సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తూ, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆదివారం ఉదయం ఉత్తర అండమాన్ సముద్రం, దాని పరిసర ప్రాంతాల్లో కేంద్రీకృతమైన అల్పపీడనం, పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతోంది. ఇది సోమవారం (సెప్టెంబర్ 21) నాటికి తూర్పు మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా, మంగళవారం నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండంగా బలపడనుంది. బుధవారం ఉదయానికి ఈ వాయుగుండం ఉత్తర ఆంధ్రప్రదేశ్-దక్షిణ ఒడిశా తీరాలకు సమీపంలోకి చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో సెప్టెంబర్ 24న తెలంగాణలోని మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ ప్రత్యేకంగా హెచ్చరించింది. అలాగే ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల సహా మరికొన్ని జిల్లాల్లో గంటకు 50-60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది.
ఇదిలా ఉండగా, దక్షిణ కోస్తాంధ్ర, దాని పరిసర పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని వాతావరణ కేంద్రం వివరించింది. గడిచిన 24 గంటల్లో నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో అత్యధికంగా 13.9 సెం.మీ., ములుగు జిల్లా ఏటూరునాగారంలో 10.4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. తాజా హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## ఏపీలో భారీగా
# ఐపీఎస్‌ల బదిలీలు

ఈ బదిలీల్లో పలు కీలక విభాగాలతో పాటు, మూడు జిల్లాలకు కొత్త ఎస్పీలను నియమించారు. వివరాల్లోకి వెళితే, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (SPF) డీజీగా ఉన్న సి.హెచ్. త్రివిక్రమ్ వర్మను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (FSL) డైరెక్టర్‌గా నియమించారు. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డైరెక్టర్‌గా పనిచేస్తున్న జయలక్ష్మి ని సీఐడీ సైబర్ క్రైమ్స్ ఐజీగా బదిలీ చేశారు. ఏపీఎస్పీ బెటాలియన్ల ఐజీగా ఉన్న బి. రాజకుమారిని రైల్వేస్ ఐజీగా నియమిస్తూ, సీఐడీ మహిళా భద్రత విభాగం ఐజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ముంబై నటి కాదంబరి జెత్వానీ వ్యవహారంలో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ ఆరోపణలు ఎదుర్కొన్న ఐపీఎస్ అధికారులు కాంతి రాణా టాటా, విశాల్ గున్నీ సస్పెండైన సంగతి తెలిసిందే. ఇటీవలే ప్రభుత్వం వీరిద్దరిపై సస్పెన్షన్ ఎత్తివేసింది. దాంతో వారి పోస్టింగ్ కు మార్గం సుగమం అయింది. ఈ క్రమంలో ఈ ఇద్దరు అధికారులకు తాజా బదిలీల్లో పోస్టింగ్ ఇచ్చారు. కొంతకాలంగా పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న కాంతి రాణాకు ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ ఐజీగా కీలక బాధ్యతలు ఇచ్చారు. అదేవిధంగా, పోస్టింగ్ కోసం వేచి ఉన్న మరో అధికారి విశాల్ గున్నీకి శిక్షణ విభాగం డీఐజీగా బాధ్యతలు అప్పగించారు. గ్రేహౌండ్స్ డీఐజీగా ఉన్న బాబుజీ అట్టాడను టెక్నికల్ సర్వీసెస్ డీఐజీగా బదిలీ చేశారు. జిల్లా స్థాయిలోనూ కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. పోలవరం ఓఎస్డీగా ఉన్న పంకజ్ కుమార్ మీనాను మార్కాపురం జిల్లా ఎస్పీగా నియమించారు. సీఐడీ ఎస్పీగా ఉన్న కె. చక్రవర్తిని పోలవరం జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు. ఇక సీఎం సెక్యూరిటీ గ్రూప్ (సీఎంఎస్‌జీ) ఎస్పీగా ఉన్న జగదీశ్ అడహళ్లికి పల్నాడు జిల్లా ఎస్పీగా బాధ్యతలు అప్పగించారు. బదిలీ అయిన అధికారులు తక్షణమే తమ కొత్త బాధ్యతలు స్వీకరించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. పరిపాలనా సౌలభ్యం, శాఖల బలోపేతం లక్ష్యంగా ఈ బదిలీలు చేపట్టినట్లు తెలుస్తోంది.




# 'సర్' చిత్రవిచిత్రాలు

తాజాగా విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌తోపాటు ఆయన భార్య క్యోకో జైశంకర్‌కు ఈసీ నోటీసులు జారీ చేసింది. 'అన్‌మ్యాప్డ్ విత్ లాస్ట్ ఎస్ఐఆర్' కింద ఈ నోటీసులు జారీ అయ్యాయి. వారి ప్రస్తుత వివరాలను ఎస్ఐఆర్-2002 వివరాలతో మ్యాపింగ్ చేయకపోవడంతోనే నోటీసులు జారీ చేసినట్లు ఈసీ వెల్లడించింది. జైశంకర్, ఆయన భార్యకు న్యూఢిల్లీ అసెంబ్లీ పరిధిలోని సుందర్‌బాగ్‌లో ఓటు హక్కు ఉంది. మరోవైపు సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ భార్య షెబా బ్రిట్టాస్, కుమారుడు ఆనంద్‌కు కూడా 'సర్' నోటీసులు అందాయి. గత రికార్డులతో షెబా పేరు సరిపోలకపోవడంతో ఆమెకు, ఆనంద్‌కు నోటీసులు జారీ అయ్యాయి. ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, ఆయన భార్య సునీతా ద్వివేదికి కూడా 'అన్‌మ్యాప్డ్ విత్ లాస్ట్ ఎస్ఐఆర్' కింద నోటీసులిచ్చినట్లు తెలుస్తోంది. దేశ రాజధాని ఢిల్లీలో ఓటర్ల జాబితా ప్రత్యేక తీవ్ర సవరణ ప్రక్రియ పొలిటికల్‌గా తీవ్ర కలకలం రేపుతోంది. ఓటర్ల వివరాల్లో వ్యత్యాసాలు ఉన్నాయన్న కారణంతో ఎన్నికల సంఘం ఏకంగా 33.13 లక్షల మందికి పైగా ఓటర్లకు నోటీసులు జారీ చేసింది. ఈ జాబితాలో మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీ , మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా వంటి ప్రముఖులు కూడా ఉండటం టెన్షన్‌కు దారితీసింది. బీజేపీ దిగ్గజం, మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీ, ఆయన కుమార్తె ప్రతిభా అద్వానీ, కోడలు గీతికల పేర్లు 2002 నాటి ప్రత్యేక తీవ్ర సవరణ ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ కాలేదు. దీంతో వారి కుటుంబానికి ఎన్నికల సంఘం ఇవాళ నోటీసులు జారీ చేసింది. అయితే, అద్వానీ కుమారుడు జయంత్ మ్యాపింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. వీరందరూ న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్లుగా ఉన్నారు. ఇక ఆమ్ ఆద్మీ పార్టీ నేత, ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా, ఆయన సతీమణి సీమ, కుమారుడు మీర్ పేర్ల వివరాల్లోనూ వ్యత్యాసాలు ఉన్నట్లుగా గుర్తించిన అధికారులు వారికి కూడా నోటీసులు ఇష్యూ చేశారు.

## సూర్యాపేటలో
# ఘోర ప్రమాదం

**సూర్యాపేట, సెప్టెంబర్ 20 (సింగిడి)**

సూర్యాపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఓ కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో మంటలు చెలరేగి, అందులో ప్రయాణిస్తున్న ప్రముఖ న్యూరో సర్జన్ సజీవదహనమయ్యారు. ఈ విషాద ఘటన పిల్లలమర్రి శివారులోని హైదరాబాద్-ఖమ్మం జాతీయ రహదారిపై జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఖమ్మంలోని మమత ఆసుపత్రిలో న్యూరో సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ కాసకుర్తి జగదీశ్, తన కారులో ఖమ్మం వైపు వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. పిల్లలమర్రి వద్దకు రాగానే ఆయన ప్రయాణిస్తున్న కారు అకస్మాత్తుగా అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు కారు మొత్తం వ్యాపించడంతో డోర్లు లాక్ అయ్యాయి. దీంతో డాక్టర్ జగదీశ్ బయటకు వచ్చే అవకాశం లేకపోయింది. అగ్నిగోళంలా మారిన కారులో ఆయన మంటల్లో చిక్కుకుని అక్కడికక్కడే సజీవదహనమయ్యారు. రహదారిపై వెళ్తున్న ఇతర వాహనదారులు ఈ దృశ్యాన్ని చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పశ్చిమాసియా ఉద్రిక్తతలు

**న్యూఢిల్లీ (సింగిడి)**

ఇరాన్ మద్దతుగల హూతీలు సౌదీ అరేబియాపై దాడులు చేయడంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా విదేశాంగ శాఖ తమ పౌరులకు సెక్యూరిటీ అలర్ట్ జారీ చేసింది. పశ్చిమాసియాలో దాడులు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉండడంతో ఆయా దేశాల్లో ఉన్న పౌరులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. విమానాల రద్దు, గగనతల మూసివేతలు, ఇతర ప్రయాణ అంతరాయాలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించింది. 'సౌదీపై హూతీల దాడి అనంతరం పశ్చిమాసియా లో సైనిక ఘర్షణ వేగంగా తీవ్రరూపం దాల్చే అవకాశముంది. అక్కడి దేశాలకు ప్రయాణించాల్సి ఉన్న ప్రయాణికులు పునరాలోచించుకోవాలి.

ప్రభాతనవ
సింగిడి
SINGIDI తెలుగు దినపత్రిక
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
సోమవారం
21-9-2026

# అద్భుతమైన చికిత్స అందించి పసి ప్రాణానికి పునర్జన్మనిచ్చిన శిశు రక్ష ఆసుపత్రి

- ఆసుపత్రి డాక్టర్లను, యాజమాన్యాన్ని అభినందించిన జగ్గారెడ్డి



**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 20 (సింగిడి):** సంగారెడ్డి పట్టణంలోని శిశు రక్ష చిల్డ్రన్స్ హాస్పిటల్ డాక్టర్లు అరుదైన చికిత్స అందించి నవజాత శిశువు ప్రాణాలను కాపాడారు. నెలలు నిండకముందే, కేవలం 980 గ్రాముల బరువుతో జన్మించిన శిశువుకు పునర్జన్మనిచ్చారు. ఊపిరితిత్తులు డెవలప్ కాకపోవడంతో పాటు కిడ్నీలు పనిచేయకపోవడంతో డయాలసిస్ చేయాల్సి వచ్చింది. వెంటిలేటర్ పై శిశువును ఉంచి విజయవంతంగా చికిత్స అందించారు. 50 రోజుల చికిత్స తర్వాత ఆ పసి బిడ్డ బరువు 1.6 కిలోలకు పెరిగింది.

**ఆసుపత్రికి వెళ్లి అభినందించిన జగ్గారెడ్డి..**

అత్యంత విషమంగా ఆరోగ్య పరిస్థితి ఉన్న నవజాత శిశువును శిశురక్ష ఆసుపత్రి డాక్టర్లు బతికించారని తెలుసుకున్న జగ్గారెడ్డి స్వయంగా అక్కడికి వెళ్లారు. నవజాత శిశువును చూసి, డాక్టర్లను ఆసుపత్రి యాజమాన్యాన్ని అభినందించారు. హైదరాబాద్ కి వెళ్లాల్సిన అవసరం లేకుండా సంగారెడ్డి లోనే అత్యాధునిక వైద్య సేవలు అందించి, పసిబిడ్డకు ప్రాణం పోసిన తీరును ఆయన ప్రశంసించారు. శిశు రక్ష ఆసుపత్రి డాక్టర్లు ఆ శిశువును కంటికి రెప్పలా కాపాడి, ఆ తల్లిదండ్రుల కళ్ళల్లో సంతోషం నింపారని ఆయన వివరించారు.

**సగం బిల్లు మాత్రమే తీసుకున్న ఆసుపత్రి యాజమాన్యం..**

50 రోజుల చికిత్స కు గాను దాదాపు నాలుగు లక్షల పైగా బిల్లు అయింది. శిశువు తల్లిదండ్రులు రెండు లక్షల వరకు చెల్లించారు. మిగతా మొత్తాన్ని తాను చెల్లిస్తానని జగ్గారెడ్డి తెలిపారు. కానీ ఆసుపత్రి యాజమాన్యం బిల్లులో సగం మినహాయింపు ఇచ్చింది.

# గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందుబాటులోకి తేవడం అభినందనీయం

- పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం ప్రశంసనీయం
- మాజీ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్





**వికారాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 20(సింగిడి):** గ్రామీణ ప్రాంతాల్లో పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని మాజీ మంత్రి డాక్టర్ ఏ. చంద్రశేఖర్ అన్నారు. మోమిన్ పేట మండల పరిధిలోని మొరంగపల్లి గ్రామంలో మన చంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రో హెల్త్ హాస్పిటల్ మణికొండ వారు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అనేక మంది ఆర్థిక ఇబ్బందుల వల్ల అనారోగ్య సమస్యలకు గురైన వారికి సకాలంలో వైద్యం చేయించుకోలేకపోతున్నారని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించి ప్రజలకు వైద్య పరీక్షలు, మందులు అందించడం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం సేవా కార్యక్రమాలను చేపడుతున్న మన చంద్ర ఫౌండేషన్ చైర్మన్ చంద్రప్రియను ఆయన అభినందించారు. ఆరోగ్యం పై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. కేవలం పట్టణ ప్రాంతాలకే వైద్య సేవలు పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కూడా నాణ్యమైన వైద్యం అందేలా సేవా సంస్థలు ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలిచే ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. మన చంద్ర ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఏ. చంద్రప్రియ పుట్టినరోజు సందర్భంగా గ్రామంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో 500 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. మహిళలు, వృద్ధులు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణతో పాటు మహిళలు వృద్ధులు చిన్నారులు పేద కుటుంబాలకు అండగా నిలవడం ఫౌండేషన్ లక్ష్యమని డాక్టర్ ఎం, చంద్రప్రియ అన్నారు. భవిష్యత్తులో గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంగి పాఠశాల చైర్మన్ ప్రమీల, మన చంద్ర ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ ఏ చంద్రప్రియ అనిల్, రో హెల్త్ ఆసుపత్రి వైద్యులు, సర్పంచ్ అరుణ బిచ్చయ్య మాజీ ఎంపీపీ ఒగ్గు మల్లయ్య, మాజీ సర్పంచ్ పన్నాల శ్రీనివాసరెడ్డి నాయకులు మాచిరెడ్డి మధుసూదన్ రెడ్డి, మాజీ సర్పంచ్ జనార్దన్ రెడ్డి. వార్డు సభ్యులు గ్రామస్తులు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జనాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు

**నిమజ్జన భద్రత ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్**



**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 20 (సింగిడి):** సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా వినాయక శోభా యాత్ర, నిమజ్జనాలు శాంతియుత వాతావరణంలో జరిగేలా పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ తెలిపారు. ఈ సందర్భంగా హత్నూర మండలం, దౌల్తాబాద్, బోరపట్ల గ్రామాలలో నిమర్జనాలు జరగనున్న చెర్వులను సందర్శించి, భద్రత ఏర్పాట్ల పై అధికారులతో సమీక్షించారు. నిమార్జనాలు ప్రశాంతంగా జరిగేలా అవసరమైన లైట్స్, క్రేన్లు, జగ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. గణేష్ శోభాయాత్రలు జరిగే మార్గాల్లో రోడ్ల పరిస్థితి, అవసరమైన మరమ్మతులు, చెర్వుల వద్ద బారికేడింగ్, భద్రతా లైటింగ్, పారిశుద్ధ్య ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. గణేష్ నిమజ్జనం సందర్భంగా భక్తులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ వెంబడి హత్నూర ఏంఆర్ఓ షేక్ పర్వీన్, జిన్నారం ఇన్స్పెక్టర్ రమణ రెడ్డి, వివిధ శాఖలకు చెందిన అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# వెదురు, ఆయిల్‌పాం సాగుతో రైతులకు అదనపు ఆదాయం

**ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి**

**జిల్లా ఉద్యాన అధికారి సోమేశ్వరరావు**



**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 20(సింగిడి):** రైతులు సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగు పై దృష్టి సారించి, తక్కువ నీటి వినియోగంతో మెరుగైన దిగుబడులు, అదనపు ఆదాయం పొందేలా పంటల మార్పిడిని ప్రోత్సహించాలని జిల్లా ఉద్యాన అధికారి పి. సోమేశ్వరరావు సూచించారు. కోహిర్ మండలం పైడిగుమ్మల్ గ్రామంలో రైతు రామకృష్ణ ప్రసాద్ పొలంలో వెదురు సాగుపై అవగాహన సదస్సుతో పాటు ఆయిల్‌పామ్ సాగుపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖ అధికారులు రైతులకు వెదురు, ఆయిల్‌పామ్ సాగు విధానాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, రాయితీలు, పంటల ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు.

**వెదురు సాగుకు ప్రభుత్వ రాయితీలు..**

జాతీయ వెదురు మిషన్‌లో భాగంగా ఈ ఏడాది పొలం గట్లపై వెదురు మొక్కలను సాగు చేసుకునే రైతులకు ఒక్కో మొక్కకు రూ. 90 చొప్పున సబ్సిడీ అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా బ్లాక్ ప్లాంటేషన్‌లో భాగంగా ఎకరానికి రూ. 14,400 చొప్పున సబ్సిడీను ఉద్యాన శాఖ ద్వారా అందిస్తున్నట్లు వివరించారు. రైతులు అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రత్యామ్నాయ పంటల సాగును చేపట్టాలని జిల్లా ఉద్యాన అధికారి సోమేశ్వరరావు సూచించారు.

**ఆయిల్‌పామ్ సాగుకు 90 శాతం రాయితీ..**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆయిల్‌పామ్ విస్తీర్ణ కార్యక్రమంలో భాగంగా రైతులకు 90 శాతం రాయితీతో ఆయిల్‌పామ్ మొక్కలు అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మొదటి నాలుగు సంవత్సరాల వరకు అంతర పంటల సాగు, పంట నిర్వహణ ఖర్చుల నిమిత్తం ఎకరానికి రూ. 4,200 చొప్పున ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేస్తుందని వివరించారు. రైతు రామకృష్ణ ప్రసాద్ పొలంలో ఆయిల్‌పామ్ తోటలో కోకోవాను అంతర పంటగా సాగు చేస్తున్న విధానాన్ని రైతులకు ప్రత్యక్షంగా వివరించారు. ఆయిల్‌పామ్ తోటల్లో కోకోవాను అంతర పంటగా సాగు చేయడం ద్వారా భూమిని సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు అదనపు ఆదాయం పొందే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుకు నీటి వసతి అత్యంత అవసరమని, ప్రతి మొక్కకు అవసరమైన మేరకు నీరు అందించేలా డ్రిప్ పరికరాలను కూడా రాయితీపై అందిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. జిల్లాలో ప్రస్తుతం సుమారు 4,994 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు జరుగుతోందని జిల్లా ఉద్యాన అధికారి పి. సోమేశ్వరరావు తెలిపారు. ప్రస్తుతం ఆయిల్‌పామ్ గెలల ధర టన్నుకు సుమారు రూ. 24 వేల వరకు ఉందని పేర్కొంటూ, రైతులు ఆయిల్‌పామ్ సాగుపై మరింత ఆసక్తి చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి కే. సునీత రోజ్, కేవీకే శాస్త్రవేత్త శైలజ, హెచ్‌ఓ సతీష్, గోద్రెజ్ అగ్రోవేట్ సంస్థ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అధికారులు నిధులు కేటాయించడంలో పక్షపాతం

**రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి కరణం కీర్తి రామకృష్ణ**



**వికారాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 20(సింగిడి):** సర్పంచుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలమవుతున్నారని రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి కరణం కీర్తి రామకృష్ణ ఆరోపించారు. మోమినిపేట మండల కేంద్రంలో ఎంపీడీవో సృజన సాహిత్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా జెడ్పి సీఈవో సుధీర్, మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో మంజూరైన డ్వాక్రా భవనాలను, అంగన్వాడి కేంద్రాలు, వర్క్ షెడ్లు, పల్లె దవాఖానాలను ఈనెల లోపు త్వరితగతిన పూర్తి చేయాలని వారు ఆదేశించారు. ప్రభుత్వం మంజూరు చేసిన మొదటి విడత ఇందిరమ్మ ఇండ్లను సకాలంలో పూర్తి చేసే విధంగా ఆయా గ్రామాల సర్పంచులు కార్యదర్శులు ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సదానందం మండల తాసిల్దార్ మునీరుద్దీన్, ఎంపీఓ సంజయ్ కుమార్. ఏవో రామకృష్ణారెడ్డి, ఏపిఎం మధుకర్,ఏపీవో శంకర్ మండల సర్పంచ్ల సంఘ అధ్యక్షులు కోస్గి సురేందర్, ఆయా శాఖల మండల శాఖ అధికారులు, ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అనాథ వృద్ధ మహిళకు ఆశ్రమంలో ఆశ్రయం



**సంగారెడ్డి బ్యూరో , సెప్టెంబర్ 20 (సింగిడి):** పటాన్‌చెరు మండల పరిషత్ దుకాణ సముదాయం సమీపంలో అనాథగా ఉన్న వృద్ధ మహిళకు జిల్లా మహిళా, శిశు, వికలాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారులు తక్షణమే స్పందించి ఆశ్రయం కల్పించారు. పటాన్‌చెరు మండల పరిషత్ దుకాణ సముదాయం పక్కన గుర్తుతెలియని వ్యక్తులు సుమారు నాలుగు రోజుల క్రితం వృద్ధ మహిళను వదిలి వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. అప్పటి నుంచి ఆమె అక్కడే ఉండటంతో పరిసర ప్రాంతాల వారు మానవతా దృక్పథంతో ఆమెకు భోజనం అందిస్తూ వచ్చారు. ఈ విషయాన్ని స్థానికులు జిల్లా మహిళా, శిశు, వికలాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారిణి లలిత కుమారి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆమె, వృద్ధ మహిళకు సురక్షితమైన ఆశ్రయం కల్పించాలని జిల్లా ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి సతీష్ కు ఆదేశించారు. జిల్లా సంక్షేమ అధికారి ఆదేశాల మేరకు ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి తన సిబ్బందితో కలిసి వృద్ధ మహిళ ఉన్న ప్రదేశానికి చేరుకుని ఆమెకు భోజనం అందించారు. అనంతరం అవసరమైన దుస్తులు అందించి, ఆమెను అమీన్‌పూర్‌లోని మహిమ మినిస్ట్రీస్ వృద్ధుల ఆశ్రమానికి సురక్షితంగా తరలించి ఆశ్రయం కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అనాథలు, నిరాశ్రయులు, వృద్ధులు, మహిళలు తదితరుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, ఎవరైనా నిరాశ్రయులుగా కనిపిస్తే సంబంధిత సంక్షేమ శాఖ అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో వీణ, ప్రమీల, జబ్బర్, అల్తాఫ్ తదితర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ఆక్టావ్ సంస్థల చేయూత

**అరుంధతి నగర్ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన**



**జవహర్ నగర్, సెప్టెంబర్ 20(సింగిడి):** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కీసర సర్కిల్ చంద్రపురి డివిజన్ పరిధిలోని అరుంధతి నగర్ ప్రాథమిక పాఠశాలలో 'యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ 'ఆక్టావ్' సంస్థల ఉమ్మడి సహకారంతో అభివృద్ధి చేసిన మౌలిక వసతుల ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన నూతన సదుపాయాలను ఈ సందర్భంగా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమం అనంతరం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో హైదరాబాద్ మేనేజర్ అమర్నాథ్ యాదవ్, ఆస్మా, మాట్లాడుతూ... విద్యార్థుల మానసిక, మేధో వికాసానికి అవసరమైన నైపుణ్యాల అభివృద్ధిపై తల్లిదండ్రులకు వివరించారు. అదేవిధంగా పాఠశాలలో కొత్తగా సమకూర్చిన మౌలిక వసతుల ప్రాముఖ్యతను, వాటిని విద్యార్థులు ఏ విధంగా ఉపయోగించుకోవాలో స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులతో పాటు, ఇతర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. అలాగే స్థానిక బస్తీ యువకులు కె. విక్రమ్, శ్రీను, బబ్లు, నరేంద్ర, పి. మహేష్, కె. మహేష్, నరసింహ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

# విద్యుత్ సరఫరా పై రైతుల ఆందోళన



**వికారాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 20 (సింగిడి):** రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా లేకపోవడంతో పంటలు నష్టపోతున్నారని ఆరోపిస్తూ రైతులు జిల్లా పరిధిలోని మోమిన్ పేట విద్యుత్ సబ్ స్టేషన్ ముందు మోమిన్ కలాన్ తదితర గ్రామాల రైతులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు మాట్లాడుతూ విద్యుత్ సరఫరా లేక స్టార్టర్లు పాడైపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వికారాబాద్ జిల్లా ప్రాతినిధ్యం వహిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ లు స్పందించి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు లేనిపక్షంలో తీవ్ర నష్టానికి అన్నారు. ఎల్నినో ప్రభావంతో ఎండ తీవ్రత అధికంగా ఉందని రైతులు అన్నారు. పంటలకు సాగునీరందించాలంటే నాణ్య మైన విద్యుత్ సరఫరా అనివార్యమని అన్నారు. రైతులు మనుగడ సాగించాలంటే ప్రభుత్వం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయించాలని వారు అన్నారు. లేనిపక్షంలో రైతులు అధోగతిపాలవుతారని వారు చెప్పారు.

# ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

- వృద్ధాశ్రమంలో ఘనంగా అన్నదానం



**రామచంద్రపురం, సెప్టెంబర్ 20(సింగిడి):** పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని వాణినగర్‌లో ఉన్న 'ది నెస్ట్' వృద్ధాశ్రమంలో ఘనంగా సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. రామచంద్రపురం మండలం పరిధిలోని తెల్లాపూర్ మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కోటే హర్ష ఆధ్వర్యంలో ఆశ్రమంలోని దాదాపు 90 మంది వృద్ధులకు ప్రత్యేకంగా పౌష్టికాహారంతో కూడిన భోజన వసతి కల్పించి, అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకుడు వంశీ కృష్ణ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా తెల్లాపూర్ బీఆర్ఎస్ నాయకుడు కోటే హర్ష చొరవ తీసుకొని తమ ఆశ్రమంలోని వృద్ధులకు ప్రత్యేక భోజనాన్ని ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. గతంలోనూ తమ ఆశ్రమ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి గారు ఆర్థికంగా, అన్ని విధాలా సంపూర్ణ సహకారం అందించారని ఆయన కృతజ్ఞతాపూర్వకంగా గుర్తుచేసుకున్నారు. పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి హ్యాట్రిక్ విజయం సాధించి మూడోసారి అసెంబ్లీలో అడుగుపెట్టిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఇలాంటి జన్మదినాలు మరెన్నో జరుపుకోవాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సేవా దృక్పథంతో వృద్ధులకు అండగా నిలిచిన కోటే హర్ష బృందానికి ఆశ్రమ నిర్వాహకులు, వృద్ధులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ ప్రజాసేవలో ఎల్లప్పుడూ ముందుండాలని వృద్ధులు మనస్ఫూర్తిగా దీవించారు.

# విఘ్నేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

**మున్సిపల్ చైర్పర్సన్ గడ్డం అనన్య**



**వికారాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 20 (సింగిడి):** వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని వార్డు నెంబర్ 32 శివరాంనగర్ కాలనీలో కౌన్సిలర్ బాదాం. అనురాధఅశోక్ ఆధ్వర్యంలో వినాయక మండపం వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధులుగా మున్సిపల్ ఛైర్పర్సన్ గడ్డం. అనన్య, వికారాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల. శ్రీనివాస్ ముదిరాజ్, వైస్ చైర్మన్ మల్లేశం, మాజీ వైస్ చైర్మన్, సీ రమేష్ కుమార్లు భక్తి శ్రద్దలతో పూజ కార్యక్రమాలు నిర్వహిరచారు. ఈ సందర్భంగా ఛైర్పర్సన్ అనన్య మాట్లాడుతూ మానాషిక ప్రశాంతతకు ఆధ్యాత్మిక చింతనతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.


# పేదల ఆరోగ్య రక్షనే.. ధ్యేయంగా వైద్య శిబిరాలు

- జవహర్‌నగర్‌లో ఉచిత వైద్య శిబిరం




**జవహర్ నగర్,సెప్టెంబర్ 20(సింగిడి):** పేదల ఆరోగ్య రక్షణ ధ్యేయంగా పనిచేస్తామని గడ్డం రాజ్ కుమార్ పేర్కొన్నారు. స్మైల్ ఫౌండేషన్ సహకారంతో యూనివర్సల్ హ్యూమానిటీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బీజేఆర్ నగర్ మామిడి తోటలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్ వైద్య నిపుణులు డాక్టర్ గడ్డం రాజకుమార్, జె. గౌతమీ, మెడ శిరీష, సీహెచ్‌ఓ ఎండీ సాదిక్ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఆరోగ్య సూచనలు అందించారు. పేద, మధ్యతరగతి ప్రజలు, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఈ సేవలను సద్వినియోగం చేసుకున్నారు. శిబిరాన్ని విజయవంతం చేయాలని డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ పిలుపునివ్వగా, ట్రస్ట్ ప్రతినిధులు కొలిపాక సాయికిరణ్, కొలిపాక కళ్యాణి ఏర్పాట్లను సమన్వయం చేశారు.

# కొల్చారం పోలీస్ స్టేషన్‌ను తనిఖీచేసిన అదనపు ఎస్పి




**కొల్చారం, సెప్టెంబర్ 20(సింగిడి):** మెదక్ జిల్లా మండల కేంద్రమైన కొల్చారంలోని పోలీస్ స్టేషన్ ను మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ శనివారం నాడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో భాగంగా పోలీస్ స్టేషన్ లోని రికార్డులను వివిధ రకాల కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్లో సీజ్ చేసిన వాహనాల వివరాలను, వాటికి సంబంధించిన కేసు వివరాలను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణ పరిసరాలను పరిశీలించి వివిధ సూచనలు తెలియజేశారు. త్వరలో జరిగే వినాయక నిమజ్జనానికి తగిన పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని స్థానిక ఎస్సై మమ్మద్ మొయినుద్దీన్ కు ఆదేశాలిచ్చారు. నిమజ్జన సమయంలో గ్రామా లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా , ప్రతినిత్యం రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ రూరల్ సీఐ , పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# ఘనంగా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి జన్మదిన సంబరాలు






**అమీన్‌పూర్, సెప్టెంబర్ 20(సింగిడి):** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం అమీన్‌పూర్ డివిజన్ పరిధిలోని 'మహిమా మినిస్ట్రీస్' అనాథాశ్రమంలో పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి 64వ జన్మదిన వేడుకలు అత్యంత ఘనంగా, సేవా దృక్పథంతో జరిగాయి. అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యువ నాయకులు తుమ్మల రుశ్వంత్ రెడ్డి ఎమ్మెల్యే జిఎంఆర్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కృష్ణ,మంజుల ప్రమోద్ రెడ్డి, కొల్లూరు చంద్రకళ గోపాల్ యువ నాయకులు గూడెం సంతోష్ రెడ్డి, గూడెం సందీప్ రెడ్డి మరియు స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పూరీ జగన్నాథుని దర్శనార్థం వెళ్లడంతో, ఆయన ఆశీస్సులతో యువ నాయకులు తుమ్మల రుశ్వంత్ రెడ్డి అనాథ ఆశ్రమ చిన్నారుల సమక్షంలో 64 కేజీల భారీ కేక్‌ను కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం ఆశ్రమంలోని చిన్నారులకు, వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. లియువ నాయకులు తుమ్మల రుష్వంత్ రెడ్డి, గూడెం సంతోష్ రెడ్డి, గూడెం సందీప్ రెడ్డి:లి మా అభిమాన నాయకుడు, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి గారి 64వ జన్మదినాన్ని పురస్కరించుకుని మహిమా మినిస్ట్రీస్‌లోని పిల్లల మధ్య 64 కిలోల కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. ఎమ్మెల్యే గారు నియోజకవర్గ ప్రజలతో కలిసి పూరీ క్షేత్రానికి వెళ్లడంతో, వారి ఆదేశాల మేరకు మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి గారి సహకారంతో ఈ సేవా కార్యక్రమం చేపట్టాం. పిల్లలకు అన్నదానం చేసి వారి ఆశీస్సులు తీసుకున్నాం. ఎమ్మెల్యే గారు నిండు నూరేళ్లు ప్రజాసేవలో కొనసాగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాం."ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కృష్ణ, కొల్లూరు చంద్రకళ గోపాల్,మంజుల ప్రమోద్ రెడ్డి, సీనియర్ నాయకులు చౌటకూరి మహిపాల్ రెడ్డి,ఆంజనేయులు దేవేందర్, యాదగిరి, రవీందర్, జ్ఞానేశ్వర్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

Editorial

## గ్రామాల అభివృద్ధికి దృష్టి సారించాలి !

రైజింగ్ తెలంగాణ, ట్రీ మిలియన్ ఎకానమీ...ఇవన్నీ వినడానికి బాగానే ఉన్నా..ఆచరణలో పట్టుదల ముఖ్యం. ఏపిలో స్వర్ణగ్రామం, స్వర్ వార్డులు అంటూ కొత్త పేర్లతో ఊదరగొడుతున్నారు. గ్రామాలు లేకుండా అభివృద్ధి సాధ్యం కాదు. ఎంతసేపు పల్లెలను విస్మరించి, పట్టణాలకే పెద్దపీట వేయ డం సరికాదు. గ్రామాల అవసరాలను గుర్తించడంలో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. నిరంతరంగా ప్రభుత్వంపై ఆధారపడే దుస్థితి నుంచి తప్పించాలి. ఫ్యూచర్ సిటీ, దేశ పురోభివృద్ధి, ఆర్థికంగా బలోపేతంలో పదిశాతం భాగస్వామ్యం అవుతామంటున్న సిఎం రేవంత్ రెడ్డి, గ్రామాలను విస్మరిస్తే అనుకున్న ఫలితాలను సాధించలేరు. గ్రామాలను బలోపేతం చేస్తే పట్టణాలపై ఒత్తిడి తగ్గగలదు. గ్రామాల్లో విద్య,వైద్యం, పారిశుధ్యం, పచ్చదనం వంటివన్నీ ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. గత రెండేళ్లుగా గ్రామాలు కునారిల్లాయి. కనీస వసతులు లేవు. గ్రామాల్లో అత్యధిక శాతం అధికార కాంగ్రెస్ ఆధిపత్యంలోనే ఉన్నాయి. రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి విషయంలో అంతా కలసి రావాలి. గ్రామాలను బలో పేతం చేస్తేనే, గ్రామాల ఆర్థిక వ్యవస్థలు బలపడితేనే రాష్ట్రం, తద్వారా దేశం అభివృద్ధి చెందగలదు. అందువల్ల ఇప్పటి నుంచే గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రచించాలి. గ్రామా లను ఆర్థికంగా బలోపేతం చేసే విధంగా ఆలోచన చేయాలి. గ్రామాల్లో ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ పరిష్కరించలేనివేమీ కాదు. అందువల్ల వెంటనే ఇందుకు కార్యాచరణ చేయాలి. సాగునీరు, తాగునీరు, విద్యుత్ సరఫరా, పారిశుద్యం వట్టి సమస్యలపై ఇరు రాష్ట్రాల సిఎంలు శ్రమించాలి. ఉచిత పథకాలు పెరిగినా కొద్దీ గ్రామాల్లో కూలీల కొరత ఏర్పడుతోంది. పనిచేసే కూలీలు దొరక్క రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. అన్నీ ప్రభుత్వం చేస్తుందనే ధోరణి నుంచి ప్రజలు బయపటడేలా చేయాలి. నా గ్రామాన్ని నేనే కాపాడుకోవాలన్న నినాదంతో ముందుకు సాగాలి. సర్పంచ్ లను అందుకు భాగస్వాములను చేయాలి. అనవసర పథకా లకు వేలకోట్లు తగలేసే బదులు గ్రామాలను అభివృద్ధి చేసే కార్యాచరణకు నిధులు వెచ్చించాలి. ప్రభుత్వంపై ఆశతో ప్రజలు ఉన్నారని గుర్తించాలి. ఏదో చేస్తారన్న నమ్మకం ఉంది. ఇందిరమ్మ ఇళ్లు కావచ్చు, ఇతర అభివృద్ధికావచ్చు గ్రామాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాలి. ప్రపంచ చిత్రపటంలో తెలంగాణను ముందువరసలో నిలబెడతామంటున్న ముఖ్య మంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డిలు గ్రామాలను విస్మరిస్తే ముందుకు సాగలేరు. ప్రధానంగా తాగునీటి సమస్య, వైద్యరంగాలను, విద్యారంగాన్ని బలోపేతం చేయాలి. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేసేలా కార్యచరణ ఉంటే నిరుద్యోగిత కూడా తగ్గుతుంది. వ్యయసాయాధిరత చిన్న పరిశ్ర మలకు ఊతం ఇచ్చే చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రపంచంలో తెలంగా ణకు ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌కు అత్యధిక ప్రాధాన్యతను కలిగి ఉన్నది. చారిత్రకంగా, భౌగోళికంగా,ఆర్థికంగా దేశ అభివృద్ధిలో తెలంగాణ అత్యంత కీలక పాత్రను పోషిస్తున్నది. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ అబివృద్ధి ఆధునిక, హైటెక్ రాజధానిగా అభివృద్ధి చెందింది. దేశంలో ప్రధాన మెట్రో సిటీలుగా ప్రసిద్ధి చెందిన ఢిల్లీ, చెన్నై, ముంబయ్, కలకత్తాల కంటే అనువైన వాతావరణ పరిస్థితులు హైదరాబాద్‌లో ఉన్నాయి. హైదరాబాద్ చుట్టూ తెలంగాన అభివృద్ధి చెందడానికి అనువైన వాతావరణం ఉంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేస్తే రాజ ధానులపై ఒత్తిడి తగ్గుతంది. ప్రధానంగా వ్యవసాయాధారిత పరిశ్రమలతో యువతను గ్రామాలకు మళ్లించాలి. దాంతో ఆర్థికంగా ఎదుగుదలతో పాటు గ్రామాలు పురోగమి స్తాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఉజ్వల తెలంగాణ నిర్మాణానికి పూనుకుంటే అది దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది. 2047 నాటి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిర్మించటం విజన్ డాక్యుమెంట్ లక్ష్యం కనుక, మనం వ్యవసాయరంగంలో అగ్రభాగాన ఉన్నాం కనుక వ్యవసాయోత్పత్తులు, అనుబంధ రంగాలను బలోపేతం చేసుకుంటూ పోతే, ఆర్థికంగా ఎదగడానికి దోహదపడగలదు. దీనికోసం ప్రధానంగా సేవలు, పారిశ్రామిక రంగంపై దృష్టి కేంద్రీకరించాలి. మద్ద తుగా వ్యవసాయ రంగాన్ని ఆధునీకరించాలి. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని అభివృద్ధికి దోహదపడేలా చేయాలి. అప్పుడే తెలంగాన కల సాకారం కాగలదు. గతంలో లాగా చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకునే దుస్థితి రాకుండా చూసుకోవాలి. వ్యవసాయ పంటల కొనుగోళ్లను సజావుగా సాగేలా చూడాలి. పంటల విధానంలో మార్పులు రావాలి. ఇవన్నీ జరిగితేనే అనుకున్న అభివృద్ధి సృాధ్యం కాగలదు.

# నవయుగ వైతాళికుడు గురజాడ

నవీన యుగపు వైతాళికుడు, మహాకవి, తెలుగు జాతికి భాష, సాహిత్య రంగంలో అత్యాధునిక, అభ్యుదయ మార్గాన్ని చూపించిన మహా మనీషి గురజాడ అప్పారావు. దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్...అన్న అద్భుత గీతం దేశభక్తిని పెంచినా, 'కన్యాశుల్కం"నాటకం ద్వారా సమాజంలో చిన్నతనపు చేష్టలను ప్రజల ముందుంచినా అది గురజాడకే చెల్లింది. ఆయన అత్యంత ఆధునికునిగా, రచనలు అన్నింటిలో పాత బూజును దులిపి, కొత్తదనం అందించే యత్నమే జరిగింది. గురజాడ తన రచనల ద్వారా సాంఘిక పరివర్తనకు ప్రయత్నించిన మహాకవి, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీ కారులలో ఒకరు, హేతువాది. 19 వ శతాబ్దంలోను, 20 వ శతాబ్ది మొదటి దశకం లోనూ ప్రజలందరికీ అర్థమయ్యే జీవ భాషలో చేసిన రచనలు ఈనాటికీ ప్రజల మన్ననలను పొందు తున్నాయి. "అభ్యుదయ కవితా పితామహుడు" అని బిరుదు పొందిన అప్పారావు, తెలుగు సాహిత్యంలో వాడుక భాష ఒరవడికి కృషి చేసిన వారిలో ముఖ్యుడు. అతనుకు "కవి శేఖర" అనే బిరుదు కూడా ఉంది. గురజాడ అప్పారావు విశాఖ జిల్లా, రాయవరం (ఎలమంచిలి) లో, మేనమామ ఇంట్లో 1862 సెప్టెంబరు 21న, వెంకట రామదాసు, కౌసల్యమ్మ దంపతులకు జన్మించారు. గురజాడ అప్పారావు కుటుంబం వారి తాతల కాలంలో కృష్ణా జిల్లా గురజాడ గ్రామం నుండి విశాఖ మండలానికి వలస వచ్చింది. అప్పారావు తండ్రి విజయనగరం సంస్థానంలో పేష్కారుగా, రెవిన్యూ సూపర్వైజరు గాను, ఖిలేదారు గానూ పనిచేసారు.



తన పదవ ఏట వరకు అప్పారావు చీపురుపల్లిలో చదువు కున్నారు. తర్వాత తండ్రి మరణించడంతో, విజయ నగరానికి వెళ్ళారు. ఇక్కడ చాల పేదరికంలో వారాలు చేసుకుంటూ చదువు కొన సాగించారు. ఈ సమయంలో అప్పటి ఎమ్.ఆర్.కాలేజి ప్రిన్సిపాల్ చంద్రశేఖర శాస్త్రి చేరదీసి ఉండడానికి చోటిచ్చారు. 1882లో మెట్రిక్యులేషను పూర్తిచేసి, తర్వాత 1884లో ఎఫ్. ఎ చేసారు. ఇదే సంవత్సరంలో ఏం.ఆర్. హైస్కూలులో టీచరుగా చేరారు. విజయ నగరంలో బి.ఏ చదువు తున్నపుడు వాడుక భాషా ఉద్యమ నాయకుడు గిడుగు రామమూర్తి ఆయనకు సహాధ్యాయి. వారిద్దరూ ప్రాణ స్నేహితులు. 1885లో అప్పారావు అప్పల నరసమ్మను వివాహం చేసుకున్నారు. ముగ్గురు సంతానం - ఇద్దరు కుమార్తెలూ, ఒక కుమారుడు కలిగారు. అప్పటి కళింగ రాజ్యంగా పేరుపొందిన విజయ నగరంలోనే అప్పారావు నివసించారు. విజయనగర సంస్థాన పూసపాటి గజపతి రాజులతో అతనుకు మంచి సంబంధాలు ఉండేవి. 1887లో విజయనగరం కాంగ్రెస్ పార్టీ సమావేశంలో అతను మొదట ప్రసంగించారు. ఇదే సమయంలో సాంఘిక సేవకై విశాఖ వాలంటరీ సర్వీసులో చేరారు. 1889లో ఆనంద గజపతి డిబేటింగ్ క్లబ్బుకు ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఇదే సమయంలో తమ్ముడు శ్యామలరావుతో కలిసి ఆంగ్లంలో పద్యాలు రాసారు. వీరు రాసిన ఆంగ్ల పద్యం సారంగధర, ఇండియన్ లీషర్ అవర్లో చదివినప్పుడు అందరూ మెచ్చుకున్నారు. అప్పుడే కలకత్తాలో ఉన్న రీస్ అండ్ రోయిట్ ప్రచురణకర్త శ్రీ శంభుచంద్ర ముఖర్జీ విని, అప్పారావును తెలుగులో రచన చేయడానికి ప్రోత్సహించారు. ఆంగ్లంలో యెంత గొప్పగా వ్రాసినా అది పర భాషేనని, తన మాతృభాషలో ఇంకా గొప్పగా వ్రాయగలరని ప్రోత్సహించాడు. ఇండియన్ లీషర్ అవర్ ఎడిటరు గుండుకుర్తి వెంకట రమణయ్య కూడా ప్రోత్సహించాడు. 1891లో విజయనగర సంస్థానంలో సంస్థాన శాసన పరిశోధకునిగా గురజాడ నియామకం పొందారు. 1897లో మహారాజా ఆనంద గజపతి చిన్న వ్యాధితో కాలం మృతి చెందాక, మహారాణి అప్పల కొండమాంబకు వ్యక్తిగత కార్యదర్శిగా, 1884లో మహారాజా కాలేజి వారి పాఠశాలలో ఉపాధ్యాయుడిగా, 1886లో డిప్యూటీ కలెక్టరు ఆఫీసులో హెడ్ క్లర్కుగా, 1887లో కళాశాలలో అధ్యాపకునిగా, 1886లో రాజా వారి ఆస్థానంలో, 1911లో మద్రాసు యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ స్టడీస్‌లో సభ్యునిగా విధులు నిర్వర్తించారు. గిడుగు రామమూర్తితో కలిసి వాడుక భాషా వ్యాప్తికి ఉద్యమించారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కన్యా శుల్కము నాటకాన్ని 1890 ప్రాంతాల్లో పూర్తి వాడుక భాషలో రచించారు. ఆ రోజుల్లో ప్రబలంగా వున్న కన్యా శుల్కము, వేశ్యా వృత్తి వంటి దురాచారాలపై విమర్శ ఈ నాటకానికి కథావస్తువు. 1892లో నాటకపు తొలి ప్రదర్శన జరిగింది. 1897లో కన్యా శుల్కము తొలి కూర్పును మహారాజా ఆనంద గజపతికి అంకితమిచ్చారు. ఇప్పుడు మనకు దొరుకుతున్న కన్యాశుల్కము రెండవ కూర్పును 1909లో రచించారు. 1892లో గురజాడ కన్యా శుల్కము నాటకాన్ని తొలిసారిగా ప్రదర్శించారు. మొదటి ప్రదర్శనకే ఎంతో పేరు వచ్చింది. దీనితో సాహిత్యంలో వాడుక భాష ప్రయోగానికి ఒక రకంగా నాంది పలికింది. సాంఘిక ఉపయోగంతో పాటు రసజ్ఞుల ఆనందానికి కూడా వాడుక భాష వాడవచ్చని ఈ నాటకం నిరూపించింది. దీని విజయంతో, అప్పారావు ఈ ఆలోచన సరళిని అవలంబించి ఇతర సాహిత్య కర్తలను వెదక సాగారు. ఈ సరళికి అతని చిన్ననాటి స్నేహితుడు చీపురుపల్లిలో తన సహాధ్యాయి అయిన గిడుగు రామమూర్తి ముఖ్యుడు. 20వ శతాబ్ది తొలి నాళ్ళలో జరిగిన వ్యవహారిక భాషోద్యమంలో గురజాడ అప్పారావు గిడుగు రామమూర్తి పంతులుతో కలిసి పోరాటం సలిపారు. వారిద్దరూ కలిసి పత్రికల్లో, సభల్లో, మద్రాసు విశ్వ విద్యాలయంలో గ్రాంథిక భాషా వాదులతో అలసట ఎరగకుండా తల పడ్డారు. గిడుగు వాదనా బలానికి, గురజాడ రచనాశక్తి వ్యావహారిక భాషోద్యమానికి వినియోగ పడ్డాయి. వాడుక భాష ప్రయోగానికి వ్యతిరేకి అయిన కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి కూడా ఈ నాటకం సాహితీ విలువలను ప్రశంసించడంతో అప్పారావుకు ఎంతో పేరు వచ్చింది. 1896లో "ప్రకాశిక", అన్న పత్రికను మొదలు పెట్టారు. 1897లో కన్యాశుల్కాన్ని వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్, మద్రాసు వారు ప్రచురించారు. 1909లో కన్యాశుల్కం తిరగ రాసారు. 1910లో రాసిన "దేశమును ప్రేమించుమన్నా", అనే దేశభక్తి గీతం ఎంతో ప్రసిద్ధి పొందింది. 1911లో మద్రాసు విశ్వ విద్యాలయం బోర్డు అఫ్ స్టడీస్లో నియమించ బడ్డారు. అదే సంవత్సరంలో, స్నేహితులతో కలిసి ఆంధ్ర సాహిత్య పరిషత్తు ప్రారంభించారు. 1913లో అప్పారావు పదవీ విరమణ చేసారు. అప్పటి నుండి అనారోగ్యంతో బాధ పడేవారు. ఇదే సమయంలో మద్రాస్ విశ్వ విద్యాలయం వారు "ఫెలో"తో గౌరవించారు. చివరికి, 53 సంవత్సరాల వయసులో 1915 నవంబర్ 30 న గురజాడ మరణించారు. ఆయన రచించిన కన్యాశుల్కం నాడు వీధి వీధినా నాటక రూపంలో మారు మ్రోగిపోయింది. సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబ నేపథ్యంలో పుట్టి పెరిగిన వ్యక్తిగా, స్త్రీల స్థితిపై సహానుభూతిని చూపటం గురజాడకు సహజమైన పరిణామం. అతి బాల్య వివాహాలూ, నిర్బంధ వైధవ్యాలూ, అతి కఠినమైన నైతిక చట్రాలూ, ఆర్థిక పరాధీనతలతో నలిగి పోతున్న ఆ స్త్రీలకు మద్దతుగా నిలవటాన్ని తన ప్రధాన కర్తవ్యంగా స్వీకరించింది ఆయన సాహిత్యం ముఖ్యంగా కన్యా శుల్కం. 125 ఏళ్ల తర్వాత కూడా నేటికీ రంగ స్థలానికి వన్నెలు తెస్తూనే ఉంది. 'పుత్తడి బొమ్మ పూర్ణమ్మ' గేయ తరంగం మనుషుల మెదళ్లలో దూరి ఆలోచనలు రేకెత్తించింది. 'దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్' అంటూ కొత్త నిర్వచనమిచ్చిన తేజోమూర్తి... 'మంచి అన్నది మాల అయితే ఆ మాల నేనవుతా' అని అంటరాని తనంపై కత్తిదూసిన మానవతా మూర్తి గురజాడ! ఆయన రచనల్లోని పాత్రలు ఒక్కొక్కటి ఒక్కో సంచలనం. తెలుగు నాట సాహితీ విప్లవ ప్రకంపనలు సృష్టించిన శ్రీశ్రీ అంతటి వారే... 'నా అడుగుజాడ గురజాడ' అన్నారు.

"గురజాడ 1915 లో చనిపోలేదు. అప్పుడే ఆయన జీవించడం ప్రారంభించారు" - దేవులపల్లి "కృష్ణశాస్త్రి... నాదృష్టిలో కవిత్రయమంటే తిక్కన, వేమన, గురజాడ"! - శ్రీశ్రీ... ప్రాచీన భారతీయ సాహిత్యం నుంచి, పాశ్చాత్య సాహిత్యంతో లోతైన పరిచయం దాకా విస్తరించిన అధ్యయనం గురజాడది. ఫ్రెంచ్ విప్లవాన్నీ, సాహిత్యాన్నీ గురించిన అవగాహన, ఇతర దేశాల్లో జరుగుతున్న ప్రజాస్వామిక రాజకీయోద్యమాల గురించి తెలుసుకోవటమూ ఆయన దృష్టిని విశాలం చేశాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

## రైతుల సహకార స్ఫూర్తికి చిరునామా..

# తెలంగాణ పాడి పరిశ్రమ

**పల్లె రైతులకు వరప్రదాయనిగా పాడి పరిశ్రమ నిలుస్తుందని,పాడి పరిశ్రమ(డైరీ ఫార్మింగ్) పాడి పశువుల పెంపకం గ్రామీణ సమాజానికి లాభదాయకమైన ఆర్థిక వనరుగా ఉండడంతో పాటు పట్టణ లేదా నగర శివారు గ్రామాలకు కూడా పశుపోషణ వల్ల సంపూర్ణ ఉపాధి కలుగు తుంది. చిన్న కమతాలు గల రైతులు సన్నకారు రైతులకు వారి ఉత్పత్తికి సరి పడా గిట్టుబాటు ధర లభించకపోవడం మార్కెట్లోని హెచ్చుతగ్గులు ఇంకా వాతావ రణ ప్రతికూలతల వల్ల వ్యవసాయం నష్ట దాయకంగా మారింది. దీనివల్ల రైతులు వ్యవసాయం నుంచి పశు పోషణకు మల్లుతున్నారు. సాంకేతిక సహకారాల భృత ప్రభుత్వ విధానాల వల్ల ఈ విధ మైన మార్పు దోహదం చేస్తుంది. తెలం గాణలో దాదాపుగా 29 లక్షల కుటుం బాలు తమ జీవనోపాధి కోసం పశుసంపద రంగంలో అనగా పాడి పరిశ్రమ రంగంలో నిమగ్నమై ఉన్నారు.**





**రాష్ట్రంలో పశుసంపద:**
2012 నుండి 2019 వరకు మధ్యకాలంలో 22.09 వృద్ధితో 26. 7 మిలియన్ నుండి 32.6 మిలియన్లకు పెరిగింది. పశుసంపద పెరుగుదలలో తెలంగాణ పశ్చిమ బెంగాల్ తర్వాత రెండో స్థానంలో ఉంది. అంతేకాకుండా తెలంగాణ సామాజిక ఆర్థిక ముఖచిత్రం 2022 ప్రకారం మాంసం ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం ఐదవ స్థానంలో, గుడ్లు ఉత్పత్తిలో మూడో స్థానంలో ఉండగా పాల ఉత్పత్తిలో పదవ స్థానంలో ఉంది.

**తెలంగాణలో పాడి పరిశ్రమ:**
పాడి పరిశ్రమ వ్యవసాయ రంగానికి అనుబంధంగా కొనసాగుతున్న ఒక ముఖ్యమైన ఆర్థిక కార్యకలాపం. పాడి పరిశ్రమ ఒక అదనపు రాబడి మాత్రమే కాకుండా వ్యవసాయ రంగానికి ప్రత్యా మ్నాయంగా ఎదుగుతున్న ఒక ముఖ్య గ్రామీణ ఆర్థిక రంగం. పాల ఉత్పత్తి సంపద సృష్టికి ఇంకా మహిళ స్వావలం మనకు దోహదపడుతుంది. రాష్ట్రంలో పాడి రంగంలో ఒక ముఖ్యమైన సవాలు ఏమనగా పాల సేకరణ మరియు



మార్కెటింగ్ కోసం చిన్న సన్న కారు రైతులను సమన్వయపరిచి ఒక తాటి మీదికి తీసుకురావడం. 2019 మరియు 2020 సంవత్సరాలలో పశుసంపదలో పాలశాతం 46% మాత్రమే ఉండగా వాటి స్థూల ఉత్పత్తి విలువ 36,862 కోట్లు. జిల్లాల వారీగా చూస్తే ఉత్పత్తి 693 టన్నులతో రంగారెడ్డి జిల్లా ప్రథమ స్థానంలో ఉండగా ఖమ్మం నల్గొండ జిల్లాలో తదుపరి స్థానాల్లో కలవు. రైతులను పాడి వ్యవసాయం చేసుకునేలా ప్రోత్సహించేందుకు సహకార డైరీల సభ్యులకు ప్రతినెల నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం ద్వారా సేకరించే వాళ్లకు లీటర్కు నాలుగు రూపాయలు ప్రోత్సాహకరంగా అందించే పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది హిందూ సంవత్సరానికి 100 కోట్లు ఖర్చు చేయగా దీనిద్వారా 2.93 లక్షల మంది పాలు పోసేవారు లబ్ధి పొందుతున్నారు అంతేకా కుండా 2014 మరియు 2017 నుండి 2020 మరియు 2021 మధ్యకాలంలో ఈ కార్యక్రమం కోసం 343 కోట్లు ఖర్చు చేయబడగా 2016 వ సంవత్సరంలో పాల ఉత్పత్తి 37% వృద్ధి సాధించింది 2014 మరియు 2015లో 42 లక్షల టన్నుల నుంచి 2020 మరియు 2021 నాటికి 57.6 లక్షల టన్నులకు దీని వల్ల తలసరి పాలలభ్యత లభ్యం కాగా 2015లో 321 గ్రాములు రోజు నుండి 2020లో 400 గ్రాములకు పెరిగింది. ప్రభుత్వ పాత్ర: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన వరుస కార్యక్రమాల ద్వారా ఆధునిక పునరుత్పత్తి పథకం స్పెర్మ్‌తో జెనిసిన్ సదుపాయాన్ని రూ 4750 లక్షల వ్యయంతో దేశంలో అమలు చేస్తున్న వాటిలో ఒకటిగా భారత్ ప్రభుత్వం ఆమోదించింది దీనితో పాటు పివి నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ సహాయంతో వెటర్నరీ సైన్స్ కళా శాల కోరుకలు 583 లక్షల రూపాయల ఖర్చుతో అధునాతన ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ ఎంబ్రియో ట్రాన్స్ఫర్ టెక్నాలజీ ల్యాబ్ సౌకర్యాన్ని కల్పించింది. ప్రభుత్వం మారుమూల ప్రాంతాలలో పని చేసే గోపాలమిత్ర వర్కర్లకు ఇచ్చే నెలవారీ భత్యాన్ని ప్రస్తుతం నెలకు ఇస్తున్న 3500 నుండి 8500 కు పెంచింది అంతేకా కుండా దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ప్రైవేట్ ఏ వన్ వర్కర్లకు గ్రామీణ ప్రాంతంలో వారు అందించే పశుసంపద సేవలను కూడా గుర్తించింది నాలుగు ప్రాథమిక పాడి పరిశ్రమల సహకార సంఘాలైన నిర్మల్ కరీంనగర్ డైరీ, ముల్క నూర్ మహిళా కోఆపరేటివ్ సహకార సంఘం మిల్క్ ప్రొడ్యూసర్ యూనియన్ కు లీటరుకు కు నాలుగు రూపాయలు చొప్పున రెండు పాయింటు ఒకటి మూడు లక్షల మందికి ప్రోత్సాహకాలు అందించబడ్డాయి. ఈవిధంగా తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని రెండు పాయింటు ఒకటి మూడు లక్షల మంది పాడి రైతులకు మేలు చేసేందుకు గాను 1677 కోట్ల రూపాయలతో పాల ఉత్పత్తిదారుల సహకార సంస్థల ద్వారా మిల్క్ అనిమల్ డిస్ట్రిబ్యూషన్ ప్రోగ్రాం ని ప్రవేశపెట్టడం జరిగింది ఈ విధంగా తెలంగాణలో పాడి విప్లవానికి నాంది పలికింది అనడంలో సందేహం లేదు.



**పందిరి శ్రీనివాసులు. ఎంఏ ( జాగ్రఫీ) బీఈడీ, ఎంసీజె (జర్నలిజం), పిజిడిసిజే (జర్నలిజం) ఉస్మానియా యూనివర్సిటీ.**

శాంతి స్థాపనకు

# కృషి చేయలేమా !

(21 సెప్టెంబర్ " అంతర్జాతీయ శాంతి దినోత్సవం" సందర్భంగా)

ప్రపంచవ్యాప్తంగా నేడు అశాంతి మేఘాలు కమ్ముకున్నాయి. ప్రత్యక్ష, పరోక్ష, ప్రచ్ఛన్న యుద్ధాలు కొనసాగుతూనే ఉన్నాయి. శాంతి పావురాలు స్వేచ్ఛగా తిగలేని దుస్థితి వచ్చింది. ఏండ్ల తరబడి యుద్ధాలు కొనసాగుతూనే ఉన్నాయి. 24 ఫిబ్రవరి 2022న ప్రారంభంపైన ఉక్రెయిన్-రష్యా యుద్ధం నేటికీ మారణహోమాన్ని నమోదు చేస్తూనే ఉన్నది. 07 అక్టోబర్ 2023న ప్రారంభమైన ఇజ్రాయిల్ - పాలస్తీనా (గాజా) యుద్ధం నేటికీ బాంబుల వర్షం కురిపిస్తూనే ఉన్నది. 28 ఫిబ్రవరి 2026 నుంచి నేటి వరకు అమెరికా/ఇజ్రాయిల్‌తో ఇరాన్ యుద్ధం కొనసాగుతూ ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను ప్రభావితం చేస్తున్నది. ఈ యుద్ధాల్లో లక్షల ప్రాణాలు గాల్లో కలిసాయి. మిలియన్ల అమాయక ప్రజలు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని వలసలు వెళుతూనే ఉన్నారు లేదా శరణార్థి శిబిరాల్లో దుర్భర జీవితాలను గడుపుతూనే ఉన్నారు. భారత్ - పాకిస్థాన్ మధ్య అనిశ్చిత స్థితి కొనసాగుతూనే ఉన్నది. యుద్ధాలను, సంక్షోభాలను ఆపడానికి ఐరాస మధ్యవర్తిత్వం పనిచేయడం లేదు. ఐరాస పేపర్ టైగర్‌గా మారింది. ట్రంప్ నాటకాలు కూడా ప్రపంచ అశాంతికి ఆజ్యం పోస్తున్నాయి.

**అంతర్జాతీయ శాంతి దినం-2026 ఇతివృత్తం:**
యుద్ధాలతో ప్రాణ ఆస్తి నష్టాలతో పాటు మానవ హక్కులు హననం చేయబడుతున్నాయి. రష్యా, ఇజ్రాయిల్ దేశాల అగ్ర నాయకులు పుతిన్, నేతన్యాహూల అనాలోచిత ఆలోచనలతో యుద్ధాలు తీవ్రరూపం దాల్చడానికి దోహదపడుతున్నాయి. అస్థిరత రాజ్యమేలుతున్నది. ఆధిపత్య ధోరిణి రెట్టింపు అవుతున్నది. ప్రపంచవ్యాప్తంగా శాంతియుత వాతావరణం నెలకొనడానికి 1981లో ఐరాస తీసుకున్న ఏకగ్రీవ తీర్మానం ప్రకారం ప్రతి ఏట 21 సెప్టెంబర్ రోజున ప్రపంచ దేశాలు "అంతర్జాతీయ శాంతి దినం (ఇంటర్నేషనల్ పీస్ డే)" పాటించడం ఆనవాయితీగా మారింది. శాంతి నెలకొన్నప్పుడు పేదరికం తగ్గుతుంది, సామాజిక సహనశీలత పెరుగుతుంది. అంతర్జాతీయ శాంతి దినం-2026 ఇతివృత్తంగా "శాంతి స్థాపనకు పెట్టుబడి పెట్టండి : అందరికీ, ప్రతి చోట, ప్రతి రోజు" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. నేడు ప్రపంచాన్ని సాయుధ పోరాటాలు, విపరీత వాతావరణ ప్రతికూల మార్పులు, భౌగోళిక ఆర్థిక సంక్షోభాలు, తప్పుడు వార్తలు లేదా సమాచారాల వ్యాప్తి, సామాజిక భావ విచ్ఛిన్నం, ఆర్థిక అడ్డంకులు, నిరుద్యోగం, మానవ హక్కుల ఉల్లంఘనలు, ఉగ్రవాదం, అసమానతలు లాంటివి ప్రపంచ శాంతిని హరిస్తున్నాయి.

యుద్ధాలతో మానవాళి మనుగడ అధోగతి :
నేడు 3వ ప్రపంచ యుద్ధమే జరిగితే క్షణాల్లో ప్రపంచం కాలి బూడిద కావడం ఖాయంగా తోస్తున్నది. డిజిటల్ యుద్ధ నీతి భూమిని మరుభూమిగా మార్చగలదు. ప్రపంచ శత్రువులుగా పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత, అసమానతలు రాజ్యమేలుతున్న వేళ అత్యాధునిక ఆయుధాలతో రక్తపాత యుద్ధాలు అర్థరహితం. కోవిడ్ విపత్తు యుద్ధాన్ని గెలిచాం. వాతావరణ ప్రతికూల మార్పులతో పోరులో నెగ్గుదాం. ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడం పట్ల నిలిచి గెలుద్దాం.మానవత్వమే శాంతి మహా మంత్రంగా నిత్యం జపిద్దాం. స్వీయ నియంత్రణ, పరమత సహనాలతో శాంతి పావురాలు స్వేచ్ఛగా ఎగరాలి. యుద్ధాలతో శాంతి స్థాపన జరగదు. సంక్షోభాలతో సంక్షేమం ఫలించదు. చేతులు కలిపితే అభివృద్ధి, తొడగితే అధోగతి తప్పదు. బాంబులతో విధ్వంసం, జవాబులతో వికాసం జరుగుతుంది. సరిహద్దులు చెరిగిపోయి, డిజిటల్ వలయంలో ప్రపంచమే కుగ్రామం అయిన వేళ శాంతి మాత్రమే మానవాళి శ్రేయస్సుకు పునాది అవుతుందని అని తెలుసుకోవాలి.

ప్రపంచ శాంతికి ఉపకరించే విధంగా పేదరిక, ఆకలి రహిత సమాజ స్థాపన, విద్య వైద్య లింగ అసమానతలు, క్లీన్ ఎనర్జీ-నీటి లభ్యత, గ్లోబల్ సమన్వయం లాంటి ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-2030 నిర్ణయించబడ్డాయి. ప్రపంచ శాంతి కోసం చర్చలు, సదస్సులు, విద్యాలయాల్లో పోటీలు, కార్యశాలలు లాంటివని నిర్వహించాలి. అహింస, పరస్పర గౌరవం, లోతైన అవగాహన లాంటి భావనలను ప్రోత్సహించాలి. అన్ని ఆయుధాల కన్న శక్తివంతమైనది శాంతి మాత్రమే అని తెలుసుకుందాం. విభేదాలు మరిచి ఐక్యంగా ముందుకు సాగుదాం. మానవ హక్కులకు పట్టం కడదాం. యుద్ధాలు, మానవ ప్రేరేపిత సంక్షోభాలకు చరమగీతం పాడుదాం.

**లయన్ కెప్టెన్**
**డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**

## నెల్లివాడలో గణనాథుడిని దర్శించుకున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జి.వి. రామకృష్ణారావు



**మానకొండూర్, సెప్టెంబర్ 20(సింగిడి):** మానకొండూర్ మండల కేంద్రంలోని నెల్లివాడలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా శ్రీ చైతన్య యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని బీఆర్ఎస్ పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు జి.వి. రామకృష్ణారావు సందర్శించారు. మండపంలో కొలువైన గణనాథుడికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి, దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తాళ్లపల్లి శేఖర్ గౌడ్, గ్రామశాఖ అధ్యక్షులు పిట్టల మధు, మాజీ ఉప సర్పంచ్ నెల్లి మురళి, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు బోడ రాజశేఖర్, పిండి సందీప్, తాళ్లపల్లి పర్శరాములు గౌడ్ తదితరులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మండప నిర్వాహకులు, యూత్ క్లబ్ సభ్యులు వారికి ఘన స్వాగతం పలికారు.

## తాడికల్ సర్పంచ్ భౌతికకాయానికి నివాళులు






**మానకొండూర్, సెప్టెంబర్20(సింగిడి):** మానకొండూర్ నియోజకవర్గం, శంకరపట్నం మండలం, తాడికల్ గ్రామ సర్పంచ్ దుర్గపు సుజాత అనారోగ్యంతో అకాల మరణం చెందారు. విషయం తెలుసుకున్న మానకొండూర్ నియోజకవర్గ శాసనసభ్యులు, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డా. కవ్వంపల్లి సత్యనారాయణ తాడికల్ గ్రామానికి చేరుకుని, ఆమె భౌతిక కాయానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ సర్పంచ్ సుజాత మరణం తాడికల్ గ్రామానికి, నియోజకవర్గానికి తీరని లోటని పేర్కొన్నారు. నిరంతరం ప్రజాసేవలో ఉంటూ, గ్రామ అభివృద్ధికి ఆమె చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తన గాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు

## రుక్మాపూర్ వక్ఫ్ బాధితులకు అండగా నిలవాలి

### సర్వే నంబర్ 18లో భూములపై వక్ఫ్ నమోదు తొలగించాలి

### బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి



**కరీంనగర్, సెప్టెంబర్20(సింగిడి):** చొప్పదండి మండలం రుక్మాపూర్ గ్రామంలోని సర్వే నంబర్ 18 పరిధిలోని నివాస స్థలాలు, ఇళ్లను వక్ఫ్ బోర్డు పరిధిలో నమోదు చేయడాన్ని తక్షణమే తొలగించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. మండల బీజేపీ అధ్యక్షుడు మొగిలి మహేష్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు రుక్మాపూర్‌లో పర్యటించి వక్ఫ్ నమోదు కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ సుమారు 60 ఏళ్ల క్రితం గ్రామానికి చెందిన దాదాపు 40 మంది రిజిస్టర్డ్ అమ్మకపు పత్రాల ద్వారా సర్వే నంబర్ 18లోని నాలుగు ఎకరాల భూమిని కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నారని తెలిపారు. గ్రామపంచాయతీ, అనుమతులతో పాటు విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ సౌకర్యాలు పొందుతున్నారని పేర్కొన్నారు.

## త్రిశక్తి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం



**మానకొండూర్, సెప్టెంబర్20(సింగిడి):** శ్రీ గణనాథుని నవరాత్రుల ఉత్సవం సందర్భంగా మానకొండూరు మండలం పచ్చునూరు గ్రామంలో త్రిశక్తి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ పార్నంది కిషన్ పాల్గొన్నారు గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో పసిడి పంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా త్రిశక్తి యూత్ అసోసియేషన్ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కూరాకుల పోషాలు, పార్నంది నరసయ్య,కల్వాల రవి, రంజిత్,శివ, సన్నీ, కుమార్, ప్రవీణ్,సంతోష్,ప్రశాంత్,గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# గణపతి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి

- నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి
- కె డి సి సి బ్యాంక్ వైస్ చైర్మన్ పింగళి రమేష్
- మేదరివాడ వినాయకుడికి ప్రత్యేకపూజలు





**జమ్మికుంట, సెప్టెంబర్ 20 (సింగిడి) :** జమ్మికుంట పట్టణంలోని మేదరి వాడలో శ్రీ విఘ్నేశ్వర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుడి వద్ద ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్ జమ్మికుంట మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రజలు భక్తులు ప్రశాంతమైన వాతావరణంలో నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలని సూచించారు. దశాబ్ద కాలంగా మేదరి వాడలో శ్రీ విఘ్నేశ్వర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను యూత్ సభ్యులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారని వీరికి సహకరిస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు కు రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. నేటి యువత భక్తి మార్గం వైపు నడుస్తూ నవరాత్రి ఉత్సవాలను ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వర్తించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. శ్రీ విఘ్నేశ్వర ఉత్సవ కమిటీ సభ్యులు ఐకమత్యంతో కుల మతాలకు అ-తీతంగా ప్రశాంతమైన వాతావరణంలో నవరాత్రి ఉత్సవాలను జరుపుకుంటూ మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందించదగ్గ విషయమని తక్కలపల్లి రాజేశ్వరరావు తెలిపారు. ఆ విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని రాష్ట్రంలో పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఆ భగవంతుడిని పేర్కొన్నట్లు వారు ఈ సందర్భంగా తెలిపారు. ఈ మహా అన్నదాన కార్యక్రమానికి వచ్చిన అతిథులను వార్డు కౌన్సిలర్ చింతల శ్రీనివాస్ వారిని సాదరంగా ఆహ్వానించి సన్మానించారు. వేద పండితులు మండలేముల కపర్తి శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి అతిథులకు భక్తులకు ఆశీర్వచనం తోపాటు తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకుడు గుంటి సామ్రాజ్యం మాజీ మున్సిపల్ చైర్మన్ పోడేటి రామస్వామి శ్రీ విఘ్నేశ్వర ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో గణేశ్ నిమజ్జనోత్సవాలు

**పోలీసుల సహకారం అవసరం**
**భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు**
**కేంద్ర మంత్రి బండి సంజయ్**



**కరీంనగర్, సెప్టెంబర్20(సింగిడి):** గణేశ్ నిమజ్జనోత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం నిమజ్జన ఏర్పాట్లపై కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, పోలీసు అధికారులు, కార్పొరేటర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. నిమజ్జనోత్సవాల్లో పోలీసులు సంయమనం పాటిస్తూ భక్తులకు సహకరించాలని బండి సంజయ్ సూచించారు. అధికారుల నుంచి ఏవైనా ఇబ్బందులు ఎదురైతే మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ల దృష్టికి తీసుకు రావాలని కోరారు. తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. తప్పుడు ప్రచారాలు, పుకార్లను నమ్మకుండా ఉత్సవాలను సజావుగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈసారి గతంలో కంటే అధిక బడ్జెట్‌తో నిమజ్జనోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామని, కరీంనగర్‌లో భక్తియుత వాతావరణం నెలకొల్పేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నిమజ్జన కార్యక్రమాల సందర్భంగా అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పోలీసులు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**ఆధార్ కేంద్రం ప్రారంభం...**
అనంతరం కమాన్ సర్కిల్ వద్ద నూతన ఆధార్ కేంద్రాన్ని బండి సంజయ్ ప్రారంభించారు. ఐదు నుంచి 15 ఏళ్ల వయసున్న పిల్లలకు ఆధార్‌లో జీవగణాంక వివరాల నవీకరణ తప్పనిసరిగా చేయించాలని సూచించారు. ఆధార్ వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించుకోవడం ద్వారా ప్రభుత్వ సేవలు, పోటీ పరీక్షలకు సంబంధించిన ప్రక్రియల్లో ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. ఆధార్ కేంద్రాల్లో నమోదు, వివరాల నవీకరణ, జీవగణాంకాల మార్పు వంటి సేవలు అందుబాటులో ఉంటాయి.

**రక్తదాన శిబిరం సందర్శన..,**
రేకుర్తిలో బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కూడా బండి సంజయ్ సందర్శించారు. రక్తదానం చేసిన పార్టీ నాయకులను అభినందించారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాజీవితంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**వర్షంలోనూ గణేశ్ మండపాల సందర్శన..**
గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బండి సంజయ్ కరీంనగర్‌లోని కాపువాడ, పాతబజార్, మంగళ్‌వాడ, మోచీనగర్ తదితర ప్రాంతాల్లోని పలు గణేశ్ మండపాలను సందర్శించి గణనాథుడిని దర్శించుకున్నారు. వర్షం కురుస్తున్నప్పటికీ మండపాలను సందర్శిస్తూ భక్తులతో ముచ్చటించారు. గత కొద్దిరోజులుగా తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో గణేశ్ మండపాలను సందర్శిస్తున్నట్లు ఆయన తెలిపారు. కరీంనగర్‌లో నిమజ్జనోత్సవాలకు గతం కంటే విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇటీవలి నివేదికలు కూడా పేర్కొన్నాయి.

# తెలంగాణ నుండి ఢిల్లీ వరకు, కులగణనపై రుద్ర సంతోష్‌కు కీలకబాధ్యత

**జాతీయ స్థాయిలో 100 రోజుల ప్రచార సమన్వయ బాధ్యతలు**



**కరీంనగర్, సెప్టెంబర్20(సింగిడి ):** తెలంగాణలో కులగణన కార్యక్రమాన్ని క్షేత్రస్థాయి వరకు సమన్వయం చేసిన రుద్ర సంతోష్ కుమార్‌కు జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించినట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. దేశవ్యాప్తంగా కులగణనపై చేపట్టనున్న 100 రోజుల ప్రచార కార్యక్రమానికి ఏఐసీసీ జాతీయ వార్‌రూమ్ సమన్వయకర్తగా ఆయనను నియమించినట్లు పేర్కొన్నాయి. ఈ బాధ్యతల్లో భాగంగా రాష్ట్రాల వారీగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం, సంస్థాగత సమన్వయం, క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమాలు, సమాచార సేకరణ, పురోగతి పర్యవేక్షణ వంటి అంశాలను సమన్వయం చేయనున్నారు. రాష్ట్రాల నుంచి వారపు నివేదికలు, అభిప్రాయాలను సేకరించి అవసరమైన మార్గదర్శకాలు అందించేలా వ్యవస్థను రూపొందించనున్నారు.

**తెలంగాణ అనుభవం ఆధారంగా జాతీయ కార్యాచరణ..**
2024--25లో తెలంగాణలో నిర్వహించిన కులగణన సందర్భంగా రుద్ర సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమన్వయ కేంద్రం, సమాచార కేంద్రం ఏర్పాటు చేసి మండల, బ్లాక్, గ్రామ, బూత్ స్థాయి ప్రతినిధులతో సమన్వయం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. సుమారు 45 రోజులపాటు సాగిన కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా కుల సంఘాలు, వేలాది మంది బూత్ స్థాయి కార్యకర్తలతో సంప్రదింపులు జరిపినట్లు పేర్కొన్నాయి. సెప్టెంబర్ 8న ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో జరిగిన జాతీయ ఓబీసీ కార్యశాలలో 100 రోజుల ప్రచారానికి సంబంధించిన 15 వారాల కార్యాచరణ ప్రణాళికను రుద్ర సంతోష్ కుమార్ వివరించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. రాష్ట్ర స్థాయి సమన్వయ కేంద్రాలు, శిక్షణ, జిల్లా నుంచి గ్రామ స్థాయి వరకు కార్యక్రమాల విస్తరణ, పురోగతి పర్యవేక్షణ, రాష్ట్రాల మధ్య సమన్వయం వంటి అంశాలను ప్రణాళికలో పొందుపరిచినట్లు పేర్కొన్నాయి. తెలంగాణలో క్షేత్రస్థాయిలో పొందిన అనుభవాన్ని వివిధ రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా వినియోగిస్తూ దేశవ్యాప్తంగా కులగణనపై చేపట్టే కార్యక్రమానికి సమగ్ర సమన్వయ వ్యవస్థను రూపొందించడమే తనకు అప్పగించిన బాధ్యతలో ప్రధాన లక్ష్యంగా ఉంటుందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా రుద్ర సంతోష్‌కు పార్టీ వర్గాలు, అభిమానులు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.

# వైభవంగా మానేరు స్కూల్ బాల గణేశుడి నిమజ్జనం

**భక్తిశ్రద్ధలతోపూజలు.,ఉత్సాహంగా నిమజ్జన శోభాయాత్ర**



**కరీంనగర్, సెప్టెంబర్ 20(సింగిడి):** మంకమ్మతోటలోని సాయి మానేరు ఉన్నత పాఠశాలలో ప్రతిష్ఠించిన మట్టి బాల గణేశుడి నిమజ్జన కార్యక్రమాన్ని ఆదివారం రోజున భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నిమజ్జనానికి ముందు విద్యార్థులు, ఉపాధ్యాయులు గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరించి వాహనంపై కొలువుదీర్చారు. మానేరు విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి పాల్గొని విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణనాథుడిని నిమజ్జనానికి తరలిస్తుండగా విద్యార్థులు, ఉపాధ్యాయులు భక్తిగీతాలకు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా అనంతరెడ్డి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతిని ప్రతిష్ఠించి నిమజ్జనం చేయడం ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ స్పృహతో పాటు సంప్రదాయాలపై అవగాహన పెంపొందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఘనంగా లింగార్చన

- వేములవాడ రుత్వికుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

**కరీంనగర్, సెప్టెంబర్20(సింగిడి):** శ్రీ విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాల, అల్ఫోర్స్ బాలికల జూనియర్ కళాశాలలో లింగార్చన కార్యక్రమాన్ని ఆదివారం రోజున భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దక్షిణ కాశీ వేములవాడకు చెందిన రుత్వికుల ఆధ్వర్యంలో మట్టితో లింగాలను రూపొందించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరై పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లో ఆధ్యాత్మిక భావన, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించేందుకు ప్రతి ఏటా వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లింగార్చనను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ద్వారా శుభఫలాలు కలుగుతాయని, ఆత్మవిశ్వాసం, ఓర్పు, సహనం, జ్ఞానం, వివేకం పెంపొందు తాయని ఆయన పేర్కొన్నారు. రుత్వికులు ఉపవాస దీక్షతో సామూహికంగా మంత్రోచ్చా రణలు చేస్తూ పూజలు నిర్వహించారు. ఫలపంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకం చేసి వివిధ రకాల పూలతో స్వామివారిని అలంకరించారు. పండ్లు, పండ్ల రసాలు, ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. కార్యక్రమంలో అల్ఫోర్స్ విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## రంగపేట శ్రీ రామ్ యూత్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ



**మానకొండూర్, సెప్టెంబర్ 20 (సింగిడి):** మానకొండూర్ మండలంలోని రంగపేట గ్రామంలో శ్రీ బాల ఆంజనేయ స్వామి గుడి వద్ద శ్రీ రామ్ యూత్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు, గ్రామ ప్రజలకు యూత్ సభ్యులు దగ్గరుండి అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా శ్రీ రామ్ యూత్ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రతి ఏటా భక్తిభావంతో, సేవా దృక్పథంతో ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. స్వామివారి కృపతో గ్రామం అంతా ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో విలసిల్లాలని ఈ సందర్భంగా వారు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామ్ యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఊట్కూరి ఆధ్వర్యంలో గణపతి పూజలు



**మానకొండూర్, సెప్టెంబర్20 (సింగిడి):** వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎల్ఎండీ కాలనీలోని ప్రజాభవన్,ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఆదివారం గణనాథునికి ఇల్లంతకుంట ప్యాక్స్ చైర్మన్ ఊట్కూరి వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇల్లంతకుంట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూజలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ డైరెక్టర్లు ఒగ్గు రమేష్, యాస తిరుపతి, సింగిరెడ్డి లక్ష్మి, ఎలుక అనిల్ కుమార్, లక్ష్మారెడ్డి, నవీన్ రెడ్డి, ఇల్లంతకుంట మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మామిడి రాజు, ఉప సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు ఎలుక రామస్వామి, సోమారంపేట సర్పంచ్ కేతిరెడ్డి భారతి లక్ష్మారెడ్డి , నాయకులు అంతగిరి వినయ్ కుమార్, తీగల పుష్పలత ,సత్తయ్య, బంగారు ఆంజనేయులు, రంగు రజని ,తదితరులు పాల్గొన్నారు.

ప్రభాతవన సింగిడి
ప్రతి రంగూ ఓ నిజం
Singidi
సోమవారం
21-9-2026

# మామునూరు ఎయిర్పోర్టులో ప్రీ-బిడ్ సమావేశం?

- ఎయిర్పోర్ట్ పనులను స్పీడ్ అప్ చేసేందుకు ప్రభుత్వం ముందడుగు





**హనుమకొండ, సెప్టెంబర్20(సింగిడి):** వరంగల్ మామునూరు ఎయిర్పోర్టులో ఈనెల 28 న ప్రీబిడ్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిసింది. ఈ ప్రీబిడ్ సమావేశంలో ప్రముఖ కంపెనీలు జిఎంఆర్, ఆదానీ, ఇతర కంపెనీలు పాల్గొంటున్నట్లు సమాచారం. ఎయిర్పోర్ట్ నిర్మాణం పనుల్లో భాగంగా రన్ వే , టెర్మినల్ పనులకు ప్రభుత్వం రూ 213.59 కోట్లు ఖర్చు చేసేందుకు సముకుత వ్యక్తం చేస్తుంది. అయితే ప్రభుత్వం నిర్ణయించిన అమౌంట్ కు తగ్గట్టు చేసే కంపెనీలకు మాత్రమే టెండర్ల అవకాశం అప్పగించే పరిస్థితులు కనబడుతున్నాయి. బిడ్లలో రెండు రకాలు ఉన్నాయి. ఒకటి ఈపీసీ అంటే ప్రభుత్వం కేటాయించిన డబ్బులతోనే నిర్మాణం పనులు పూర్తిచేసి అప్పగించే బాధ్యతను తీసుకుంటారు. రెండవ బిడ్ కంపెనీ స్వయంగా డబ్బులను వెచ్చించి నిర్మాణం పనులను పూర్తి చేసిన అనంతరం 30 నుండి 50 ఏళ్ల వరకు టోల్ గేట్ల తరహాలోనే టికెట్లు, షాపుల సముదాయం వల్ల వచ్చే ఆదాయాన్ని వసూలు చేసుకునేందుకు అవకాశం కల్పించే టెండర్. ప్రస్తుతం హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్పోర్ట్ నిర్మాణ బాధ్యత జీఎంఆర్ తీసుకొని డబ్బులు వసూలు చేసుకుంటుంది. అదే తరహాలో పీపీపీ బిడ్ టెండర్ ఎయిర్పోర్టుకు రన్ వే పొడిగింపు, టర్మినల్ కోసం 2025 డిసెంబర్లో భూసేకరణ చేసారు. ఎయిర్పోర్టుకు గతంలో ఉన్న 696 ఎకరాలు కాగా రాష్ట్ర ప్రభుత్వం అదనంగా 263 ఎకరాల రైతుల భూములను కొనుగోలు చేసింది. రైతుకు ఎకరాకు రూ 1.12 కోట్ల చొప్పున రూ 295 కోట్ల పరిహారం చెల్లించింది. రెండు రకాల బిడ్లలో రన్ వేపునర్ని ర్మాణం, ప్రహరీ గోడ కోసం జూలై 23న జరిగిన సమావేశంలో టెండర్లను దక్కించుకున్నారు. అదేవిధంగా రెండవ బిడ్ పనుల్లో కొత్త డొమెస్టిక్ టెర్మినల్ బిల్డింగ్, ఏటీసీ టవర్, ఫైర్ స్టేషన్, టెక్నికల్ బ్లాక్ పనులకు అక్టోబర్ 6 నుంచి నవంబర్ 3, 2026 వరకు టెండర్ల ప్రక్రియకు గడువు పెంచారు. ప్రస్తుతం ఎయిర్ ఇండియా అథారిటీకి కావాల్సిన ల్యాండ్ మొత్తం 950 ఎకరాలను అప్పగించింది. పనులు వేగుంతంగా పూర్తి చేసి 2027 సంవత్సరానికి సర్వీసులను ప్రారంభించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుంది. ఎయిర్పోర్ట్ పూర్తిస్థాయిలో నిర్మాణమై విమాన సర్వీసులు అందుబాటులోకి వస్తే కొత్త కంపెనీల ఏర్పాటుతో పాటు లాజిస్టిక్స్ రంగం అభివృద్ధి చెంది ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్య సంబంధాలు కుదరడంతోపాటు నిరుద్యో ఉపాధి అవకాశాలు లభించే అవకాశాలు ఉన్నాయి. లిరూ. 213.59 కోట్లతోలి ఎయిర్ పోర్ట్ అభివృద్ధి పనులకు రూ 213.59 కోట్లతో టెండర్ షెడ్యూల్ ప్రకటించారు. డొమెస్టిక్ టెర్మినల్, ఏటీసీ టవర్ నిర్మాణానికి తాజాగా టెండర్లను ఆహ్వానించారు. ఇక ఫైర్ స్టేషన్, సబ్ స్టేషన్, ఈ అండ్ ఐ వర్క్ షాప్ నిర్మాణం చేయనున్నారు. 18 నెలల్లో పనులు పూర్తి చేయాలని ఎయిర్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిబంధన విధించింది. ఇందులో భాగంగానే ఈ నెల 28వ తేదీన ఎయిర్పోర్టులో ప్రీ-బిడ్ సమావేశం నిర్వహించ నున్నారు. అక్టోబర్ 6వ తేదీ నుంచి నవంబర్ 3వ తేదీ వరకు బిడ్ల దాఖలుకు అవకాశం కల్పించి నవంబర్ 9వ తేదీన టెక్నికల్ బిడ్లను తెరవనున్నారు. నవంబర్ 30న ఫైనాన్షియల్ బిడ్లను ఓపెన్ చేయనున్నారు. తాజాగా ఈ ఎయిర్ పోర్ట్ పనులపై అధికారులతో కలెక్టర్ డాక్టర్ సత్యశారద సమీక్ష నిర్వహించి పలు అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాలు, ఇతర అంశాలపై చర్చించారు. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అయితే ఇప్పటికే ఈ ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి ఎయిర్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అనుమతులు జారీ చేసింది. రూ. 496.86 కోట్ల అంచనాతో అనుమతులు ఇచ్చింది. భూసేకరణ, చట్టబద్దమైన అనుమతులు, మౌలిక సదుపాయాల బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించింది. దీంతో ఇప్పటికే ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయగా. ఇప్పుడు పనుల కోసం టెండర్లను ఆహ్వానించింది. దీంతో త్వరలోనే ఎయిర్పోర్ట్ పనులు మొదలుకానున్నాయి. త్వరలోనే ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీని శంకుస్థాపనకు ఆహ్వానించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం.

అందులో భాగంగానే ఎయిర్ పోర్టు నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 2న ఢిల్లీలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు కలిసి డిసెంబర్లో లోపు బిడ్లను ఫైనల్ చేసి అదే నెలలో పనులకు శంకుస్థాపన చేసే ఆలోచన చేసినట్టు తెలుస్తుంది. ఎయిర్పోర్టును త్వరితగతిన పూర్తిచేసి 2027-2028 జూన్ నెలలో ఎయిర్ పోర్టు నుండి విమాన సర్వీసులు కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే మామునూరు ఎయిర్పోర్టును కాకతీయ తోరణం స్టైల్లో డిజైన్ చేయనున్నారు. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా డిజైన్కు రూపకల్పన చేశారు. ఈ ఏడాదిలోనే ఎయిర్పోర్ట్ పనులను ప్రారంభించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. వరంగల్, ఎయిర్ పోర్ట్ పూర్తయితే జిల్లా,రాష్ట్ర ప్రజలకు వాణిజ్య వ్యాపార దృశ్య ఎంతో మేలు జరగనుంది.

## మున్సిపల్ రిక్షా బండికి పూజలు

### మెరుగైన చెత్త సేకరణకు వినియోగం



- తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలని కార్పొరేటర్ ఆకుల నర్మద నర్సన్న విజ్ఞప్తి

**కరీంనగర్, సెప్టెంబర్20(సింగిడి):** నగరంలోని 11వ డివిజన్లో చెత్త సేకరణ కోసం నూతన మున్సిపల్ రిక్షా బండిని అందుబాటులోకి తీసుకు వచ్చారు. ఆదివారం రోజున డివిజన్ లో కార్పొరేటర్ ఆకుల నర్మద నర్సన్న రిక్షా బండికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డివిజన్లో పారిశుధ్యాన్ని మెరుగు పరిచేందుకు రిక్షా బండిని సక్రమంగా వినియోగిస్తూ ప్రతిరోజూ ఇంటింటి నుంచి చెత్తను సేకరించాలని సూచించారు. ప్రజలు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించి పారిశుధ్య సిబ్బందికి సహకరించాలని కోరారు. రిక్షా బండి నిరంతరం అందుబాటులో ఉండేలా నిర్వహణ పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, చెత్త సేకరణకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ జవాన్ బిక్షపతి, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## పైడాకుల అశోక్‌కు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు

### కేక్ కట్ చేసిన కాంగ్రెస్ శ్రేణులు



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్20(సింగిడి):** మంగపేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ జన్మదిన వేడుకలను మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్టీ సీనియర్ నాయకులు హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు ఒకరికొకరు మిఠాయిలు పంచుకుంటూ పైడాకుల అశోక్ కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, పైడాకుల అశోక్ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ములుగు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆక రాధాకృష్ణ, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, శ్రీ భద్రాచల సీతారామచంద్ర స్వామి దేవస్థానం డైరెక్టర్ పూజారి సురేందర్, సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శి కర్రి నాగేంద్రబాబు, ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ సభ్యుడు మురుకుట్ల నరేందర్, ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లికొండ యాదగిరి, మైప లాలయ్య, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి మూగల చంటి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బసరికాని హరికృష్ణ, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు చాద మల్లయ్య, మైనారిటీ సెల్ అధ్యక్షుడు హిదయతుల్లా, జిల్లా నాయకుడు తుడి భగవాన్ రెడ్డి, మండల నాయకులు చిన్నపెల్లి రాంబాబు, శానం సత్యనారాయణ, ఎండీ హుస్సేన్, కుర్సం లక్ష్మీపతి, పొడెం నాగేశ్వరరావు, గూడూరు రంజిత్, మాటూరి పరమేష్, ఆక సతీష్, మండల సోషల్ మీడియా ఇంచార్జి భూక్యా కుమార్ తో పాటు మండల నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జన్మదిన వేడుకలను విజయవంతం చేశారు.

## ఉపాధ్యాయులే సమాజ నిర్మాణ శిల్పులు

- విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర కీలకం
- విద్యను బలోపేతానికి టీచర్లు భాగస్వాములు కావాలి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, సెప్టెంబర్20 (సింగిడి):** సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "గురువును మించిన దైవం లేదు" అన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదని పేర్కొన్నారు. గురువుల బోధన, మార్గదర్శకత్వంతో ఎంతోమంది విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్, వైద్య, ఇంజినీరింగ్, సాఫ్ట్‌వేర్ తదితర రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారని తెలిపారు. గురువు అందించిన ఉచిత ట్యూషన్ గుర్తుచేసుకున్న ఎమ్మెల్యే తన చిన్ననాటి విద్యాభ్యాసాన్ని ఎమ్మెల్యే ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఘనపూర్ ప్రభుత్వ పాఠశాలలో మాస్టర్‌గా పనిచేసిన తన గురువు గోపాల్‌రావు ఉచితంగా ట్యూషన్ చెప్పి తన విద్యాభివృద్ధికి తోడ్పడ్డారని తెలిపారు. తాను సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో 8, 9, 10 తరగతులు చదువుకున్నానని, తాను ఈ స్థాయికి ఎదగడానికి తన గురువులు అందించిన విద్య, మార్గదర్శకత్వమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. గత పదేళ్లుగా నిలిచిపోయిన డీఎస్సీ నియామకాలను పునరుద్ధరించి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 11 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కల్పించి తల్లిదండ్రులను ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధన, ప్రీ-ప్రైమరీ విద్యార్థులకు అల్పాహారం, విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజనం వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని కోరారు.

**విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి గురువులే దిశానిర్దేశకులు**

విద్యార్థుల అభివృద్ధితో పాటు సమాజ పురోగతిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబంలో తల్లిదండ్రుల తర్వాత పిల్లలు పాఠశాలలో ఉపాధ్యాయులనే ఆదర్శంగా భావిస్తారని పేర్కొన్నారు. విద్యార్థుల్లో మంచి గుణాలు, క్రమశిక్షణ, విలువలను పెంపొందించడంతో పాటు వారి వ్యక్తిత్వ వికాసానికి ఉపాధ్యాయులు దిశానిర్దేశం చేస్తారని అన్నారు. గురువుల బోధన, మార్గదర్శకత్వంతో విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దబడటమే కాకుండా కుటుంబం, సమాజం, దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. తాను కూడా ఉపాధ్యాయ కుటుంబం నుంచి వచ్చానని కలెక్టర్ గుర్తుచేసుకున్నారు. తన తండ్రి రిటైర్డ్ ప్రిన్సిపాల్‌గా, తల్లి రిటైర్డ్ లెక్చరర్‌గా సేవలందించారని తెలిపారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఉపాధ్యాయులు ఎల్లప్పుడూ ఆకాంక్షిస్తారని అన్నారు. మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వంటి మహనీయులు సైతం బోధనా వృత్తిని ఎంతో గౌరవించి, ప్రేమించారని పేర్కొన్నారు. జిల్లాలో ఉపాధ్యాయులు యువతను సన్మార్గంలో నడిపిస్తూ మెరుగైన భవిష్యత్‌కు బాటలు వేయాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులను ఉన్నత లక్ష్యాల వైపు నడిపించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందిస్తున్న ఉపాధ్యాయులను శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, జిల్లా విద్యాశాఖ అధికారి లలిత, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఆసుపత్రిలో సమస్యల పరిష్కారం

### నిరంతర నీరు..విద్యుత్ కేబుల్ లైన్ల ఏర్పాటుకు చర్యలు

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, సెప్టెంబర్20(సింగిడి):** ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతర మంచినీరు, విద్యుత్ సరఫరా ఉండేలా తక్షణ చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో మౌలిక వసతులు, నీటి సరఫరా, విద్యుత్ సమస్యలపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఐడీఓసీ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు నీటి సమస్యతో ఇబ్బందులు పడకుండా శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. జాతీయ రహదారిపై ఉన్న పైప్‌లైన్ క్రాసింగ్ సమస్యను పరిష్కరించి, మిషన్ భగీరథ లేదా మున్సిపల్ పైప్‌లైన్ ద్వారా ఆసుపత్రికి ప్రత్యేక నీటి సరఫరా లైన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నీటి సరఫరా మోటార్ల సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఆసుపత్రికి విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. కేబుల్ లైన్ల మరమ్మతులతో పాటు అవసరమైన ప్రాంతాల్లో అదనపు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ విద్యుత్ సరఫరా నిలిచిపోకుండా భూగర్భ కేబుళ్లు లేదా ప్రత్యామ్నాయ విద్యుత్ లైన్ల ఏర్పాటును పరిశీలించి త్వరితగతిన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆసుపత్రి మౌలిక వసతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అవసరమైన పనులను గుర్తించి, వాటిని ప్రాధాన్యతా క్రమంలో వేగంగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కమిషనర్ ఉదయ్‌కుమార్, మున్సిపల్ ఈఈతో పాటు విద్యుత్, మిషన్ భగీరథ, జాతీయ రహదారుల శాఖ ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీల్యాడ్స్ నిధులతో చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి



**హన్మకొండ, సెప్టెంబర్20(సింగిడి):** ఎంపీల్యాడ్స్ నిధులతో జిల్లాలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సంబంధిత అధికారులను ఆదేశించారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్ లో ఎంపీ స్థానిక ప్రాంత అభివృద్ధి పథకం (ఎంపీ లాడ్స్ )ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, మిషన్ భగీరథ, టీజీఐడీసీ శాఖల అధికారులతో అభివృద్ధి పనుల పురోగతి గురించిన వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ.. ఎంపీ ల్యాడ్స్ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులలో పురోగతిలో ఉన్నవాటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. మిగతా అభివృద్ధి పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. వారం రోజుల్లో ఎంపీల్యాడ్స్ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ముఖ్య ప్రణాళిక అధికారి సత్యనారాయణ రెడ్డి, ఆర్ అండ్ బి ఈఈ దేవిక చౌహాన్, మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ గాయత్రి, పంచాయతీరాజ్ ఈఈ రాజగోపాల్ రావు, డీఈలు శ్రీనివాస రావు, శిరీష, యుగంధర్, రామ్ దేవ్, కన్సల్టెంట్ టెక్నికల్ నరేందర్ రెడ్డి, టీజీఐడీసీ ఏఈ ఎండి. అజీజ్ ఖాన్, పంచాయతీ రాజ్ ఏఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## భూపాలపల్లి అభివృద్ధికి వేగం.. పర్యాటకానికి కొత్త ఊపు

- అటవీ--రెవెన్యూ--ఇరిగేషన్ శాఖల సమన్వయంతో భూ సమస్యలకు చెక్
- రహదారులు, జంక్షన్లు, ట్రాఫిక్ సిగ్నల్స్ అభివృద్ధికి కార్యాచరణ
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, సెప్టెంబర్20 (సింగిడి):** జిల్లాలో అటవీ, రెవెన్యూ, నీటిపారుదల శాఖల పరిధిలోని సమస్యలను పరస్పర సమన్వయంతో పరిష్కరించాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధికారులను ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయంలో అటవీ భూముల సరిహద్దులు, భూ రికార్డులు, ఆక్రమణల నియంత్రణ, నీటి వనరుల పరిరక్షణ, పర్యాటక అభివృద్ధి, భూపాలపల్లి పట్టణ మౌలిక వసతులపై అధికారులతో వేర్వేరుగా సమీక్ష నిర్వహించారు. గ్రామాల వారీగా చేపడుతున్న సర్వే ఆధారంగా అటవీ భూముల విస్తీర్ణం, సర్వే నంబర్లు, సరిహద్దుల వివరాలను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. అటవీ, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేసి భవిష్యత్తులో భూ వివాదాలకు తావులేకుండా స్పష్టమైన రికార్డులు సిద్ధం చేయాలని ఆదేశించారు. కొత్తగా అడవుల నరికివేత, ఆక్రమణలను అడ్డుకునేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే పట్టా భూములు కలిగిన రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు సంబంధించిన అంశాల్లో సబ్‌డివిజన్ స్థాయిలో ఆర్డీఓ, ఎఫ్డీఓల కమిటీల ద్వారా అసైన్‌మెంట్ భూముల వివరాలను సేకరించి, జిల్లా కమిటీ ఆమోదంతో ప్రభుత్వానికి నివేదికలు పంపే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలోని వెట్‌లాండ్స్‌ను గుర్తించి హద్దులను డీమార్కేషన్ చేయడంతో పాటు నీటి వనరుల పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు.

**పాండవుల గుట్టకు పర్యాటక కళ**

సహజ, చారిత్రక ప్రాధాన్యత కలిగిన పాండవుల గుట్టను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా పాండవుల గుట్టలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పర్యాటకుల కోసం టెంట్లు, రహదారి మరమ్మతులు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక వసతులు కల్పించాలని, భవిష్యత్తులో పర్యాటకులు అక్కడే బస చేసేలా శాశ్వత కాటేజీల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

**పట్టణ అభివృద్ధి పనులకు పరుగులు**

భూపాలపల్లి పట్టణంలో రహదారుల విస్తరణ, జంక్షన్ల అభివృద్ధి, ట్రాఫిక్ సిగ్నల్స్ పునర్వ్యవస్థీకరణ, తాగునీటి పైప్‌లైన్లు, విద్యుత్ లైన్ల తరలింపు తదితర పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అధికారులను ఆదేశించారు. అంబేద్కర్ జంక్షన్ నుంచి కృష్ణా కాలనీ వరకు, అంబేద్కర్ జంక్షన్ నుంచి ఓసీ--2 వరకు రహదారి విస్తరణ పనులకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. విస్తరణకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, సింగరేణి, జెన్‌కోకు సంబంధించిన పైప్‌లైన్లను గుర్తించి తరలింపునకు అవసరమైన అంచనాలను తక్షణమే సిద్ధం చేయాలని ఆదేశించారు. అంబేద్కర్ జంక్షన్, కృష్ణ కాలనీ రాజీవ్ సర్కిల్, ఓసీ--2, హనుమాన్ జంక్షన్, బస్టాండ్, మంజూర్‌నగర్ కూడళ్ల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. రహదారుల విస్తరణకు అనుగుణంగా ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించి, ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ నిర్వహణ చర్యలు చేపట్టాలని సూచించారు.

**జాప్యానికి తావులేదు**

మంజూరైన అభివృద్ధి పనులకు టెండర్ ప్రక్రియ పూర్తి చేసి వెంటనే పనులు ప్రారంభించాలని కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయ లోపంతో పనుల్లో జాప్యం జరగకూడదని, సాంకేతిక అనుమతులు, అంచనాలు, వర్క్ స్లిప్పులు తదితర ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం కేటాయించిన ప్రత్యేక నిధులను సమర్థంగా వినియోగించి భూపాలపల్లి పట్టణ రూపురేఖలు మారేలా సమగ్ర అభివృద్ధి చేపట్టాలని పేర్కొన్నారు. ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, అటవీశాఖ అధికారి కిష్టా గౌడ్, ఆర్డీఓ హరికృష్ణ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కమిషనర్ ఉదయ్‌కుమార్, సింగరేణి జీఎం రాజేశ్వరరెడ్డి, మున్సిపల్, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, ప్రజారోగ్య, జాతీయ రహదారులు, ఆర్‌అండ్‌బీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇల్లు అమ్మకం ఒప్పందంలో మోసం..


### బాధితులు దావ నర్సయ్య, చిలుకమ్మ ఆవేదన!

### ఒప్పందం ఉల్లంఘించి ఇల్లు వేరేవాళ్లకు విక్రయం

### పచ్చునూర్ గ్రామంలో ఘోర మోసం!

### ఫిర్యాదు చేసినా రాని నిందితులు

### న్యాయం చేయాలంటూ మానకొండూర్ పోలీసులకు బాధితుల వేడుకోలు!



**మానకొండూర్, సెప్టెంబర్20 (సింగిడి):** ఇల్లు అమ్మకం ఒప్పందంలో మోసానికి గురయ్యామంటూ బాధితులు దావ నర్సయ్య, చిలుకమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. మానకొండూర్ మండలం పచ్చునూర్ గ్రామానికి చెందిన దావ నర్సయ్య, చిలుకమ్మ తమ ఇల్లును పాముల లింగయ్య, లక్ష్మి, నరేష్ అనే వ్యక్తులకు విక్రయించారు. అయితే, ఆ సమయంలో ఇరువర్గాల మధ్య ఒక ముఖ్యమైన ఒప్పందం కుదిరింది. భవిష్యత్తులో ఒకవేళ ఆ ఇల్లును తిరిగి అమ్మాల్సి వస్తే, మొదట తమకే (దావ నర్సయ్య, చిలుకమ్మలకే) అమ్మాలని నిందితులు ఒప్పందం చేసుకున్నారు. కానీ, కొనుగోలు చేసిన నిందితులు ఆ ఒప్పందాన్ని పక్కనబెట్టి, తమకు సమాచారం ఇవ్వకుండా వేరే వ్యక్తులకు ఇల్లు అమ్మేందుకు ప్రయత్నిస్తూ మోసానికి పాల్పడుతున్నారని బాధితులు ఆరోపించారు. ఈ విషయమై తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధితులు మానకొండూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఫిర్యాదు ఇచ్చి మూడు రోజులు గడుస్తున్నా, నిందితులు విచారణకు రాకుండా ముఖం చాటేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక పోలీసులు స్పందించి, నిందితులను వెంటనే స్టేషన్‌కు పిలిపించి విచారణ జరపాలని, తమకు జరిగిన అన్యాయంపై సరైన న్యాయం చేయాలని బాధితులు దావ నర్సయ్య, చిలుకమ్మ వేడుకుంటున్నారు.

## నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

**కమలాపూర్, సెప్టెంబర్20(సింగిడి):** వినాయక నవరాత్రుల సందర్భంగా మండల కేంద్రంలో చెరువులో వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాట్ల లో భాగంగా స్థానిక సర్పంచ్ పబ్బు సతీష్, తహశీల్దార్ ఎం సురేష్ ,సి ఐ పి నవీన్, ఎస్సైలు దిలీప్ ,మధులు పంచాయతీ రాజ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నిమజ్జన సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన భద్రతా చర్యలు, ఏర్పాట్లు చేయాలన్నారు. నిమజ్జన సమయంలో పోలీసులు తెలిపిన నియమాలు పాటించి సహకరించాలని కోరారు.



# ఆధునిక హైదరాబాద్ వాస్తు శిల్పి 7వ నిజాం

## చివరి నిజాం ఉస్మాన్ ఆలీఖాన్

**మీర్ ఉస్మాన్ అలీఖాన్...భాగ్యనగరంలో విడదీయరాని బంధం, సంబంధం, అనుబంధం ఉన్న పాలకుడు. కొందరు ఆయనను ద్వేషించినా, మరి కొందరు ప్రేమించినా, ఆయన హైదరాబాద్ అభివృద్ధికి చేసిన కృషిని అందరూ అభినందించక తప్పదు. కొందరు ఆయన్ను సంకుచిత మనస్తత్వం గలిగిన, కొందరు మతతత్వం గలిగిన పాలకునిగా, మరికొందరు అతన్ని దుర్మార్గుడు అని భావించినా, ఆధునిక హైదరాబాద్ వాస్తుశిల్పిగా, నిర్మాతగా ఆయన జ్ఞాపకం ఉండక మానదు. ప్రణాళికా బద్ధమైన నగరాన్ని అభివృద్ధి చేయడంలో తన దృష్టిని అమోఘం. కృషి అనన్య సామాన్యం. హైదరాబాద్‌కు మౌలిక సదుపాయాలు కల్పించడంలో కట్టెదుట కనిపించే ఆయన పోషించిన పాత్రను ఎవ్వరూ కాదన లేని వాస్తవం.**





ఉస్మాన్ ఆలీ ఖాన్ (ఏప్రిల్ 6, 1886 – ఫిబ్రవరి 24, 1967) మహబూబ్ ఆలీ ఖాన్ రెండవ కుమారుడు. క్రీ.శ. 1911లో నిజాం మరణించడంతో ఏడవ అసఫ్ జా బిరుదుతో నైజాం పదవిని అలంకరించాడు. ఈయనే అసఫ్ జాహీ పాలకులలో చివరివాడు. పూర్తి పేరు " ఫతే జంగ్ నవాబ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ అసఫ్ ఝా. టైమ్ పత్రిక 1937 సంవత్సరం నిజాంను ప్రపంచంలోని అత్యంత ధనవంతునిగా ప్రచురించింది. 1947 ఆగస్టు 15న భారత దేశం స్వాతంత్ర్యం పొందిన అనంతరం హైదరాబాదును స్వతంత్ర రాజ్యం చేయడానికి నిజాం ప్రయత్నించగా, నిజాంతో అనేక సంప్రదింపులు జరిపిన ప్రభుత్వం చివరకు సెప్టెంబరు 13, 1948న ఆపరేషన్ పోలో పేరుతో సైనిక చర్య జరిపి హైదరాబాదు సంస్థానాన్ని భారత దేశంలో విలీనం చేసింది. 1956లో జరిగిన భాషా ప్రయుక్త రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ వలన నిజాం రాజ ప్రముఖ్ పదవి కోల్పోయాడు. ఆయన 1967 సంవత్సర ఫిబ్రవరి 24 తేదీన మరణించాడు.

జమిందార్లు, చిన్న గడీదారులు, దొరలు, తాబేదారులు, నిజాం నవాబుకు కప్పం చెలించే వారు కప్పం ద్వారా వచ్చిన ఆదాయంతో ఎన్నో కట్టడాలు నిజాం నవాబులు నిర్మించారు. అలా నిర్మించిన వాటిల్లో పేర్కొన తగినవి...

చిరాన్ ప్యాలెస్... హైదరాబాదు లోని కాసు బ్రహ్మానంద రెడ్డి జాతీయ వనంలో 1940లో నిర్మించబడిన చిరాన్ ప్యాలెస్, 400 ఎకరాల్లో విస్తరించి ఉంది.
తెలంగాణ హైకోర్టు...1920, ఏప్రిల్ 20న తెలంగాణ హైకోర్టు ప్రారంభించ బడింది.
రాజ్‌భవన్... సోమాజీగూడ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ భవనం ఈ రాజ్‌భవన్. ఇది రాష్ట్ర గవర్నరు అధికారిక నివాసంగా ఉపయోగ పడుతుంది. ఆజా ఖానా ఎ జెహ్రా... మూసీ నది తీరంలో ఆజా ఖానా ఎ జెహ్రా అనే ప్రార్థన మందిరం ఉంది.



నిజాం సాగర్, ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నిర్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం 1918 వ సంవత్సరంలో స్థాపించబడింది. ఇది భారతదేశంలో అతిపెద్ద విశ్వవిద్యాలయాలలో ఒకటిగ్. ప్రాథమిక విద్య తప్పనిసరి చేసింది, పేదలకు ఉచితంగా విద్య అందించారు. సిర్పూరు పేపరు మిల్స్, బోధన్ చక్కెర ఫాక్టరీ, అజంజాహీ నూలు మిల్లులు, చార్మినార్ సిగరెట్ ఫాక్టరీ మొదలైన కర్మాగారాలు నెలకొల్ప బడినవి. నిజాం స్టేట్ రైల్వే నెలకొల్ప బడింది.

1965 లో, నిజాం భారత్ చైనా యుద్ధం 1962 సమయంలో 5000 కిలోల బంగారంన్ని యుద్ధ నిధికి అందించాడు. నిజాం హిందువులు, ముస్లింలను తన రెండు కళ్ళుగా భావించి, అనేక దేవాలయాల పురోగతి కోసం అనేక సార్లు బంగారు, డబ్బుని విరాళంగా ఇచ్చాడు.
నిజాం రాష్ట్ర రికార్డును పరిశీలిస్తే, మీర్ ఉస్మాన్ అలీఖాన్ 82,825 లను యడ్గిర్గుట్ట్ ఆలయానికి, 50,000 రూపాయల భద్రాచలం ఆలయం, 80 వేల రూపాయలకు తిరుపతి వెంకటేశ్వర ఆలయానికి దానం చేశాడని తెలుస్తున్నది.

1932 సంవత్సరంలో, భండార్కర్ ఓరియంటల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (పూణే), హిందూ "మహాభారతం" సంకలనం మరియు ప్రచురణకు, అలాగే "నిజాం గెస్ట్ హౌస్" గా పిలువబడే అతిథికి 50,000 రూపాయలు అందించినట్లు పేర్కొన బడింది.

మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ 1967 ఫిబ్రవరి 24 న కింగ్ కోఠి ప్యాలెస్లో మరణించాడు.
నిజాం అంత్యక్రియల ఘట్టం భారత చరిత్రలోనే అతి పెద్దదిగా, 10 మిలియన్ ప్రజలు నిజాం ఊరేగింపులో పాల్గొన్నట్లు భావించ బడుతున్నది.

**-రామ కిష్టయ్య సంగన భట్ల,**
**సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

# సిద్ధి పొందిన తాపసి జ్ఞానానంద

## సెప్టెంబర్ 21... భౌతిశాస్త్ర వేత్త వర్ధంతి

శాస్త్ర విజ్ఞానానికి, మత విశ్వాసాలను ఎప్పుడూ పొత్తు కుదిరని చాలా మంది భావన. అయితే ఆ భావన తప్పు అని నిరూపించారు, యోగి పుంగవులు, స్వామి జ్ఞానానంద. ఒక వైపు యోగాభ్యాసం కొనసాగిస్తూ, ధ్యాన నిమగ్నుడై, సమాధి స్థితికి చేరుకుని, విదేశాలలో భౌతక శాస్త్రం లో రేడియో ధార్మికతపై విశేష పరిశోధనలు చేసి, వివిధ పదవులు నిర్వహించి, కర్మయోగిగా విజ్ఞన శాస్త్ర రంగంలో విశేష కృషి చేశారు. ఆల్బర్ట్ అయిన్ స్టెయిన్ ,జగదీశ్ చంద్ర బోస్ ,స్వామి జ్ఞానానంద వంటి వారు ఆ రెంటికి ఉన్న అవినాభావ సంబంధాన్ని చక్కగా



వివరిస్తూ రెండు ఒక దాని కొకటి అవసరమని ,అప్పుడే మానవ జాతి పురోగతి అని విస్పష్టం గా చెప్పి ,ఆచరించి మార్గ దర్శనం చేశారు. మతం మరియు విజ్ఞాన సంశ్లేషణ మానవాళికి మేలు చేస్తుందని ఆయన నమ్మారు. యోగా సాధన మరియు సైన్స్ అధ్యయనం కొన్ని సారూప్యతలను కలిగి ఉన్నాయని ఆయన అభిప్రాయ పడ్డారు. ప్రాథమిక యోగ అభ్యాసాలు అంటే మనస్సు మరియు శరీరంపై పాండిత్యం పొందడానికి ఒక వ్యక్తికి శిక్షణ ఇవ్వడం అని నొక్కి చెప్పారు.

స్వామి జ్ఞానానంద పశ్చిమ గోదావరి జిల్లా భీమ వరం దగ్గర గౌరగనమూడి అగ్రహారం లో 1896 డిసెంబర్ 5 న జన్మించారు. అయన అసలు పేరు భూపతి రాజు లక్ష్మీ నరసింహ రాజు. తండ్రి రామ రాజు మహా వేద విజ్ఞానఖని. నరసాపురం టైలర్ హైస్కూల్ లో ప్రాథమిక మాధ్యమిక ఉన్నత విద్య నేర్చి , తణుకు లో చదివే రోజుల్లో 1908లో శ్రీ వాసు దేవానంద సరస్వతి ద్వారా "వాసు దేవ మంత్రం"ఉపదేశం పొందారు. నాటి నుండి ఆద్యాత్మిక చింత నాను రక్తులై, వివాహం జరిగినా రామ కృష్ణ పరమహంస లాగానే దాంపత్య జీవితం గడిపారు. తండ్రి లైబ్రరీలో ఉన్న అరుదైన వేదాంత గ్రంథాలన్నీ చదివి, దివ్యజ్ఞాన గ్రంథాలు రామకృష్ణ వివేకానంద గ్రంథాలు పఠించి బాలగంగాధర్ ఉపన్యాసాలతో ప్రేరితుడై అజ్ఞాతం గా ఉన్న త్యాగ వైరాగ్యాలు బయట పడి ,1917 డిసెంబర్ 21న స్కూల్ ఫైనల్ పరీక్షా ఫలితాలలో నంబర్ కనపడ నందున, విరక్తితో ఇల్లు వదిలి అజ్ఞాతం లోకి వెళ్ళి పోయారు. ముందుగా
నేపాల్ లోని బుద్ధుడి జన్మస్థలం లుంబిని వెళ్ళారు. ఆశ్రమాలలో నివసించి, అందుబాటులో ఉన్న ఆహారం తీసుకున్నారు. తర్వాత పదేళ్లు దేశ సంచారంలో, పెద్దల దర్శనలతో జీవితాన్ని చదువు కున్నారు. హిమాలయాలకు చేరి అక్కడ యోగాభ్యాసం చేస్తూ మరో పదేళ్లు సార్థక జీవనం సాగించారు.
వేదాధ్యయమాన్ని మాత్రం విడువ లేదు. పైగా అన్ని వేదోపనిషత్తుల సారాన్ని అవగాహన చేసి కొన్నారు. మానసిక వికాసం పొందారు. ఢిల్లీ, హరిద్వార్ మీదుగా ఋషీకేశ్ చేరి స్వర్గాశ్రమమ లో సాధన చేశారు. ఫలితంగా శ్రీ కృష్ణ పరమాత్మ సాక్షాత్కారం పొందేవారు. ఆయన తీవ్ర యోగ సాధన చూసి యోగి రాజ్ అనిసంబోధించే వారు. తర్వాత ఆబూ పర్వతం చేరి, గురు శిఖరం పై ఉన్న దత్తాత్రేయ గుహలో ఆరు నెలలు పశ్చిమోత్తాన ఆసనం లో సాధన చేసి, నీల కంఠ మహాదేవ్ లో హఠయోగ ప్రక్రియలు సాధించి, సవికల్ప సమాధి పొంది శ్రీ కృష్ణ దర్శన భాగ్యం పొందేవారు. రుషీ కేశ్ లో శరశ్చంద్ర అనే సిద్ధ పురుషుడు ఆయన 25వ ఏట ఉపదేశం చేసి "స్వామి జ్ఞానానంద "అనే దీక్షానామ మిచ్చారు. గురువుల అనుమతితో బారా ముల్లా వెళ్లి సంత్ సింగ్ గుహలో నాలుగు నెలలు ప్రాణాయామ ఆసన ధ్యానాలు చేశారు. శ్రీనగర్ కాళీ పర్వతం పై గుహలలో కొంత కాలం తపస్సు చేశారు. జాడీ పురా యాపిల్ తోట కుటీరంలో ధ్యాన నిమగ్నుడై నిర్వికల్ప సమాధిలోకి వెళ్ళేవారు. కైలాస మానస సరోవర యాత్రలు చేసి అక్కడకూడా తప మాచరించి, యోగ సాధన అనుభూతులను స్వామి జ్ఞానానంద 30పూర్ణ సూత్రాలుగా రాశారు .
యోగా లో బేసిక్స్ నేర్చుకొంటే మనసు, మెదడు, శరీరాలపై పూర్తి స్వాధీనం కలుగుతుందని సోదాహరణంగా ఉపన్య సహించే వారు స్వామీజీ. 1920 లలో, మత ప్రసంగాలు ఇవ్వడం ప్రారంభించారు. అనేక భక్తి కవితలు రాశారు. పూర్ణ శాస్త్రాలు అయన ప్రధాన సంకలనం. ఇక దృష్టి భౌతిక విషయాలపై ఉంచి, 1930 ప్రారంభంలో జర్మనీ వెళ్ళి, గ్రాడ్యుయేషన్ చేశారు. చార్లెస్ విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్ డోల్జెక్‌తో కలిసి మూడేళ్లపాటు పని చేయడానికి చెకోస్లో వేకియాలోని ప్రేగ్‌కు వెళ్లారు. విశ్వ విద్యాలయంలో ఆయన పరిశోధన ఎక్స్-రే స్పెక్ట్రోస్కోపీలో ఖచ్చితమైన పద్ధతుల అభివృద్ధికి దారితీసింది. 1936 లో లివర్‌పూల్ విశ్వవిద్యాలయంలో న్యూక్లియర్ ఫిజిక్స్ విభాగంలో పనిచేయడానికి అంగీకరించారు. 1940-43 మధ్య బీటా రే స్పెక్ట్రోస్కోపీపై ఆయన చేసిన కృషి ద్వారా పి హెచ్.డి. సాధించారు.

తరువాత యుఎస్‌కు వెళ్లి మిచిగాన్ విశ్వ విద్యాలయంలో అనేక రేడియోధార్మిక ఐసో టోపు లతో బీటా రే స్పెక్ట్రోస్కోపీపై తన పరిశోధనను కొనసాగించారు. 1939 నుండి వ్రాస్తున్న –హై వాక్యూమ్ 'పై తన పుస్తకం రాయడం పూర్తి చేశారు.

భారత ప్రధాని నెహ్రూ ఆహ్వానం పై భారత దేశం వచ్చి, నేషనల్ ఫిజిక్స్ లేబరేటరి పరమాణు విజ్ఞాన పరిశోధనా విభాగం అధిపతిగా 17ఏళ్ళు సేవలందించారు.

1954లో ఆంధ్ర విశ్వ విద్యాలయంలో పరమాణు భౌతిక విజ్ఞాన విభాగం మొట్టమొదటి సారిగా ఏర్పాటు చేసి, 10ఏళ్ళు ఆచార్యులుగా, శాఖాధ్యక్షులుగా పని చేసి, అంతర్జాతీయ ఖ్యాతిని సంపాదించారు. జూలై 1, 1956 న ప్రత్యేక న్యూక్లియర్ ఫిజిక్స్ విభాగం ప్రారంభించ బడింది. 1958 నాటికి డిపార్టుమెంటుకు ఒక భవనం పూర్తయింది, అయన ప్రొఫెసర్, విభాగాధిపతిగా పదోన్నతి పొంది, 1965 వరకు ఆ పదవిలో కొనసాగారు. 1965నుండి 69వరకు ఎందరికో మంత్రం దీక్ష అనుగ్రహించారు.

స్వామి జ్ఞాపకార్థం పరమాణు భౌతిక శాస్త్రంలోని ప్రయోగశాలకు "స్వామి జ్ఞానానంద పరమాణు పరిశోధన ప్రయోగశాల" (ాఝఎఅ జీఖుఖుఖుఅఝుఝఎశీతీఫ్శీతీఅవం టశీతీ చీబఎశ్రీమ్ఖుతీ =వంఖుతీఎష్ట్ర) గా నామకరణం చేశారు. జ్ఞానానంద రచించిన పూర్ణ సూత్రాలు తెలుగు లోకి అనువదించ బడ్డాయి. పరమాణు భౌతిక విజ్ఞాన ప్రాథమిక పాఠాలు, ఫిలాసఫీ ఆఫ్ యోగ, రాజయోగ గ్లిమ్సెస్, హై వాక్యుయా మొదలైనవి ఆంగ్లంలో ముద్రించ బడ్డాయి.

పదవీ విరమణ చేసిన తరువాత, ఆయనను ఎమెరిటస్ ప్రొఫెసర్‌గా నియమించగా, మరణించే వరకు ఆ పదవిలో కొనసాగారు. ఆచార్యోత్తములు, పరమహంస, దర్శనవేత్త, కర్మయోగి అయిన స్వామి జ్ఞానానంద 1969 సెప్టెంబరు 21 తేదీన సౌమ్య సంవత్సర భాద్రపద శుద్ధ దశమి ఆదివారం ఉదయం 7-45 గంటలకు 73వ ఏట పరమపదించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...**
**9440595494**

# స్టాక్ మార్కెట్
Stock Market

### పొద్దుతిరుగుడు పువ్వు నూనె

## విక్రయాలు 10% తగ్గొచ్చు

### అధిక ధర, సరఫరా అంతరాయాల ప్రభావం వల్లే 2026-27పై క్రిసిల్ రేటింగ్స్ అంచనా

**ముంబయి:** పశ్చిమాసియా ఉద్రికత్తల పరిణామాల ఫలితంగా మన దేశంలో శుద్ధి చేసిన (రిఫైన్డ్) పొద్దుతిరుగుడు పువ్వు (సన్‌ఫ్లవర్) నూనె విక్రయాల పరిమాణం ఈ ఆర్థిక సంవత్సరం (2026-27)లో 10% తగ్గే అవకాశం ఉందని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. సరఫరా అంతరాయాలకు తోడు, పెరుగుతున్న ధరల నేపథ్యంలో, చౌకైన ప్రత్యామ్నాయ నూనెల వైపు వినియోగదార్లు మారుతుండటంతో.. గిరాకీ తగ్గి విక్రయాల పరిమాణం తగ్గుతుందని పేర్కొంది. సంస్థ నివేదిక ప్రకారం..

మనదేశంలో వార్షిక వంట నూనె వినియోగం 25-26 మిలియన్ టన్నులు కాగా, శుద్ధి చేసిన పొద్దుతిరుగుడు పువ్వు నూనె వాటా ఇందులో 12-14 శాతంగా ఉంది. మనదేశానికి రష్యా, ఉక్రెయిన్,



అర్జెంటైనా నుంచి ఈ నూనె ఎక్కువగా దిగుమతి అవుతోంది.
పశ్చిమాసియా ఉద్రిక్తతలకు ముందు, ఈ ముడినూనె 12 నెలల సగటు దిగుమతి ధర టన్నుకు 1,275 డాలర్లు కాగా ప్రస్తుతం 1,420-1,440 డాలర్లకు పెరిగింది.

డాలర్‌తో పోలిస్తే బలహీనపడుతున్న రూపాయి, అధిక రవాణా ఖర్చులు మన దేశంలో ముడి పొద్దుతిరుగుడు పువ్వు నూనె దిగుమతి వ్యయాన్ని మరింత పెంచుతున్నాయి. దీంతో నూనె ధరలు పెరిగాయి. దీంతో వినియోగదార్లు ప్రత్యామ్నాయాల వైపు చూస్తున్నారు. పొద్దుతిరుగుడు పువ్వు ముడి నూనె ధర పెరగడం వల్ల, శుద్ధి చేసిన పొద్దుతిరుగుడు పువ్వు నూనె చిల్లర ధరలు కూడా పెరిగాయి. 2026 జనవరిలో లీటరు రూ.150 ఉండగా, ప్రస్తుతం ఈ నూనె లీటరుకు రూ.170-175గా ఉంది. ప్రస్తుతం పొద్దుతిరుగుడు పువ్వు నూనెతో పోలిస్తే బియ్యపు తవుడు, సోయాబీన్ నూనెలు లీటరుకు రూ.10-20 తక్కువకే లభిస్తున్నందున, ఈ ప్రత్యామ్నాయాల వైపు కొందరు మొగ్గు చూపే అవకాశం కనిపిస్తోంది.

## హ్యుందాయ్ ఆఫర్స్.. ఈ కారుపై 1.10 లక్షల వరకు ప్రయోజనాలు!



ప్రముఖ కార్ల తయారీ సంస్థ హ్యుందాయ్ మోటార్ ఇండియా ఏప్రిల్ నెలకు సంబంధించి ఆఫర్లను ప్రకటించింది. హ్యాచ్‌బ్యాక్, సెడాన్, ఎస్‌యూవీ, ఈవీ వాహన శ్రేణిపై భారీగా డిస్కౌంట్‌ను అందిస్తోంది. కొన్ని కార్లపై రూ.1.10 లక్షల వరకు ప్రయోజనాలను అందిస్తోంది. కారు మోడల్, వేరియంట్, ఎక్స్ఛేంజ్ ఎలిజిబిలిటీ బట్టి ఈ తగ్గింపు ఉంటుంది. ఇందులో క్యాష్ డిస్కౌంట్, ఎక్స్ఛేంజ్ బోనస్, స్క్రాపేజ్ సపోర్ట్, అప్‌గ్రేడ్ ప్రోగ్రామ్, కార్పొరేట్ బెనిఫిట్స్, రూరల్ ఇన్సెంటివ్స్ రూపంలో ప్రయోజనాలు లభిస్తాయి.

సిటీ ఫ్రెండ్లీ హ్యాచ్‌బ్యాక్ ఐ10 నియోస్ హైయర్ ట్రిమ్స్‌పై రూ.68వేలు వరకు ప్రయోజనాలను అందిస్తోంది.
డిజైర్‌కు పోటీగా హ్యుందాయ్ నుంచి వచ్చిన ఆరాపై రూ.20 వేల వరకు ప్రయోజనాలను అందిస్తోంది.
ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ ఐ20పై రూ.58వేలు వరకు ప్రయోజనాలను ఆఫర్ చేస్తోంది.
ఎస్‌యూవీ మోడల్ ఎక్స్‌టర్ పాత స్టాక్‌పై రూ.43 వేలు, కొత్త ట్రిమ్స్‌పై రూ.5 వేల వరకు ప్రయోజనాలు లభిస్తాయి.
ఎక్కువగా అమ్ముడయ్యే కాంపాక్ట్ ఎస్‌యూవీ మోడల్ అయిన వెన్యూపై రూ.5 వేల వరకు ప్రయోజనాలను అందిస్తున్నట్లు హ్యుందాయ్ తెలిపింది.
పాత స్టాక్ హ్యుందాయ్ వెర్నా ఐవీటీ ట్రిమ్స్‌పై రూ.1.10 లక్షల వరకు .
క్రెటా, ఎన్‌లైన్ వేరియంట్స్‌పై రూ.55వేలు, క్రెటా ఎలక్ట్రిక్ వేరియంట్‌పై రూ.1 లక్ష వరకు .
అల్కజార్ పెట్రోల్ వేరియంట్‌పై రూ.70 వేలు, డీజిల్ వేరియంట్‌పై రూ.30 వేల వరకు .

### రూ.1.5 లక్షల కోట్లకు

## వీసీ పెట్టుబడులు

**ఢిల్లీ:** ప్రైవేట్ క్యాపిటల్ మార్కెట్లలో ప్రపంచవ్యాప్తంగా మందగమనం ఉన్నప్పటికీ, భారత్‌లో వెంచర్ క్యాపిటల్ (వీసీ) పెట్టుబడులు 2025లో 16 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.1.5 లక్షల కోట్ల)కు పెరిగాయి. ఇవి వరుసగా రెండో ఏడాదీ వృద్ధిని నమోదు చేశాయని అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ బైన్ అండ్ కంపెనీ వెల్లడించింది. బైన్ అండ్ కంపెనీ, ఇండియన్ వెంచర్ అండ్ ఆల్టర్నేట్ క్యాపిటల్ అసోసియేషన్ (ఐవీసీఏ) సంయుక్తంగా 'ఇండియా వెంచర్ క్యాపిటల్ రిపోర్ట్ 2026'ను విడుదల చేశాయి. దీని ప్రకారం మొత్తం లావాదేవీలు ఏడాది ప్రాతిపదికన 18% పెరిగాయి. వివిధ దశల్లో జరిగిన మొత్తం లావాదేవీల సంఖ్య 1300 దాటాయి. ప్రపంచవ్యాప్తంగా స్థూల ఆర్థిక సవాళ్లు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, కఠినమైన నగదు లభ్యత పరిస్థితులు ఉన్నప్పటికీ ఈ వృద్ధి నమోదైంది. 50 మిలియన్ డాలర్ల కంటే తక్కువ విలువ కలిగిన లావాదేవీల్లో బలమైన వృద్ధి ఇందుకు దోహదపడింది.

పెద్ద లావాదేవీలు కూడా వేగం పుంజుకున్నాయి. 250 మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ విలువ కలిగిన లావాదేవీల సంఖ్య నాలుగు నుంచి రెట్టింపై 8కి చేరింది. అనవసర విస్తరణ కంటే.. వ్యాపార నాణ్యత, లాభదాయకతకు ప్రాధాన్యత ఇచ్చే కంపెనీలకే పెట్టుబడిదారులు మొగ్గుచూపారు. కన్జూమర్ టెక్ ఫండింగ్ కొంత తగ్గినా, 2023తో పోలిస్తే ఏడాది ప్రాతిపదికన 25% వృద్ధి దీర్ఘకాలిక స్థిరత్వం కనిపించింది.
ఫిన్‌టెక్ రంగం అద్భుత పనితీరుతో పెట్టుబడుల రికవరీలో కీలక పాత్ర పోషించింది. ఫిన్‌టెక్ లావాదేవీల విలువ ఏడాది ప్రాతిపదికన 2.22 రెట్లు పెరిగాయి. విలువలో చెల్లింపుల విభాగం అతిపెద్ద వాటా కలిగి ఉండగా, డిజిటల్ వినియోగం పెరగడం వల్ల 'వెల్త్‌టెక్' విభాగంలో లావాదేవీల విలువ అయిదు రెట్లు అధికమైంది.
సాఫ్ట్‌వేర్, సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్‌లలో పెట్టుబడులు 1.5 రెట్లు పెరిగాయి. బ్యాంకింగ్, ఆరోగ్య సంరక్షణ రంగాల్లో కృత్రిమ మేధ (ఏఐ), జనరేటివ్ ఏఐ ఆధారిత బీ2బీ కంపెనీలు మంచి ఆదరణ దక్కించుకున్నాయి.
2023 తర్వాత భారత వీసీ వ్యవస్థ మళ్లీ వృద్ధి పథంలోకి వచ్చిందని, ఈ సారి స్పష్టమైన పరిణతి కనిపిస్తోందని బైన్ అండ్ కంపెనీ అసోసియేట్ పార్టనర్ ఆదిత్య మురళీధర్ తెలిపారు



## మాజీ సర్పంచ్ లట్టుపల్లి నరహరిరెడ్డి సేవలు మరువలేనివి

### మృతదేహానికి నివాళులర్పించిన పడకల్ సర్పంచ్ డోకురి సునీత ప్రభాకర్ రెడ్డి



**కల్వకుర్తి (సింగిడి):** తలకొండపల్లి మండలం పడకల్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ లట్టుపల్లి నరహరి రెడ్డి మృతి చెందారు. ఆయన మృతికి పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు సంతాపం వ్యక్తం చేశారు. నరహరి రెడ్డి మృతదేహానికి పడకల్ గ్రామ సర్పంచ్ డోకురి సునీత ప్రభాకర్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నరహరి రెడ్డి గత నాలుగు దశాబ్దాలుగా ప్రజా జీవితంలో కొనసాగుతూ నాలుగు సార్లు గ్రామ సర్పంచ్‌గా, మండల పరిషత్ అధ్యక్షుడిగా, మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వివిధ హోదాల్లో సేవలందించారు. గ్రామ అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేశారని పలువురు గుర్తు చేసుకున్నారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నాయకులు, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ అందరితో కలిసిమెలిసి ఉండేవారని మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజా జీవితంలో నరహరి రెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్థులు నరహరి రెడ్డి మృతికి సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. తలకొండపల్లి,కడ్తల్ నాయకులు గట్ల కేశవరెడ్డి, యాట నరసింహ, గూడూరు శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

### ఐక్యత ఫౌండేషన్ సహకారంతో

## గ్రామాలలో "స్వచ్ఛ జలధార"

### నారాయణపూర్ తండాలో తాగునీటి నిల్వ ట్యాంకుల పరిశుభ్రత



**కల్వకుర్తి (సింగిడి):** ప్రజలకు పరిశుభ్రమైన, నాణ్యమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛ జలధార" కార్యక్రమం రెండవ విడతలో భాగంగా ఆదివారం వెల్దండ మండలం నారాయణపూర్ తండా గ్రామంలో తాగునీటి నిల్వ ట్యాంకుల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా జర్మన్ సాంకేతికతతో కూడిన ప్రత్యేక యంత్రాల సహాయంతో తాగునీటి నిల్వ ట్యాంకులను శాస్త్రీయ పద్ధతిలో శుభ్రపరిచారు. ట్యాంకుల్లో పేరుకుపోయిన మురికి, వ్యర్థాలను తొలగించి, ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందేలా చర్యలు చేపట్టారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణతో పాటు తాగునీటి నాణ్యతను మెరుగుపరచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. "స్వచ్ఛ జలధార" కార్యక్రమాన్ని కల్వకుర్తి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో దశలవారీగా కొనసాగించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో నారాయణపూర్ తండా గ్రామ సర్పంచ్ బాణావత్ బద్రి తారాసింగ్, ఉప సర్పంచ్ నరేష్, ఐక్యత ఫౌండేషన్ గ్రామ ప్రతినిధులు, వార్డు సభ్యులు, యువకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.


ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా.. పరిశుభ్రమైన తాగునీటే ధ్యేయంగా.. ఐక్యత ఫౌండేషన్ చేపడుతున్న "స్వచ్ఛ జలధార" కార్యక్రమం కొనసాగుతోంది.

### ఇసుక పంపిణీలో ఇష్టారాజ్యంగా

## వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులు!

### తీరు మారకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

### భీంగల్ కౌన్సిలర్ నీలం రవి వెల్లడి





**ఆర్మూర్, (సింగిడి):** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజ కవర్గం భీంగల్ మండలం లోని కప్పల వాగును ఇంది రమ్మ ఇండ్ల నిర్మాణా లకు, అభివృద్ధి పనుల నిమిత్తమై ఇసుక అందించేందుకు పాయింటును ఏర్పాటు చేశారు. కప్పల వాగు ఇసుక పాయింటు నుండి అందించే అభివృద్ధి పనుల ఇసుకలో అధికార అండదండలు ఉన్న వారికే అభివృద్ధి పనులు ఇసుక ముందుగా అందిస్తున్నారని, ఇందిరమ్మ నిర్మించుకునే పేదలకు 3 నెలలు గడిచిన ఇసుక అందించడం లేదని, పేదలకు ఒక న్యాయమా, ధనికులకు మరో న్యాయమా అంటూ కౌన్సిలర్ నీలం రవి ప్రశ్నించారు. మన ఇసుక – మనవాహనం యాప్ లో డీడీలు చెల్లించిన లబ్ధిదారులు అభివృద్ధి పనుల ఇసుక కోసం నిరుపేద అమాయక ప్రజలు కార్యాలయం చుట్టూ మూడు నాలుగు నెలలుగా ప్రదర్శనలు చేసిన ఇసుక అందడం లేదని ఆయన ఆరోపించారు. మరికొందరు రెవెన్యూ అధికారులకు ముడుపులు అందించి అలా వెళ్లి ఇలా అభివృద్ధి పనుల ఇసుక తీసుకు వెళ్తున్నారని న్యాయం అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డీడీలు చెల్లించి యాప్ లో నమోదు చేసుకున్నప్పటికీ సాధారణ ప్రజలు ఇసుక అందక ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ధనవంతులకు, అధికార అండదండలు ఉన్నవారికి ఇసుక అందిస్తూ, సంబంధిత అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై కౌన్సిలర్ నీలం రవి మండిపడ్డారు. అభివృద్ధి పనుల ఇసుక అందించడంలో పారదర్శకత అధికారులు పాటించాలని, లేనియెడల పేదలకు జరుగుతున్న ఇసుక అన్యాయంపై, అధికారుల వ్యవహార శైలిపై జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేయాలన్నట్లు కౌన్సిలర్ నీలం రవి వెల్లడించారు.

### అయోధ్య రామ గణేష్ మండలి ఆధ్వర్యంలో

## మహా అన్నప్రసాద వితరణ




**బోధన్ ప్రతినిధి, (సింగిడి):** బోధన్ పట్టణం ఎల్ బిఎస్ నగర్ లో అయోధ్య రామ గణేష్ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ మండపం వద్ద మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వినాయకునికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. భక్తులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

# ఖమ్మంలో పేదల ఇళ్ల కూల్చివేతను తీవ్రంగా నిరసిస్తున్నాం

### పేదల పక్షాన బీఆర్ఎస్ ఎప్పుడు పోరాడుతుంది: మాజీమంత్రి పువ్వాడ అజయ్ కుమార్.






**ఖమ్మం, (సింగిడి):** ప్రభుత్వంలో అధికారుల సమన్వయ లోపం, పాలకుల నిర్లక్ష్యం వల్ల పేద ప్రజల ఇళ్లను ఇష్టమొచ్చినట్లు కూల్చివేస్తున్నారని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలో కేసీఆర్ లేరని, పువ్వాడ అజయ్ కుమార్ లేరని భావించి, పేదల ఇళ్లకు రక్షణ లేకుండా చేసి కూల్చివేస్తున్నారని విమర్శించారు. ఖమ్మం శ్రీని వాస నగర్ పేదల ఇళ్ల కూల్చివేత దారుణం వెలుగు మట్లలో పేదలు ఎంతో కష్టపడి నిర్మించుకున్న ఇళ్లను అర్ధరాత్రి వేళ నేలమట్టం చేసి, గుట్టలుగా మార్చడం చాలా బాధా కరమైన విషయం. ఖమ్మంలో రెక్కాడితే గానీ డొక్కాడని పేద ప్రజలు ఖాళీ స్థలాల్లో గూడు ఏర్పాటు చేసుకుంటే, గత BRS ప్రభుత్వ హయాంలో సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి దాదాపు 3000 మంది పేదలకు GO 58 ద్వారా స్థల క్రమబద్ధీకరణ (పట్టాలు) అందిం చడం జరిగింది. వెలుగుమట్ల, శ్రీనివాసనగర్ తదితర ప్రాంతాల్లో పేదలు నివసిస్తున్న స్థలాలను కేసీఆర్ గారే స్వయంగా పరిశీలించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిస్తామని ప్రతిపాదించినా, పేదలు తమ స్థలాలే తమకు కావాలని కోరడంతో, వారున్న స్థలాలకే క్రమబద్ధీకరణ పట్టాలు ఇవ్వడం జరిగింది. 2014 నాటి GO 58 ని మళ్లీ 2023 ఫిబ్రవరిలో పొడిగించి, ఖమ్మం లో అర్హులైన పేదలంద రికీ కలెక్టర్ సంతకంతో కూడిన పట్టాలను అందించాం.

హైకోర్టు పాత ఆర్డర్ ఆధారంగా అధికారులు చర్యలు తీసుకుంటున్న వేళ, BRS పార్టీ లీగల్ సెల్ తరఫున న్యాయవాదులు రవీందర్ గారు, ఖమ్మం బిడ్డ నిరోష కోర్టులో నిలబడి పేదల తరుపున గళం విప్పారు. అధికారుల దృష్టికి వెళ్లని ఈ GO 58 పట్టాల వాస్తవాన్ని కోర్టు ముందుంచ శ్రీనివాసనగర్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో 696 మంది పేద కుటుం బాలు లబ్ధి పొందిన విషయాన్ని కమిషనర్, ఉన్నతాధికా రులు గుర్తించారని తెలిపారు. పేద ప్రజలను కాపాడా లని న్యాయస్థానాన్ని, అధికారులను చేతులు జోడించి వేడుకుంటున్నాను. కోర్టు ఆదేశించినట్లుగా వారం రోజుల్లో సరైన నివేదికను తయారుచేసి, నిరుపేదలకు న్యాయం చేయాలని, వారు కట్టుకున్న ఇళ్లకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నాను. కార్యక్రమంలో ఆర్‌జెసి కృష్ణ, పగడాల నాగరాజు,బచ్చు విజయ్‌కుమార్, పాలడుగు పాపారావు,మాటేటి నాగేశ్వ రరావు,మం దడుపు రామకృష్ణ,ఖయుమ్, మెంతుల శ్రీశైలం,దడాల రఘు,మస్తాన్, వెంకటేశ్వర్లు, మాటూరి లక్ష్మి నారా యణ,లెలిన్ లీగల్ సెల్ నిరోషా,తిరుమల్ రావు,సుగుణ రావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ఉద్యమాలు కొనసాగాలి

### టీఎస్ యూటీఎఫ్ ఏడో రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం ఏర్పాటు

### గౌరవాధ్యక్షుడిగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని, అధ్యక్షుడిగా కోనేరు పూర్ణచంద్రరావు

### డిసెంబర్ 26, 27, 28 తేదీల్లో రాష్ట్ర మహాసభలు



**కొత్తగూడెం, (సింగిడి):** తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్‌యూటీఎఫ్) ఏడో రాష్ట్ర మహాసభలను విజయవంతంగా నిర్వహించేం దుకు ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశారు. డిసెంబర్ 26, 27, 28 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం కొత్తగూడెంలోని కొత్తగూడెం క్లబ్‌లో రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్న నేపథ్యంలో ఆదివారం కొత్తగూడెం లోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో జిల్లా అధ్యక్షుడు బి. మురళీమోహన్ అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా టిఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి, మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలం వెంకట్ హాజరై మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, బలోపేతం కోసం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నిరంతరం కృషి చేస్తోందని వారు పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యారంగ మనుగడకు ఎదురవుతున్న సవాళ్లపై ఉపాధ్యాయులు, ప్రజలు చైతన్యవంతం కావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర మహాసభలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**టీఎస్ యూటీఎఫ్ ఏడో రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం ఏర్పాటు**

మహాసభల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన ఆహ్వాన సంఘానికి గౌరవాధ్యక్షుడిగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, అధ్యక్షుడిగా కోనేరు పూర్ణచంద్రరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బి. రాజు, ప్రధాన కార్యదర్శిగా ఎం. వెంకటే శ్వర్లు, కోశాధికారిగా బి. మురళీమోహ న్‌లను ఎన్నుకు న్నారు. చీఫ్ ప్యాట్రన్‌గా కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, డిప్యూటీ మేయర్ లలితకుమారి, వ్యవసాయ కార్మిక సంఘం బాధ్యులు మచ్చ వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ నాయకు డు ఎస్. కె. సాబీర్ పాషా, విద్యానగర్ సర్పంచ్ భూక్యా శాంతిశ్రీ, వాసిరెడ్డి మురళి, వైస్ సర్పంచ్, టీజీఈజేఏసీ అధ్యక్షులు అమరనేని రామారావు, ప్రధాన కార్యదర్శి సంఘం వెంకట పుల్లయ్య, ప్రముఖ న్యాయవాది రమేష్‌కుమార్ మక్కాడ్, ప్రభుదయాల్, భార్గవ్ చైతన్య, టి. మాధవరావు, నీరజ, బాలాజీ, పద్మలత, మంగీలాల్ తదితరులు వ్యవహరిం చను న్నారు. సహాధ్యక్షులుగా దుర్గాభవాని, సమ్మారావు, మల్లారెడ్డి, పి. నాగేశ్వరరావు, బి. నరసింహారావు, బి. రాం దాస్, బి. కిషోర్‌సింగ్, ఏ. వెం కటేశ్వర్లు, వీ. వరలక్ష్మి, ఎం. రాజయ్య, ఎస్. వెంకటే శ్వర్లు, జిరాయ శేఖర్, ఎం. వీరబాబు, జీవీ నరసిం హారావు, మల్లేశ్వరరావు, కళ్యాణం నాగేశ్వరరావు తదితరులను నియమించారు. గౌరవ సలహాదారులుగా జిల్లాకు చెందిన గౌరవ శాసనసభ్యులను తీసుకున్నారు.

**మహాసభలకు ముమ్మర ఏర్పాట్లు..**

ఆహ్వాన సంఘంలో భాగంగా జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, వివిధ ఉపసంఘాల కన్వీనర్లు, కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించారు. మహాసభల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో టిఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిమూలం వెంకట్, ఉపాధ్యక్షులు సీహెచ్. దుర్గాభవాని, ఎం. రాజశేఖర్‌రెడ్డి, టి. లక్ష్మారెడ్డి, కార్యదర్శులు రంజిత్‌కుమార్, శ్రీధర్, సింహాచలం, వెంకటప్ప, రవికుమార్, సమ్మారావు, నాగేశ్వరరావు, వెంకటేశం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. మురళీమోహన్, ఎం. వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు, సీనియర్ నాయకుడు ఎస్. కె. దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

# రెజ్లింగ్‌లో హారిక సత్తా.. రాష్ట్ర జట్టులో చోటు!

### కేలో ఇండియా యూత్ గేమ్స్‌లో పతకం సాధించాలి : ఎమ్మెల్యే రామదాసు నాయక్





**కొత్తగూడెం, (సింగిడి):** జూలూరుపాడు మండలానికి చెందిన రెజ్లింగ్ క్రీడాకారిణి జి. హారిక రాష్ట్ర రెజ్లింగ్ జట్టుకు ఎంపిక కావడం అభినందనీ యమని వైరా ఎమ్మెల్యే రామదాసు నాయక్ అన్నారు. ఈ నెల 17, 18 తేదీల్లో హైదరాబాద్ గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో కేలో ఇండియా యూత్ గేమ్స్ రెజ్లింగ్ రాష్ట్ర జట్టు శిక్షణ శిబిరానికి క్రీడాకారుల ఎంపిక కోసం నిర్వహించిన పోటీల్లో హారిక 57 కేజీల విభాగంలో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికైంది. ఈ సందర్భంగా హారికను ఎమ్మెల్యే రామదాసు నాయక్ ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జట్టు శిక్షణలోనూ హారిక ప్రతిభను చాటుకుని కేలో ఇండియా యూత్ గేమ్స్‌లో పతకం సాధించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటాలని ఆకాంక్షించారు. హారికకు అవసరమైన సదుపాయాలు కల్పించ డంతో పాటు క్రీడా ప్రస్థానంలో ముందుకు సాగేందుకు తనవంతు సహకారం, ప్రోత్సాహం అందిస్తానని తెలిపారు. జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి. కాశీ హుస్సేన్ వద్ద శిక్షణ పొందుతున్న హారిక ఇప్పటికే పలు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి అనేక పతకాలు, బహుమతులు సాధించింది. తాజాగా రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడం పట్ల క్రీడా వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ కార్యక్రమంలో జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గుగులోతు కృష్ణ, అసోసియేషన్ సభ్యులు జి. వెంకట్, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల కోసం సైకిల్‌పై గణనాథుని శ్రీశైల యాత్ర





**నారాయణపేట ప్రతినిధి, (సింగిడి):** కష్టాలను కడతేర్చే లంబోద రునిపై అపారమైన విశ్వాసం, వానదేవుని కరుణ కోసం ఒక యువకుని నిశ్చలమైన సంకల్పం... నారాయణ పేట నుంచి శ్రీశైలం వరకు 270 కిలోమీటర్ల మేర సాగిన ఓ భక్తి ప్రయాణం యాత్రగా రూపుదిద్దుకుంది. నారాయణ పేట జిల్లా కేంద్రానికి చెందిన కురువ గేరి లో నివాన ముంటున్న కుర్వ కొత్త వెంకటేష్ అనే యువకుడు తన గృహంలో ఐదు రోజుల పాటు వినాయక చవితి పూజలు నిర్వహిం చాడు. వర్షాలు సమృద్ధిగా కురవక పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడటంతో, లోక కల్యాణం కోసం, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు వర్ధిల్లాలని వెంకటేష్ ఒక పవిత్రమైన సంకల్పాన్ని తలకెత్తుకున్నాడు. తమ కుటుంబీకుల పూజలందుకు న్న గణపతి విగ్రహాన్ని సైకిల్‌పై నిలబెట్టుకొని, శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యుల ఆశీస్సులు తీసుకొని 8 గంటల సమయంలో శ్రీశైల క్షేత్రం వైపు ప్రయాణం ప్రారంభించాడు. అంతులేని భక్తి, చెరగని నమ్మకమే ఇంధనంగా సాగిన ఈ 270 కిలోమీటర్ల సుదీర్ఘ ప్రయాణం... ఆదివారం మధ్యాహ్నా నికి శ్రీశైలానికి చేరుకుంది. అక్కడ పవిత్ర పాతాళ గంగలో గణనాథుని భక్తిశ్రద్ధలతో నిమజ్జనం గావించి, లోక శ్రేయస్సు కోసం పూజలు నిర్వహించా డు. రహదారి పొడవునా భక్తులు నీరాజనాలు పలికినట్లు వెంకటేష్ తెలిపారు. యాత్ర సాగినంత మేర వెంకటేష్ దారిపొడవునా కనిపించిన ప్రజలకు ఓ అద్భుతమైన ప్రేరణగా నిలిచాడు. ఆయన భక్తి తత్పరతను, ఆధ్యాత్మిక సంకల్పాన్ని చూసి మార్గ మధ్యంలోని ప్రతి ఒక్కరూ హృదయపూర్వకంగా అభినందించారు. సంకల్పం స్వార్థరహితమైతే..కొండలైనా కరిగిపోతాయి.. కిలోమీటర్ల దూరం కూడా స్వల్పమైపోతుంది అనడానికి వెంకటేష్ చేసిన ఈ యాత్రే ప్రత్యక్ష నిదర్శనం. ఆ విఘ్నేశ్వరుని అనుగ్రహంతో జిల్లా కేంద్రంలో భారీగా వర్షాలు కురవడంతో ఇట్టి విషయాన్ని వెంకటేష్ కుటుంబీకులు తనకు చరవాణిలో సమాచారం ఇవ్వగా తన సంతోషానికి అవధులు లేవని తెలియజేశాడు.

# ఘోర రోడ్డుప్రమాదంలో డాక్టర్ జగదీష్ దుర్మరణం

### కారులోనే సజీవ దహనమైన ప్రముఖ న్యూరో సర్జన్

### సంతాపం తెలిపిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్యులు..



**కొత్తగూడెం, (సింగిడి):** సూర్యాపేట మండలం పిల్లలమర్రి ఫ్లైఓవర్ సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఖమ్మం మమతా హాస్పటల్‌కు చెందిన ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ జగదీష్ దుర్మరణం చెందారు. ఖమ్మం–హైదరా బాద్ 365 జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న వోల్వో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే కారు పూర్తిగా మం టల్లో చిక్కుకోవడంతో అందులో ఉన్న డాక్టర్ జగదీష్ సజీవ దహనమైనట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారిం చారు. ఘటనా స్థలంలో మృతదేహానికి సంబంధించిన ఆనవాళ్లు లభ్యమైనట్లు తెలిసింది. ప్రమాదం ఉదయం సుమారు 7.15 గంటల ప్రాంతంలో జరిగినట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు. ప్రమాద తీవ్రతకు కారు పూర్తిగా దగ్ధం కావడంతో నంబర్ ప్లేట్ సైతం కాలిపోయింది. దీంతో వాహనం, మృతుడి వివరా లను తొలుత గుర్తించడం పోలీసులకు కష్టంగా మారింది. విషయం తెలుసుకున్న సూర్యాపేట రూరల్ ఎసఐ ఎం. అనిల్ కుమా ర్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలిం చారు. ప్రమా దానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు. జాతీయ రహదారిపై ఉన్న టోల్ ప్లాజాల సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలిస్తూ కారు ప్రయాణించిన మార్గం, వాహన వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

**వైద్య రంగానికి తీరని లోటు**

ప్రమాదంలో మృతి చెందిన డాక్టర్ జగదీష్ ఎంఎస్ న్యూరో సర్జన్‌గా గత రెండు దశాబ్దాలుగా ఖమ్మం ప్రాం తంలో విశిష్ట వైద్య సేవలు అందించారు. న్యూరో సర్జరీ విభాగంలో తన సేవలతో మంచి గుర్తింపు పొందిన ఆయన ఆకస్మిక మరణం ఖమ్మం ప్రజలకు, వైద్య రం గానికి తీరని లోటుగా పలువురు వైద్యులు పేర్కొన్నారు.

డాక్టర్ జగదీష్ మృతిపట్ల భద్రాద్రి కొత్త గూడెం జిల్లా వైద్య బృందం తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. ఆయన ఆత్మకు శాంతి చేకూ రాలని, కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యం, మనోబలం కలగాలని సం ఘం తరపున ప్రార్థిస్తున్నట్లు తెలిపింది. భద్రా ద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన వైద్యులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ కంభంపాటి రంగారావు, డాక్టర్ ఆకునూరి కనకరాజు, డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ సీహెచ్ కృష్ణప్రసాద్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ బాబురావు, డాక్టర్ బీఎస్‌రావు, డాక్టర్ రవిబాబు, డాక్టర్ పాషా, డాక్టర్ వెంకన్న, డాక్టర్ హరి, డాక్టర్ శ్రీబాబు, డాక్టర్ శైలేష్‌కుమార్, డాక్టర్ మురళికృష్ణ, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ శ్యామల, డాక్టర్ స్వప్న, డాక్టర్ కవిత, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ బిందుపల్లవి, డాక్టర్ స్రవంతి, డాక్టర్ జయ, డాక్టర్ ఉష, డాక్టర్ తేజల్ అగర్వాల్ తదిత రులు డాక్టర్ జగదీష్ మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

### శ్రీ మేరామయడి ఆలయ నిర్మాణానికి

## రూ.51 వేల విరాళం

### అందజేసిన సింగిల్ విండో చైర్మన్ భాస్కర్ రావు



**కల్వకుర్తి (సింగిడి):** వెల్దండ మండలం నగరగడ్డ తండాలో శ్రీ మేరామయడి నూతన మందిరం నిర్మాణానికి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు 51 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆలయ అభివృద్ధికి విరాళం అందించడం సంతోషంగా ఉందని అమ్మవారి ఆశీర్వాదం తండా ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు చైర్మన్ జూపల్లి భాస్కరరావు అన్నారు. ఆలయ నిర్మాణానికి అవసరమైన సహకారం అందించడంపై తండా నాయకులు జూపల్లి భాస్కర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నగరగడ్డ తండా నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు వరం సీఎం సహాయ నిధి

### ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి



**కల్వకుర్తి (సింగిడి):** మాడ్గుల మండలం ఫిరోజ్‌నగర్ గ్రామానికి చెందిన కలకొండ జ్యోతి కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన 44,000 చెక్కును ఈరోజు హైదరాబాద్‌లో వారి కుటుంబ సభ్యులకు అందజేశా రు. ఈ సందర్భంగా గోలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, పేదల ఆరోగ్య అవసరాల దృష్ట్యా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందుతున్న సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాడ్గుల మండలం బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జైపాల్ రెడ్డి ఫిరోజ్‌నగర్ సర్పంచ్ కలకొండ జంగమ్మ శ్రీను మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురమళ్ల సుభాష్ నాయకులు సతీష్, సీత మహేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## స్నేహపూర్వక సమ్మేళనమే ప్రసాద్ పార్టీ

### వైశ్య సంఘం గణేష్ మండపాలను సందర్శించిన ఎమ్మెల్యే ధన్ పాల్



**నిజామాబాద్ (సింగిడి):** వైశ్య సంఘం వినాయక మండపాల్లో నిర్వహించే స్నేహపూర్వక సమ్మేళనమే ప్రసాద్ పార్టీ అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని గంజ్ లో గల పట్టణ వైశ్య సంఘంలో "ప్రసాద్ పార్టీ" నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హిందూ సంస్కృతి సాంప్రదాయాలను ముందుకు నడపడంలో వైశ్యులు ఎల్లప్పుడూ ముందుంటారన్నారు. వైశ్యులంతా ఏకతాటిపై నడిచి ఐక్యతతో ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గత 55 సంవత్సరాలుగా తాను ప్రసాద్ పార్టీకి హాజరవుతున్నానని గుర్తు చేశారు. యువజన సంఘం కమిటీ వినాయకుని ఉత్సవాలను అద్భుతంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు. సంఘంలో 82 ఏళ్లుగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం ఎంతో గర్వకారణం అన్నారు. భవిష్యత్తులో మరింత అద్భుతంగా ఉత్సవాలని నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైశ్య సేవా సంఘం గణేష్ మండలి అధ్యక్షుడు శివకుమార్ గుప్తా, పట్టణ వైశ్య సంఘం ఇల్లెందుల ప్రభాకర్ గుప్తా, మోటూరి మురళి గుప్తా, అర్వపల్లి పురుషోత్తం గుప్తా, శ్రీనివాస్ గుప్తా, ఆయా అనుబంధ సంఘ ప్రతినిదులు తదితరులు పాల్గొన్నారు.

### సేవా దృక్పథంతోనే

## ఆదర్శ సమాజ నిర్మాణం

### అన్నదానం భిన్నవర్గాల మధ్య ఐక్యతను పెంచుతుంది

### సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ కె సాబీర్ పాషా





**కొత్తగూడెం, (సింగిడి):** ఆధ్యాత్మిక భావనతో పాటు సమాజానికి ఉపయో గపడే సేవా కార్యక్రమాలు నిర్వహించినప్పుడే పండుగల పరమార్థం నెరవేరు తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ కె సాబీర్ పాషా అన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 50వ డివిజన్ ఎన్ఎమ్‌సిసి ఆధ్వర్యంలో, 30వ డివిజన్ గొల్లగూడెం, 29వ డివిజన్ ప్రగతినగర్, 26వ డివిజన్ మధురబస్తీలలో ఆదివారం ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాలకు కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ తో కలిసి ప్రారంభించారు. అంతకుముందు ఆయా ప్రాంతాల్లో కొలువుదీరిన వినాయక మండపాల వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు, ప్రజలకు ఉత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జరిగిన కార్యక్రమాల్లో సాబీర్ పాషా మాట్లాడుతూ.. సమష్టి తత్వానికి, మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే వినాయక చవితి వేడుకల్లో అన్నదానం వంటి మహత్తర సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రజలంతా వర్గ, వర్ణ బేధాలు విడనాడి ఐక్యమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సమాజంలో ఆపదలో ఉన్నవారికి, పేదలకు బాసటగా నిలిచే సేవా గుణాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమాల్లో 50వ డివిజన్ కార్పొరేటర్ దాసరి శ్రీనివాస్, 30వ డివిజన్ కార్పొరేటర్ దర్గయ్య, నాయకులు నేరెళ్ల శ్రీనివాస్, నేరెళ్ల సమైక్య, పి సత్యనారాయణాచారి, మాచర్ల శ్రీనివాస్, నేరెళ్ల రమేష్, యెర్ర రాజు, కసరబోయిన రమేష్, ఏ. లక్ష్మీనారాయణ, పసుపులేటి భరత్, పొన్నం అజయ్, సాంబ, చోటు షరీఫ్, అంజాన్ రావు, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభాతనవ సింగిడి ప్రతి రంగూ ఓ నిజం

Singidi

సోమవారం 21-9-2026

## విద్యార్థి సలహా కమిటీకి ప్రతినిధుల ఎన్నిక

**విద్యార్థుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడమే లక్ష్యం.**

**ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి**



**కరీంనగర్, (సింగిడి):** ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి), కరీంనగర్‌లో విద్యార్థుల సమస్యలను తెలుసుకుని, వారి అభిప్రాయాలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు కళాశాల కార్యకలాపాల్లో విద్యార్థుల భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు విద్యార్థి సలహా కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఎన్నికల్లో కళాశాల ప్రతినిధులుగా బీఎస్సీ నుంచి భాగ్య ఫాతిమా, ఆర్. నవ్యశ్రీ, బీఏ నుంచి జోయా, బీకాం నుంచి సమన్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కమిటీ కన్వీనర్ డా. డి. అనంతలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారంతో పాటు విద్యా, సహపాఠ్య కార్యక్రమాల్లో వారి చురుకైన భాగస్వామ్యానికి కమిటీ వేదికగా నిలుస్తుందని తెలిపారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికైన ప్రతినిధులు విద్యార్థుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి కళాశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. విద్యార్థులు, అధ్యాపకులు, యాజమాన్యం సమన్వయంతో సానుకూల విద్యా వాతావరణం ఏర్పడేందుకు కమిటీ కృషి చేస్తుందని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన ప్రతినిధులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో డా. బి. రజినీదేవి, పి. స్వరూప, డా. ఆర్. మొగిలి, డా. ఇ. స్రవంతి, జె. స్వప్న, టి. రాజేష్, పి. అనిత, కె. మౌనిక, కె. రుద్రవేణి తదితరులు పాల్గొన్నారు.

## ఫాంహౌస్‌లో ప్రభుత్వ భూములుంటే స్వాధీనం చేసుకోండి

**కాంగ్రెస్ నేతల ఫాంహౌస్ పర్యటనపై, ఖైరతాబాద్ ఉప ఎన్నికపై కీలక వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్**




**కరీంనగర్ (సింగిడి):** మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫాం హౌస్ భూములను కాంగ్రెస్ నేతలు సందర్శించడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. కరీంనగర్‌లో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ఫాంహౌస్ ఏమైనా పర్యాటక కేంద్రంగా మారిందా అని ప్రశ్నించారు. ప్రైవేటు భూముల్లోకి వెళ్లే అధికారం కాంగ్రెస్ నేతలకు ఎవరిచ్చారని నిలదీశారు. ఫాంహౌస్‌లో ప్రభుత్వ భూములు ఉన్నట్లు ఆధారాలు ఉంటే, అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే వాటిని స్వాధీనం చేసుకోవాలని సూచించారు. భూదాన్ పిటీకి సంబంధించిన ఆధారాలు ఉంటే పత్రాలతో సహా ప్రజల ముందు పెట్టాలని, అవసరమైతే భూముల స్వాధీనంతో పాటు నేరపూరితమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష పార్టీలు ఫాంహౌస్‌ను సందర్శిస్తే అర్థం చేసుకోవచ్చని, అధికార పార్టీ నేతలే అక్కడికి వెళ్లడం విడ్డూరంగా ఉందన్నారు. భూముల నమోదుకు సంబంధించిన 22-ఏ నిబంధనలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బండి సంజయ్ అన్నారు. గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు 22-ఏను తమకు అనుకూలంగా ఉపయోగించుకున్నాయని ఆరోపించారు. సమస్యను పరిష్కరించకపోతే తదుపరి కార్యాచరణ చేపడతామని, అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని చెప్పారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికను ఎదుర్కొనే ధైర్యం లేకే కాంగ్రెస్ సుప్రీంకోర్టును ఆశ్రయించిందని బండి సంజయ్ విమర్శించారు. ఉప ఎన్నిక జరిగితే పోటీ బీజేపీ, బీఆర్ఎస్ మధ్యే ఉంటుందని, కాంగ్రెస్ తమకు పోటీ కాదని వ్యాఖ్యానించారు. దానం నాగేందర్ తనను ఖైరతాబాద్ వినాయకుడితో పోల్చుకోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. వినాయకుడిని చివర్లో నిమజ్జనం చేస్తారనే విషయం గుర్తుంచుకోవాలని వ్యాఖ్యానించారు. కరీంనగర్‌లో గణేశ్ నవరాత్రి నిమజ్జన ఉత్సవాలను గతం కంటే ఘనంగా నిర్వహిస్తామని బండి సంజయ్ తెలిపారు. భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలని, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. పోలీసులకు, అధికారులకు సహకరించాలని కోరారు.

ఇదిలా ఉండగా, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్లతో కలిసి పారిశుధ్య సిబ్బందికి చెత్త సేకరణ కోసం మూడు చక్రాల వాహనాలు, దోమల నివారణ యంత్రాలను బండి సంజయ్ అందజేశారు. నగరంలో చెత్త నిర్వహణను మెరుగుపరిచేందుకు అదనపు ట్రాక్టర్లు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. డంపింగ్ యార్డు సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామని, రూ.17 కోట్లతో జీవ వ్యర్థాల నిర్వహణ పనులకు టెండర్లు ప్రారంభం కానున్నాయని చెప్పారు. మరో రూ.80 కోట్ల నిధులతో ఘన వ్యర్థాల నిర్వహణ పనులు, రూ.16 కోట్లతో తాజా వ్యర్థాల నిర్వహణ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మేయర్ కోలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు తదితరులు పాల్గొన్నారు.

## 11వ డివిజన్‌లో వినాయక మండపాల సందర్శన

**భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన కార్పొరేటర్ ఆకుల నర్మద, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న**



**కరీంనగర్, (సింగిడి):** వినా యక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కరీం నగర్ 11వ డివిజన్ పరిధిలోని కట్టరాంపూర్, అయోధ్య కాలనీ, వాసుదేవ కాలనీ, రెడ్‌హిల్స్ కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపా లను కార్పొరేటర్ ఆకుల నర్మద, కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా మండపాల్లో గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం కాలనీవా సులు, మండపాల నిర్వాహకులు వారిని శాలువాలతో సత్కరించారు. ఆకుల నర్మద మాట్లాడుతూ, వినాయక నవరాత్రి ఉత్సవా లను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. గణనాథుడి ఆశీస్సులతో 11వ డివిజన్ ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారో గ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆకుల నరసన్న మాట్లాడుతూ వినాయక చవితి ఉత్స వాలు ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయా కాలనీల ప్రజలు, మహిళలు, యువకులు, వినాయక మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## వైభవంగా మానేరు స్కూల్ బాల గణేశుడి నిమజ్జనం

**భక్తిశ్రద్ధలతోపూజలు., ఉత్సాహంగా నిమజ్జన శోభాయాత్ర,**



**కరీంనగర్, (సింగిడి):** మంకమ్మతోటలోని సాయి మానేరు ఉన్నత పాఠశాలలో ప్రతిష్ఠించిన మట్టి బాల గణేశుడి నిమజ్జన కార్యక్రమాన్ని ఆదివారం రోజున భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నిమజ్జ నానికి ముందు విద్యార్థులు, ఉపాధ్యాయులు గణనాథుడిని ప్రత్యేకంగా అలంకరించి వాహనంపై కొలువుదీర్చారు. మానేరు విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి పాల్గొని విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణనాథుడిని నిమజ్జనానికి తరలిస్తుండగా విద్యార్థులు, ఉపాధ్యాయులు భక్తిగీతాలకు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ సందడి చేశారు. ఈ సందర్భంగా అనంతరెడ్డి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతిని ప్రతిష్ఠించి నిమజ్జనం చేయడం ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ స్పృహతో పాటు సంప్రదాయాలపై అవగాహన పెంపొందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గణపతి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి





**నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి**

**కెడిసిసి బ్యాంక్ వైస్ చైర్మన్ పింగళి రమేష్**

**మేదరివాడ వినాయకుడికి ప్రత్యేక పూజలు**

**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుంట పట్టణంలోని మేదరి వాడలో శ్రీ విఘ్నేశ్వర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పా టుచేసిన వినాయకుడి వద్ద ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంకు వైస్ చైర్మన్ పింగళి రమేష్ జమ్మికుంట మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ, ప్రజలు భక్తులు ప్రశాంతమైన వాతావం ణంలో నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలని సూచించారు. దశాబ్ద కాలంగా మేదరి వాడలో శ్రీ విఘ్నేశ్వర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి ఉత్సవాలను యూత్ సభ్యు లు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారని వీరికి సహకరిస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కలపల్లి రాజేశ్వరరావు కు రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. నేటి యువత భక్తి మార్గం వైపు నడుస్తూ నవరాత్రి ఉత్సవాలను ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వర్తించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. శ్రీ విఘ్నేశ్వర ఉత్సవ కమిటీ సభ్యులు ఐకమత్యంతో కుల మతాలకు అతీతంగా ప్రశాంతమైన వాతావరణంలో నవరాత్రి ఉత్సవాలను జరుపుకుంటూ మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందించదగ్గ విషయమని తక్కలపల్లి రాజేశ్వరరావు తెలిపారు. ఆ విఘ్నేశ్వరుడి ఆశీ స్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని రాష్ట్రంలో పాడి పంటలు సమృద్ధిగా పండాలని ఆ భగవంతుడిని పేర్కొన్నట్లు వారు ఈ సందర్భంగా తెలిపారు. ఈ మహా అన్నదాన కార్యక్రమానికి వచ్చిన అతిథులను వార్డు కౌన్సిలర్ చింతల శ్రీనివాస్ వారిని సాదరంగా ఆహ్వానించి సన్మానించారు. వేద పండితులు మండలేముల కపర్తి శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి అతిధులకు భక్తులకు ఆశీర్వచనం తోపాటు తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకుడు గుంటి సామ్రాజ్యం మాజీ మున్సిపల్ చైర్మన్ పోడేటి రామస్వామి శ్రీ విఘ్నేశ్వర ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరుడి చెంత కాంగ్రెస్ నేతల భక్తి సందడి





**రామగుండంలోని గణనాథుల మండపాల్లో ప్రత్యేక పూజలు**

**ప్రజల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాల కోసం ప్రార్థనలు.. అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్న నాయకులు**

**గోదావరిఖని, (సింగిడి):** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రామగుండం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథుల మండపాలు భక్తిశ్రద్ధలతో కళకళలాడుతున్నా యి. ఈ సందర్భంగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఠాకూర్ అయోధ్య సింగ్, రామగుండం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఈదునూరి హరిప్రసాద్ తదితరులు పలు గణేష్ మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించా రు. విఘ్నేశ్వరుడిని దర్శించుకుని రామగుం డం పట్టణ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, ప్రశాంతంగా జీవించేలా ఆశీస్సులు అందించాలని నాయకులు మనస్ఫూర్తిగా ప్రార్థించారు. అనంతరం ఆయా మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

**భక్తి.. సేవకు ప్రతీకగా అన్నదానం**

వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భక్తులకు అన్నదానం నిర్వహించడం అభినందనీయ మని నాయకులు పేర్కొన్నారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రజలకు సుఖశాంతులు, ఆరోగ్యం, సమృద్ధి చేకూరాలని ఆకాంక్షించారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో నిర్వహించాలని గణేష్ భక్త మండలి సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఠాకూర్ బల్వాన్ సింగ్, మోసం పృథ్వీరాజ్, సాదు రమేష్ పటేల్తో పాటు ఆయా గణేష్ భక్త మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ఉషను పరామర్శించిన సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



**సత్తుపల్లి, (సింగిడి):** హైదరాబాద్ ఎస్ఆర్‌నగర్‌లోని జయంతి మల్టీ స్పెషాలిటీ ప్రైవేట్ ఆసుపత్రిలో అనారోగ్య కారణాలతో చికిత్స పొందుతున్న సత్తుపల్లి ప్రముఖ విలేకరి షేక్ ఖాదర్ బాబా సతీమణి ఉషను సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుబ్బారెడ్డి ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

**గల్లీ నుంచి ఢిల్లీ వరకు, కులగణనపై**

## రుద్ర సంతోష్‌కు కీలక బాధ్యత

**జాతీయ స్థాయిలో 100 రోజుల కులగణన ప్రచారానికి సమన్వయ బాధ్యతలు**



**కరీంనగర్, (సింగిడి):** తెలంగాణలో కులగణన కార్యక్రమాన్ని క్షేత్రస్థాయి వరకు తీసుకెళ్లేం దుకు సమన్వయ వ్యవస్థను విజయవంతంగా నిర్వహించిన రుద్ర సంతోష్ కుమార్‌కు జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించినట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. జాతీయ జనగణనలో కులగణన అంశంపై దేశవ్యాప్తంగా చేపట్టనున్న 100 రోజుల ప్రచార కార్యక్రమానికి ఏఐసీసీ వార్ రూమ్ సమన్వయకర్తగా ఆయనను నియమించినట్లు పేర్కొన్నాయి. ఈ ప్రచారంలో రాష్ట్రాల వారీగా కార్యాచరణ ప్రణాళిక, శిక్షణ, సంస్థాగత సమన్వయం, క్షేత్రస్థాయి అవగాహన కార్యక్రమాలు, సమాచార సేకరణ, పురోగతి పర్యవేక్షణ వంటి అంశాలను సమన్వయం చేయనున్నారు. రాష్ట్రాల నుంచి వారపు నివేదికలు, అభిప్రాయాలను సేకరించి, అవసరమైన మార్గదర్శకాలను అందించేలా జాతీయ స్థాయి సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు.

**తెలంగాణ అనుభవానికి జాతీయ స్థాయిలో ప్రాధాన్యత..**

2024--25లో తెలంగాణలో నిర్వహించిన కులగణన సందర్భంగా రుద్ర సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమన్వయ కేంద్రం, కాల్ సెంటర్ ఏర్పాటు చేసి కార్యకర్తలు, మండల అధ్యక్షులు, బ్లాక్, గ్రామ, బూత్ స్థాయి ప్రతినిధులతో నిరంతరం సమన్వయం చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. సుమారు 45 రోజులపాటు కొనసాగిన ఈ కార్యక్రమంలో రోజుకు 2,000 మందికి పైగా కార్యకర్తలు, సంస్థాగత ప్రతినిధులతో సంప్రదింపులు జరిపినట్లు పేర్కొన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 100కు పైగా కుల సంఘాలు, సుమారు 35 వేల మంది బూత్ స్థాయి కార్యకర్తలతో సమన్వయం చేసినట్లు వెల్లడించాయి.

**15 వారాల కార్యాచరణ ప్రణాళిక..**

సెప్టెంబర్ 8న ఢిల్లీలోని ఏఐసీసీ ఇందిరా భవన్‌లో జరిగిన జాతీయ ఓబీసీ కార్యశాలలో 100 రోజుల ప్రచారానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను రుద్ర సంతోష్ కుమార్ వివరించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. సుమారు 45 నిమిషాలపాటు జరిగిన ప్రదర్శనలో రాష్ట్ర స్థాయి సమన్వయ కేంద్రాల ఏర్పాటు, శిక్షకుల ఎంపిక, జిల్లా స్థాయి శిక్షణ, మండల--గ్రామ స్థాయి కార్యక్రమాల విస్తరణ, పురోగతి పర్యవేక్షణ, రాష్ట్రాల మధ్య సమన్వయం వంటి అంశాలను వివరించారు. 100 రోజుల కార్యక్రమాన్ని 15 వారాలుగా విభజించి, రాష్ట్రాల వారీ అవగాహన కార్యక్రమాలు, శిక్షణ, ఓబీసీ వర్గాలతో విస్తృత సంప్రదింపులు, పౌర సమాజ సంస్థలతో సమన్వయం చేపట్టేలా ప్రణాళిక రూపొందించినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. తెలంగాణలో క్షేత్రస్థాయిలో సాధించిన అనుభవాన్ని జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా వినియోగిస్తూ, కులగణనపై దేశవ్యాప్త కార్యక్రమానికి సమగ్ర సమన్వయ వ్యవస్థను రూపొందించడమే ఈ బాధ్యతలో ప్రధాన లక్ష్యంగా ఉండనుంది.

**పాల్వంచ కాంగ్రెస్ పగ్గాలు..**

## మళ్లీ నూకల రంగారావుకే!

**పట్టణ అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు..**

**పార్టీ బలోపేతమే లక్ష్యమన్న రంగారావు**

**డీసీసీ అధ్యక్షురాలు తోట దేవీ ప్రసన్నను కలసి కృతజ్ఞతలు.. నాయకత్వం అభినందనలు**

**"పదవి ఉన్నా.. లేకున్నా కార్యకర్తనే" : నూకల**



**కొత్తగూడెం, (సింగిడి):** పాల్వంచ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నూకల రంగారావు మరోసారి నియమితులయ్యారు. కాంగ్రెస్ పార్టీతో సుదీర్ఘకాలంగా కొనసాగుతూ, పార్టీ కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొంటున్న ఆయనకు మరోసారి పట్టణ పార్టీ బాధ్యతలను అప్పగించారు. దీంతో పాల్వంచ పట్టణ కాంగ్రెస్‌లో రంగారావు నియామకానికి ప్రాధాన్యం ఏర్పడింది. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి మొదటి నుంచి పార్టీ కోసం పనిచేస్తున్నానని నూకల రంగారావు తెలిపారు. పార్టీ అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. కాంగ్రెస్‌నే నమ్ముకుని పనిచేశానని పేర్కొన్నారు. తనకు కాంగ్రెస్ పార్టీ కన్నతల్లిలాంటిదని, మొదటి నుంచి పార్టీలో కొనసాగుతున్న తాను చివరి వరకు కాంగ్రెస్ కార్యకర్తగానే కొనసాగుతానని స్పష్టం చేశారు. కాగా పార్టీకి విధేయుడిగా, పదవుల కోసం కాకుండా పార్టీ బలోపేతానికి కృషి చేసే నాయకుడిగా మంచి పేరున్న నూకల రంగారావుకు మళ్లీ పాల్వంచ పట్టణ అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం పట్ల పలువురు సీనియర్ నాయకులు, పార్టీ అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

**పదవి ఉన్నా.. లేకున్నా కార్యకర్తనే..**

కాంగ్రెస్ పార్టీ చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్వంచ పట్టణంలో అత్యధిక సభ్యత్వాల నమోదుకు తన వంతు కృషి చేశానని రంగారావు తెలిపారు. అప్పటి పీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం ఈ కార్యక్రమాన్ని ప్రశంసించారని ఆయన పేర్కొన్నారు. పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమంలోనూ కార్యకర్తగా పాల్గొంటూ తన బాధ్యతను నిర్వర్తించానన్నారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలోనూ తన వంతు పాత్ర పోషించానని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన భారీ బహిరంగ సభలకు పెద్ద సంఖ్యలో ప్రజలను సమీకరించడంలో కృషి చేశానన్నారు. పార్టీ కార్యక్రమాల కోసం పదవులతో సంబంధం లేకుండా క్షేత్రస్థాయిలో పనిచేస్తూ వచ్చానని చెప్పారు. పదవి ఉన్నా లేకున్నా కాంగ్రెస్ పార్టీకి సాధారణ కార్యకర్తగా పనిచేయడమే తనకు ముఖ్యమని అన్నారు. తనపై నమ్మకంతో రెండోసారి పాల్వంచ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించడం పట్ల పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వర్తిస్తూ పట్టణంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

**డీసీసీ అధ్యక్షురాలిని కలసి కృతజ్ఞతలు**

నూతనంగా పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన నూకల రంగారావు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవీ ప్రసన్నను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తోట దేవీ ప్రసన్న రంగారావును అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తనపై నమ్మకం ఉంచి మరోసారి పాల్వంచ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవీ ప్రసన్నకు నూకల రంగారావు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, పాల్వంచ పట్టణంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అంకితభావంతో పనిచేస్తానని వెల్లడించారు.

**వాసవి క్లబ్ ఆధ్వర్యంలో**

## మహా అన్న ప్రసాద వితరణ



**జమ్మికుంట, (సింగిడి):** జమ్మికుంట బస్టాండ్ సమీపంలో శ్రీ వరసిద్ధి వినాయక మహిళా భక్త మండలి ఆధ్వర్యంలో ప్రతిష్టించిన గణపతి మండపం వద్ద మహా అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేకంగా నిర్వహించి అన్న ప్రసాద వితరణ చేయగా భారీగా భక్తులు పాల్గొన్నారు. శ్రీ వరసిద్ధి వినాయక మహిళా భక్త మండలి ప్రతినిధులు గర్రెపల్లి అరుణాదేవి, అయిత శ్రీ లత, గుండా కావ్య, వసుధ, గౌరిశెట్టి సుజాత, అపర్ణ, యాంసాని జ్యోతి రాణి, వసుధ, చందా గిరిజ, మద్ది వైష్ణవి, కె శ్రీదేవి, ప్రణీత, రాజేశ్వరి, మహాలక్ష్మి, చొక్కారపు జ్యోతి, వైష్ణవి, ఎలుగూరిఅరుణ, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**ఇద్దరిని ఢీకొట్టిన కారు, డ్రైవర్ కోసం పోలీసుల గాలింపు**

**కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి**



**కరీంనగర్, (సింగిడి):** కరీంనగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్‌హెచ్-1 ప్రధాన రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా, మరో మహిళ తీవ్రంగా గాయపడింది. పోలీసుల వివరాల ప్రకారం.. ముగ్ధంపూర్ గ్రామానికి చెందిన దాడి శారద (50), కూకట్ల కనకమ్మ రోడ్డు పక్కన నిల్చొని ఉండగా గోదావరిఖని వైపు నుంచి వచ్చిన బ్రీజా కారు వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా, చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ, దాడి శారద మృతి చెందింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలంలోనే కేసు నమోదు చేసి, మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, ప్రమాదానికి గల కారణాలు, వాహన వివరాలు, బాధ్యులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ఏ. నిరంజన్‌రెడ్డి తెలిపారు.

**వర్ష ప్రభావిత ప్రాంతాల్లో**

## మేయర్ విస్తృత పర్యటన

**నీటి నిల్వల తొలగింపునకు తక్షణ చర్యలు, శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు**

**కరీంనగర్, (సింగిడి):** నగరంలో ఆదివారం రోజున కురిసిన వర్షాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో నగర



మేయర్ కొలగాని శ్రీనివాస్, నగర డిప్యూటీ మేయర్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు సంయుక్తంగా పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. 52, 53, 59, 60, 64వ డివిజన్లతో పాటు, సాయినగర్, కాశ్మీర్‌గడ్డ, ముకరంపుర, జ్యోతినగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించిన వారు నీటి నిల్వలను పరిశీలించారు. నిలిచిన వర్షపు నీటిని త్వరగా తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తరచూ నీరు నిలిచే ప్రాంతాల్లో శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నామని, వచ్చే వర్షాకాలం నాటికి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విపత్తు ప్రతిస్పందన బృందాలు, నగరపాలక సంస్థ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, సిబ్బంది సమన్వయంతో నీటి నిల్వలను తొలగించే చర్యలు చేపట్టారు. పర్యటనలో కార్పొరేటర్లు బోయినపల్లి ప్రవీణ్‌రావు, కొంపెల్లి శ్వేత-రామన్, మాజిద్ హుస్సేన్, ఇబ్రహీం, పడాల శ్రీజ-అజయ్, బీజేపీ నాయకులు కటకం లోకేష్ కుమార్, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

**ఐహెచ్‌ఆర్ ఆర్టీఐ కౌన్సిల్**

## జిల్లా అధ్యక్షుడిగా రాజేష్



**జమ్మికుంట: (సింగిడి):** ఇండియన్ హ్యూమన్ రైట్స్ ఆర్టీఐ కౌన్సిల్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా మారపల్లి రాజేష్ నియమితులయ్యారు. మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, ఆర్టీఐపై ప్రజల్లో అవగాహన కల్పించడం తన ప్రధాన లక్ష్యమని రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ చైర్మన్ అఖిలేష్ రెడ్డి, తెలంగాణ అధ్యక్షులు బతుల శంకర్, రాష్ట్ర ఇంచార్జ్ కొంగంటి రాజ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అంకిత భావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. రాజేష్ నియామకంపై సంస్థ ప్రతినిధులు అభినందనలు తెలిపారు. ఆయన నాయకత్వంలో కరీంనగర్ జిల్లాలో మానవ హక్కులు, ఆర్టీఐ అవగాహన, సామాజిక న్యాయం కోసం మరింత విస్తృతంగా పనిచేస్తామని తెలిపారు.

# బండ్లగూడ జాగీర్‌లో గణనాథులను దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**రాజేంద్రనగర్, (సింగిడి):** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ బండ్లగూడ జాగీర్ డివిజన్ పరిధిలోని పలు గణేష్ మండపాలను ఆదివారం సందర్శించారు. డివిజన్ పరిధిలోని గిరిధర్ అపార్ట్‌మెంట్, ఒయాసిస్ అపార్ట్‌మెంట్, మహాలక్ష్మి అపార్ట్‌మెంట్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను ఆయన స్వయంగా వెళ్లి సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆ విఘ్నేశ్వరుని ఆశీస్సులు అందరికీ మెండుగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులను, స్థానిక



యువకులను ఆయన అభినందించారు.
ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, , ఉత్సవ సమితి నిర్వాహకులు, కాలనీవాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శాంతి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు ప్రశాంతం

**భారీ మెజారిటీతో సాయి రెడ్డి ప్యానెల్ ఘన విజయం**

**రాజేంద్రనగర్, (సింగిడి):** రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ పరిధిలోని హైదర్ షాకోట్ శాంతి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు అత్యంత ఉత్కంఠభరితంగా ఆదివారం, ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. కాలనీవాసులందరూ ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో 'సాయి రెడ్డి ప్యానెల్' అద్భుత విజయాన్ని సాధించి కార్యవర్గాన్ని కైవసం చేసుకుంది. మొత్తం పోలైన ఓట్లలో సాయి రెడ్డి ప్యానెల్ 90 ఓట్లను సాధించగా, సమీప ప్రత్యర్థి 'కృష్ణ ప్యానెల్' పై 18 ఓట్ల స్పష్టమైన మెజారిటీతో గెలుపొందింది. ప్రారంభం నుంచే తీవ్ర పోటీ నెలకొన్నప్పటికీ, చివరికి కాలనీవాసులు సాయి రెడ్డి ప్యానెల్‌కే మద్దతు తెలిపారు. నూతనఅధ్యక్షుడు సాయి రెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, సాధారణ కార్యదర్శి మల్లేష్, కోశాధికారి రాజ్ రెడ్డి, నియమితులయ్యారు. అధ్యక్షుడిగా ఎన్నికైన సాయి రెడ్డి మాట్లాడుతూ... తమ ప్యానెల్‌పై నమ్మకంతో గెలిపించిన శాంతి నగర్ కాలనీ ప్రజలకు,



పెద్దలకు, మహిళలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తమకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తామని, కాలనీలో నెలకొన్న తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్య సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాలనీ సంక్షేమమే ధ్యేయంగా, అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని కార్యవర్గ సభ్యులు చంద్రశేఖర్, మల్లేష్,రాజ్ రెడ్డి వెల్లడించారు.

# రైచందానీ మాల్‌లో వినాయకుని దగ్గర కనుల పండువగా కూచిపూడి నృత్యం!

**అల్వాల్, (సింగిడి):** కొంపల్లి రైచందాని మాల్ లో వినాయక చవితి సందర్భముగా ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమ ముందు నవరాత్రులలో భాగంగా ప్రతి రోజు సాయంత్రం 6 గం ల నుండి రాత్రి 10 గం ల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారుల కు ఆటలు, పాటల కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం నిర్వహించిన కూచిపూడి నృత్యం కార్యక్రమం అక్కడ షాపింగ్ కు వచ్చిన కష్టమర్లను, భక్తలను విశేషంగా ఆకట్టుకుంది. చూట్టూ కమర్షియల్ షాప్స్ మధ్యలో వినాయ కుడు. ఆపై కూచిపూడి నృత్యం, పెద్దలు పిల్లలు తేడా లేకుండా అందరి చప్పట్లతో. షాపింగ్ మాల్ ప్రాంగణ



మంతామార్మోగిపోయింది. ప్రేక్షకుల కు కనుల పండగ చేసింది. ఆతరువాత జరిగిన దాండియా కార్య క్రమంలో మహిళలు చేసిన దాండియా విన్యాసాలు చూపరులను. ఆకట్టుకున్నాయి. వినాయకునికి 108 రకాల ప్రసాదాలతో నిర్వాహకులు తమ ప్రత్యేకతను చాటుకున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న చిన్నారులకు బహుమతులు అందజేసి వారిని ప్రోత్సహించడం జరిగింది. ఈకార్యక్రమములో రైచందాని యాజమాన్యాయంసిబ్బంది పాల్గొన్నారు. రైచందాని మాల్ యాజమాన్యం వినాయకుని దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసింది.

# విఘ్నేశ్వరుడి చెంత కాంగ్రెస్ నేతల భక్తి సందడి..!!

**రామగుండం పట్టణంలోని గణనాథుల మండపాల్లో ప్రత్యేక పూజలు**
**ప్రజల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాల కోసం ప్రార్థనలు.. అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్న నాయకులు**





**గోదావరిఖని, (సింగిడి):** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రామగుండం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథుల మండపాలు భక్తిశ్రద్ధలతో కళకళలాడుతున్నా యి. ఈ సందర్భంగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఠాకూర్ అయోధ్య సింగ్, రామగుండం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఈదునూరి హరిప్రసాద్ తదితరులు పలు గణేష్ మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విఘ్నేశ్వరుడిని దర్శించుకుని రామగుండం పట్టణ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, ప్రశాంతంగా జీవించేలా ఆశీస్సులు అందించాలని నాయకులు మనస్పూర్తిగా ప్రార్థించారు. అనంతరం ఆయా మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

**భక్తి.. సేవకు ప్రతీకగా అన్నదానం**

వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భక్తులకు అన్నదానం నిర్వహించడం అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు. గణనాథుడి ఆశీస్సులతో ప్రజలకు సుఖశాంతులు, ఆరోగ్యం, సమృద్ధి చేకూరాలని ఆకాంక్షించారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో నిర్వహించాలని గణేష్ భక్త మండలి సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఠాకూర్ బల్వాన్ సింగ్, మోసం పృధ్విరాజ్, సాదు రమేష్ పటేల్తో పాటు ఆయా గణేష్ భక్త మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# ఎర్ర జెండాకు మరణం లేదు..

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని**
**కమ్యూనిజం అజేయం. గోరేటి వెంకన్న ఎమ్మెల్సీ ప్రజావాగ్గేయకారులు**
**ఉత్తమ విలువల జీవితం కమ్యూనిస్టులకే సాధ్యం: ప్రొఫెసర్ కాశీం ఓయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్**
**సంస్మరణ సభ కామ్రేడ్ జ్యోతికి ఘనంగా నివాళులు**





**అమరచింత, (సింగిడి):** కమ్యూనిజంపై అవాకులు చవాకులు పేలే బూర్జువా పెట్టుబడి సిద్ధాంత రాజకీయ రంపులో మునిగి తేలుతున్న వారికి ఎర్రజెండా గొప్పతనం గురించి ఏం తెలుసని బాధలు లేని సమాజ నిర్మాణమే ఎర్రజెండా లక్ష్యమని, కమ్యూనిజానికి మరణమే లేదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కోనంనేని సాంబశివరావు అన్నారు. ఇటీవల ఆకస్మిక మరణం పొందిన సిపిఐ జిల్లా కార్యదర్శి కె విజయరాములు గారి సతీమణి పంచాయతీ కార్యదర్శి కామ్రేడ్ జ్యోతి సంస్మరణ సభ ఆదివారం అమరచింత మండల కేంద్రంలోని గొల్ల గేరిలో అబ్రహం అధ్యక్షతన జరిగింది. ముందుగా కామ్రేడ్ జ్యోతి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జ్యోతి సంస్కరణ యాదిలో రూపొందించిన గాయని శ్యామల రచన గానంతో ప్రత్యేకంగా రూపొందించిన ఆడియో వీడియో ఆల్బమ్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ:– ప్రజా సమస్యలపై పలు పెరుగని పోరాటాలు నిర్వహిస్తున్న విజయ రాములు జీవిత సహచరి జ్యోతి మరణం అత్యంత బాధాకరమని అన్నారు. జ్యోతి లేని లోటు తీర్చలేనిదని అన్నారు. కమ్యూనిస్టులు త్యాగాలకు చిరస్మరణీయులని అన్నారు. దోపిడి రహిత సమాజ నిర్మాణం కోసం రాజు లేని పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అప్పుడే అమరులకు ఘనమైన నివాళులర్పించినట్లు అవుతుందని అన్నారు. ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న మాట్లాడుతూ కమ్యూనిజం అజయమైనదని కమ్యూనిస్టుగా జీవించాలంటే ధైర్యం కావాలని కమ్యూనిస్టు శ్రేణులు విప్లవ సైనికులుగా దోపిడి వర్గాలపై కవాతు నిర్వహించాలని అన్నారు గోరేటి వెంకన్న ఆటపాటలతో సభా ప్రాంగణం మారుమోగింది. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఖాసిం మాట్లాడుతూ:– ఉత్తమ విలువల జీవితం కమ్యూనిస్టులకే సాధ్యమవుతుందని అన్నారు. నేటి సమాజంలో రాజకీయాలే కాకుండా సకల వస్తువులు కల్తీమయంగా మారాయని మారుతున్న సమాజంలో మానవుని ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. విజయ రాములు విలువలకు భౌతిక వాద సిద్ధాంతానికి నిటారుగా నిలబడి మత చాందసవాద సంస్కృతికి వ్యతిరేకంగా జీవించడం అంత మామూలు విషయం కాదని అన్నారు. విజయ రాములు జ్యోతి జీవితమంతా ఆదర్శంగా విలువలకు కట్టుబడి ప్రజల మంచి కోసం అనేక నిర్బంధాలు జైలు జీవితాలు ఎదుర్కొన్నాడని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. బాల నరసింహ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బోస్,ఏఐ జాతీయ ఉపాధ్యక్షులు ఎండి యూసుఫ్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం నరసింహ, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు వార్ల వెంకటయ్య, సిపిఐ నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్. ఎం. డి ఫయాజ్, మహబూబ్నగర్ జిల్లా కార్యదర్శి బాలకిషన్, పరమేష్ గౌడ్, గద్వాల జిల్లా కార్యదర్శి బి ఆంజనేయులు, నారాయణపేట జిల్లా కార్యదర్శి నరసింహ, పాలమూరు అధ్యయన వేదిక నేత రాఘవాచారి, సిపిఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, టిఎఫ్టియు రాష్ట్ర కార్యదర్శి ఖలీల్, జనజ్వాల, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిషన్ సభ్యులు గంధం నాగరాజ్, అమరచింత కౌన్సిలర్ తిరుమలేష్, సిపిఐ నాయకులు శ్రీహరి సీ. నరసింహ శెట్టి, మోష భరత్ భాస్కర్ రవీందర్ శ్యాంసుందర్, జిల్లా కార్యదర్శి ఎం. డి కుతూబ్ ఏఐటీయూసీ రాష్ట్ర నేత సురేష్ కళాకారులు ఎర్రన్న వెంకటేష్ సత్యనారాయణ విజయ్ సుజ్ఞానం తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ.. ఈర్ష్య.. పక్కా ప్లాన్..!

**యువతి మృతి కేసులో ఇద్దరు నిందితుల అరెస్ట్..**
**సాంకేతిక ఆధారాలతో గోదావరిఖని పోలీసులు ఛేదన**
**పురుగుల మందు బలవంతంగా తాగించి హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడి**
**కారులో తిప్పుతూ వైద్య సహాయానికి ఆలస్యం..**
**ఆధారాలు చెరిపేందుకు నిందితుడి ప్రయత్నం**
**ఎకోస్పోర్ట్ కారు, రెండు సెల్‌ఫోన్లు, ట్యాబ్ స్వాధీనం**




**గోదావరిఖని, (సింగిడి):** గోదావరి ఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల సంచల నం రేపిన యువతి అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. కేసు దర్యాప్తులో లభించిన సీసీ కెమెరా ఫుటేజీలు, కాల్‌డేటా, కాల్ రికార్డులు, ఇతర సాంకేతిక ఆధారాలను విశ్లేషించిన పోలీసులు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. యువతిని హత్య చేసేందుకు ముందస్తు ప్రణాళికతో వ్యవహరించినట్లు ప్రధాన నిందితుడిపై పోలీసులు ఆరోపణలు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ప్రధాన నిందితుడు జిల్లెల్ల నవీన్‌కుమార్ (38) ను గోదావరిఖని బ్రిడ్జి, గంగానగర్ ప్రాంతంలో, మరో నిందితుడు బొమ్మకంటి రవికుమార్ (35)లను ఓసీపీ–05 గని వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ చర్యలు ఏసీపీ మడత రమేష్ ఆధ్వర్యంలో చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

**పరిచయం.. సన్నిహిత సంబంధం.. ఆపై విభేదాలు**

పోలీసుల దర్యాప్తు ప్రకారం.. నవీన్‌కుమార్‌కు ఇప్పటికే వివాహమై భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. 2022లో సింగరేణి కాలరీస్ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న యువతితో అతనికి పరిచయం ఏర్పడినట్లు పోలీసులు తెలిపారు. ఆ పరిచయం క్రమంగా సన్నిహిత సంబంధంగా మారిందని, సంబంధాన్ని వివాహం వరకు తీసుకెళ్లాలని నవీన్‌కుమార్ భావించినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు పేర్కొన్నారు. తరువాత యువతి బీటెక్ మైనింగ్ చదువుతూ శిక్షణ కోసం గోదావరిఖనికి వచ్చిన సమయంలో రవికుమార్‌తో పరిచయం ఏర్పడిందని పోలీసులు తెలిపారు. యువతి తనకు దూరంగా ఉంటూ రవికుమార్‌తో సన్నిహితంగా మెలగడాన్ని నవీన్‌కుమార్ జీర్ణించుకోలేకపోయినట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు వెల్లడించారు.

**ముందస్తు ప్రణాళికతో పురుగుల మందు**

సెప్టెంబర్ 12న యువతిని హత్య చేయాలని ముందుగానే నిర్ణయించుకున్న నవీన్‌కుమార్ పురుగుల మందును నీటిసీసాలో నింపుకుని తన కారులో ఉంచుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆ రోజు సాయంత్రం విధులు ముగించుకుని ఆటోలో వెళ్తున్న యువతిని ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్స్ వద్ద కారులో ఎక్కించుకున్నాడని, అనంతరం ఎన్టీపీసీ, ఎఫ్‌సీఎల్, ఐటీసీ ప్రాంతాల్లో కారులో తిప్పుతూ ఆమెతో వాగ్వాదానికి దిగినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు.

**సూసైడ్ నోట్ పేరుతో మరో ఎత్తుగడ**

రవికుమార్‌పై అత్యాచారం కారణంగానే తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు పేర్కొంటూ యువతితో సూసైడ్ నోట్ రాయించినట్లు పోలీసులు తెలిపారు. ఆ నోట్‌ను ఆమె మొబైల్ ఫోన్‌తో ఫొటో తీయించిన అనంతరం, ముందుగా సిద్ధం చేసుకున్న పురుగుల మందును ఆమెకు బలవంతంగా తాగించినట్లు దర్యాప్తులో వెల్లడైందని పేర్కొన్నారు. పురుగుల మందు ప్రభావంతో యువతి కారులోనే స్పృహ కోల్పోయినప్పటికీ వెంటనే ఆసుపత్రికి తరలించకుండా నిందితుడు ఆలస్యం చేసినట్లు పోలీసులు తెలిపారు. తన నేరం బయటపడుతుందనే భయంతో ఆమెను కొంతసేపు కారులో వివిధ ప్రాంతాల్లో తిప్పినట్లు దర్యాప్తులో గుర్తించినట్లు వెల్లడించారు.

**తండ్రిని నమ్మించే ప్రయత్నం**

యువతి స్పృహ కోల్పోయిన అనంతరం ఆమె మొబైల్ ఫోన్ నుంచి తండ్రికి ఫోన్ చేసి ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు నమ్మించే ప్రయత్నం చేసినట్లు పోలీసులు తెలిపారు. రాత్రి సుమారు 7.30 నుంచి 7.45 గంటల మధ్య యువతిని ఇంటికి తీసుకెళ్లి, అనంతరం ఆమె తల్లిదండ్రులను కూడా కారులో ఎక్కించుకుని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు దర్యాప్తులో వెల్లడై నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఆసుపత్రికి చేరుకున్న అనంతరం నవీన్‌కుమార్ అక్కడి నుంచి వెళ్లిపో యినట్లు తెలిపారు. చికిత్స పొందుతూ యువతి మరుసటి రోజు మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు.

**ఆధారాలు చెరిపేందుకు ప్రయత్నం**

యువతి మృతితో తన నేరం బయటపడుతుందనే భయంతో నిందితుడు కీలక ఆధారాలను తొలగించేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. నేరానికి ఉపయోగించిన కారును కడగడం, సూసైడ్ నోట్, పురుగుల మందు సీసా, మొబైల్ సిమ్ కార్డులను తొలగించడం వంటి చర్యలకు పాల్పడినట్లు దర్యాప్తులో గుర్తించినట్లు పేర్కొన్నారు. అనంతరం హైదరాబాద్‌కు వెళ్లిన నిందితుడి కదలికలను సాంకేతిక ఆధారాల ద్వారా పోలీసులు గుర్తించినట్లు తెలిపారు.

**టెక్నాలజీ ఆధారంగా చిక్కిన నిందితులు**

కేసు దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరా ఫుటేజీలు, కాల్ డేటా, కాల్ రికార్డులు, ఇతర సాంకేతిక ఆధారాలను పోలీసులు విస్తృతంగా పరిశీలించారు. ఈ ఆధారాల ద్వారా నిందితుల కదలికలను ట్రాక్ చేసి వారిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

**స్వాధీనం చేసుకున్న వస్తువులు**

నేరానికి ఉపయోగించినట్లు భావిస్తున్న ఎకోస్పోర్ట్ కారు
నిందితులకు చెందిన రెండు సెల్‌ఫోన్లు.. ఒక ట్యాబ్

**రవికుమార్‌పై ఆరోపణలపైనా దర్యాప్తు**

ఈ కేసులో రెండో నిందితుడిగా ఉన్న బొమ్మకంటి రవికుమార్‌పై కూడా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. యువతి గోదావరిఖనికి శిక్షణ కోసం వచ్చిన సమయంలో రవికుమార్‌తో పరిచయం ఏర్పడిందని, ఆమె ఇష్టానికి విరుద్ధంగా శారీరక సంబంధానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఈ ఆరోపణలకు సంబంధించి ఆధారాల ను సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా యువతి సింగరేణి అధికారులకు సమర్పించిన దరఖాస్తు, దానిపై అధికారులు తీసుకున్న చర్యలు, అధికారుల నిర్లక్ష్యానికి సంబంధించిన ఆరోపణలు తదితర అంశాలపైనా విచారణ కొనసాగుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

**దర్యాప్తు కొనసాగింపు**

ఈ కేసులో ఇప్పటివరకు సేకరించిన సాంకేతిక, ఇతర ఆధారాల ఆధారంగా దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. కేసులో మరిన్ని వివరాలు దర్యాప్తు పూర్తయిన తర్వాత వెల్లడయ్యే అవకాశం ఉంది.

# చిన్నారులు ఏర్పాటు చేసిన బాల గణేష్ విగ్రహం వద్ద వైరా ఏసిపి సారంగపాణి ప్రత్యేక పూజలు

**వైరా, (సింగిడి):** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాల వద్ద ఆదివారం వైరా ఏసీపీ సాదుల సారంగపాణి, పీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రిలయన్స్ ట్రెండ్స్ సమీపంలో చిన్నారులు ఏర్పాటు చేసిన బాల గణేష్ ఉత్సవ కమిటీ విగ్రహం వద్ద జరిగిన పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఏసీపీ సారంగపాణికి ఉత్సవ కమిటీ నిర్వాహకులు, చిన్నారులు అపూర్వ స్వాగతం పలికారు. అనంతరం ఏసీపీ సారంగపాణి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్, ఎస్సై పుష్పాల రామారావుతో కలిసి గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏసీపీ ప్రారంభించారు. లీలా సుందరయ్యనగర్‌లో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని ఏసీపీ సారంగపాణి



దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ సారంగపాణి మాట్లాడుతూ చిన్నారులు ప్రత్యేకంగా గణనాధుని విగ్రహం ఏర్పాటు చేసి పూజలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని, భావితరాలకు సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెప్పే విధంగా చిన్నారులు విగ్రహం ఏర్పాటు చేయడం ఎంతో గొప్ప విషయమని అన్నారు. గణనాధుని ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కులమతాలకు అతీతంగా ప్రజలు గణనాథుడిని భక్తిశ్రద్ధలతో పూజిస్తారని, ఉత్సవాలు అందరికీ ఆనందాన్ని కలిగించేలా నిర్వహించుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ పరస్పర సహకారంతో శాంతియుత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చెరుకూరి కిరణ్, ముదిగొండ మహేష్ ,కొక్కిరేణి లింగయ్య, బాల ఉత్సవ కమిటీ సభ్యులు పెరుమళ్ళ కోటేశ్వరరావు, దారా కృష్ణారావు, అశ్విత్ల నిఖిల్ ,కట్ల సంజు పార్థు , హర్ష, సాయి, పునీత్, లీలా సుందరయ్య నగర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పోలూరి రాము ,ఆవుల రవి, సుధాకర్ రెడ్డి, కొత్త రామయ్య కుమారుడు కొత్త వెంకటేశ్వరరావు, నర్సిరెడ్డి, బాబురావు ,సాంబశివరావు, శివ రమేష్ పాశం రవి పొన్నం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిగూడలో ఘోర రోడ్డు ప్రమాదం

**మట్టి దిబ్బను తప్పించబోయి టిప్పర్ కిందపడి యువతి, బాలుడు దుర్మరణం**

**జవహర్ నగర్, (సింగిడి):** జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లారెడ్డిగూడ లోని రాయల్ ఇరానీ కేఫ్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన బంధువులైన యువతి, బాలుడు అక్కడికక్కడే మృతి చెందా రు. గణేష్ పూజ సమయంలో అన్న దాన కార్యక్రమానికి వెళ్లి వస్తుం డగా ఈ విషాదం చోటుచేసుకుంది. ఎస్ హెచ్ ఓ సైదులు తెలిపిన వివరాల ప్రకారం... కాప్రా ప్రాంతానికి చెందిన ఆర్. టి. సి కానిస్టేబుల్ మార్తల సూర్య నారాయణ రెడ్డి ఇంట శనివారం రాత్రి కుటుంబ సభ్యులు గణేష్ పూజ నిర్వ హిస్తున్నారు. రాత్రి 9:00 గంటల సమయంలో కుటుంబ మిత్రుడైన గంధం వినయ్



కుమారుడు గంధం అమర్త్య (15) వచ్చి ఎల్లారెడ్డిగూడలోని తమ గణేష్ మంటపం వద్ద అన్నదానం జరుగుతోందని తెలిపాడు. దీంతో సూర్య నారాయణ రెడ్డి కుమార్తె మార్తల వెంకట దీప్తిక రెడ్డి (21), అమర్త్య ఇద్దరూ కలిసి ఆక్టివా స్కూటీ (టీ ఎస్ 08ఈ ఆర్ 9766) పై శాలివాహన ఎన్‌క్లేవ్ వైపు బయలుదేరారు. రాత్రి 9:30 గంటల ప్రాంతంలో రాయల్ ఇరానీ కేఫ్ వద్దకు చేరుకోగానే, రోడ్డుపై ఉన్న మట్టి దిబ్బను తప్పించే క్రమం లో స్కూటీ స్కిడ్ అయి కిందపడిపోయింది. అదే సమయంలో కాప్రా నుండి ఎల్లారెడ్డిగూడ వైపు మట్టితో వెళ్తున్న టిప్పర్ లారీ (టీజీ 12టీ 3335) వెనుక టైర్లు దీప్తిక పైనుంచి వెళ్లగా, అమర్త్యకు తలకు తీవ్ర గాయాలయ్యా యి. తీవ్ర రక్తస్రావం కావడంతో ఇద్దరూ సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. మృతురాలి తండ్రి సూర్య నారాయణ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్, బాలాజీనగర్‌కు చెందిన గుంజ నరసింహ (28)పై బి. ఎన్. ఎస్ (బీ ఎన్ ఎస్ ) సెక్షన్ 106 (1) కింద క్రైమ్ నంబర్ 1330/2026గా ఎఫ్. ఐ. ఆర్ నమోదు చేసినట్లు తనిఖీ అధికారి (ఎస్ . ఐ . ) ఆర్. రామకృష్ణ తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు వేగవంతం చేశారు.

# కుమ్మన్ పల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం



**బోధన్ ప్రతినిధి, (సింగిడి):** సాలూరా మండలం కుమ్మన్ పల్లి గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ అయ్యప్ప సేవ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిం చారు. 105 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణి చేశారు. మందికి కంటి ఆపరేషన్ల కోసం సిఫారసు చేయడమైనది. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్మన్ లయన్ గైని పద్మ, కో చెర్మన్ లయన్ కే. సవిత, క్లబ్ అధ్యక్షులు లయన్ కుమ్మరి పోశెట్టి, సెక్రటరీ లయన్ గుడిపల్లి గంగారెడ్డి, లయన్ ఆదినారాయణ రెడ్డి, డాక్టర్ అజయ్, క్యాంపు ఇంచార్జ్ హనుమంత్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాలు.. విద్యుత్ వైర్లు..

**భయాందోళనలో మోర్తాడ్ కాలనీవాసులు!**

**ఆర్మూర్, (సింగిడి):** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండల కేంద్రంలోని దోన్‌పాల్ రోడ్ వెళ్లే ప్రాంతంలోని మసీద్ ప్రక్కన కాలనీలో ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలతో స్థానికులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. కాలనీలోని వీధుల్లో విద్యుత్ స్తంభాలు ఒకవైపుకు ప్రమా దకరంగా ఒరిగిపోయి, ఎప్పుడు కూలిపోతాయో తెలి య ని దుస్థితిలో నెలకొన్నాయి. కొన్ని స్తంభాలు ఇళ్లపైకి, రద్దీగా ఉండే రోడ్లపైకి వంగిపోయి విద్యుత్ స్తంభాలు పడిపోవడానికి సిద్ధంగా ఉన్నాయని స్థానికులు పేర్కొన్నారు. అంతేకాకుండా, వాటికి ఉన్న ప్రధాన విద్యుత్ తీగలు సైతం కిందకు వేలాడుతూ ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి.

**అధికారుల నిర్లక్ష్యంపై కాలనీవాసుల ఆగ్రహం**

ఈ సమస్యపై స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో చిన్న పిల్లలు ఎక్కువగా తిరుగుతుంటారని, ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ఈదురు గాలులు, వర్షాలకు స్తంభాలు కూలిపోతే పెను ప్రమాదం జరిగే అవకాశముందని వాపోతున్నారు. ప్రమాదం జరిగితే బాధ్యులెవరని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు గ్రామ విద్యుత్ శాఖ ఏఈ (రాజు)కి స్వయంగా వినతిపత్రాలు అందించామని స్థానికులు తెలిపారు. అధికారులు వచ్చి చూసి ఫొటోలు తీసుకువెళ్లారే తప్ప, ఇప్పటివరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టడం లేదని కాలనీవాసులు ఆరోపించారు.

**తక్షణమే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి:**

ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నామని, ఉన్నతాధికారులు తక్షణమే



స్పందించి వంగిపోయిన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి, వేలాడుతున్న విద్యుత్ వైర్లను సరిచేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

# దర్భ గణపతి సన్నిధిలో పెద్దపల్లి ఎస్ఐ నరేష్

**కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు.. స్వామివారి ఆశీస్సులు పొందిన ఎస్ఐ కౌన్సిలర్ కొలిపాక సంపత్‌తో కలిసి గణనాథుడిని దర్శించుకున్న నరేష్**



**పెద్దపల్లి,(సింగిడి):** వినా యక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొన సాగుతున్న వేళ పెద్దపల్లి పట్టణంలోని తెనుగువాడ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దర్భ గణపతి మండపం భక్తులతో సందడిగా మారింది. ఈ సందర్భం గా పెద్దపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నరేష్ కుటుంబ సమేతంగా దర్భ గణపతిని దర్శిం చుకు న్నారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ కొలిపాక సంపత్తో కలిసి ఎస్ఐ నరేష్ గణనా థుడికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. వేదమంత్రోచ్చారణల మధ్య పూజా కార్యక్ర మాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందా రు. ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురా రోగ్యాలు కలగాలని, పెద్దపల్లి ప్రాంతం మరిం త అభివృద్ధి చెందాలని గణప తిని ప్రార్థించి నట్లు తెలిపారు. దర్భ గణపతి మండపానికి ఎస్ఐ నరేష్ కుటుంబ సమేతం గా రావడంతో తెనుగువాడ ముదిరాజ్ సంఘం ప్రతినిధులు, నిర్వాహకులు ఆయనకు సాదర స్వాగతం పలి కారు. పుష్పగు చ్ఛాలతో ఆహ్వానించి, శాలువా తో సత్కరించా రు. వినాయక చవితి సందర్భం గా నిర్వహిస్తు న్న ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మిక తతో పాటు సామాజిక ఐక్యతకు ప్రతీకగా నిలుస్తు న్నాయని నిర్వాహకులు పేర్కొన్నారు. ఉత్సవా ల్లో భాగంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలు నిర్వహిస్తు న్నామని తెలిపారు. తెనుగువాడ ముదిరాజ్ సంఘం ప్రతినిధులు, గణేష్ ఉత్సవ నిర్వాహకులు, భక్తులు లు పాల్గొన్నారు.

# ప్రమాద మృతుడి కుటుంబానికి రూ.10.86 లక్షల బీమా భరోసా

**శ్రీరామ్ జీవిత బీమా రూ.6.84 లక్షల చెక్కు అంద జేత 134 నెలల పాటు నెలకు రూ.3 వేల పింఛన్...**



**సుల్తానాబాద్, (సింగిడి):** ప్రమాదవశాత్తు మృతి చెందిన ఓ కుటుంబానికి భీ మా సంస్థ ఆర్థిక భరోసా కల్పించింది. పెద్దపల్లి జి ల్లా ఓదెల మండలం నాంసంపల్లె గ్రామానికి చెంది న పెనుకుల కొమురయ్య 2022లో శ్రీరామ్ జీవిత బీమా సంస్థలో రూ.21,803విలువైన బీమాపాలసీ తీసుకున్నారు. ఇటీవల ఆయన ప్రమాదవశాత్తు మృతి చెందడంతో బీమా నిబంధనల ప్రకారం కు టుంబానికి ప్రయోజనం అందజేశారు. ప్రమాద బీ మా పరిహారంలోభాగంగా కొమురయ్య భార్య, నా మినీ భాగ్యకు రూ. 6,84,000 విలువైన బీమా చె క్కును సంస్థ కార్యనిర్వాహక సంచాలకుడు శ్రీని వాస్ రెడ్డి చేతులమీదుగా అందజేశారు. దీంతో పా టు 134 నెలల పాటు నెలకు రూ. 3,000 చొప్పున మొత్తం రూ. 4,02,000 పింఛన్ రూపంలో అందిం చనున్నట్లు తెలిపారు. మొత్తంగా కుటుంబానికి రూ. 10,86,000 బీమా ప్రయోజనం లభించనుం ది. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కు టుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడంలో శ్రీరామ్ జీవిత బీమా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. భవిష్యత్ ఆర్థిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ బీమా రక్షణ పొందాలని సూచించారు. ఈకార్యక్రమంలో సహాయ ప్రధాన నిర్వాహకుడు రాకేష్, జిల్లా నిర్వాహ కుడు శివకుమార్, అధి కారులు గుండేటి మధు, కర్రే కుమారస్వామి, ఓజ్జె శ్రీనివాస్, సుమలత, షబ్బీర్‌తో పాటు విక్రయ అధి కారులు రవీందర్ రెడ్డి, అనగంటి శ్రీనివాస్, అరవింద్, వెంకటస్వామి, చిన్నస్వామి, పూర్ణచందర్, నర్సయ్య, రాజు, మూడోతుల శ్రీనివాస్, మూడోతుల సదయ్య, సూర్యనారాయణ, మల్లేశం, కార్యనిర్వా హకులు మ హేందర్, ప్రశాంత్, సాయి, హరీష్, మా రుతి, శేఖర్, శ్రీకాంత్ లు పాల్గొన్నారు.

# కుంకుమ పూజలతో కొలువుదీరిన గణనాథుడు

**పాల్గొన్న సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్ భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన గణేష్ యూత్ కమిటీ**



**సుల్తానాబాద్, (సింగిడి):** పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం ర్యాకల్‌దేవ్‌పల్లి గ్రామంలో గణేష్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసా గుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గణేష్ యూ త్ కమిటీ ఆధ్వర్యంలో వినాయకుడికి ప్రత్యేక కుం కుమ పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సం ఖ్యలో పాల్గొనిస్వామివారినిదర్శించుకునిమొక్కులు చెల్లించుకు న్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మద్దెల రమాదేవి సంపత్ దంపతులు గణనాథుడి ని దర్శించుకుని ప్రత్యేక పూ జలు చేశారు. గ్రామ ప్రజ లు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. గణేష్ యూత్ కమిటీ సభ్యులు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలను ని ర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శి వకృష్ణ గౌడ్, గణేష్ యూత్ కమిటీ చైర్మన్ తిరుప తిరెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యల పరిష్కారానికి 'లోకల్ కోర్టు'..!

**అంతర్గాం 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో ప్రత్యేక వినియోగదారుల పరిష్కార వేదిక బిల్లుల సవరణ నుంచి వోల్టేజ్ హెచ్చుతగ్గులు, ట్రాన్స్‌ఫార్మర్ సమస్యల వరకు పరిష్కారం**

**రామగుండం,(సింగిడి):** విద్యుత్ వినియోగదారుల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. రామగుండం సబ్ డివిజన్ పరిధిలోని వినియోగదారుల కోసం వినియోగదారుల విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక (CGRF) ఆధ్వర్యంలో 'లోకల్ కోర్టు' నిర్వహించనున్నారు. ఈ నెల 22వ తేదీ మంగళవారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు రామగుండంలోని 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో ఈ కార్యక్రమం జరుగుతుంది. C-GRF వరంగల్ గౌరవ చైర్‌పర్సన్ శ్రీ కె. మాధవరావు ఈ కార్యక్రమానికి హాజరై వినియోగదారుల నుంచి సమస్యలను స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నారు.

**పలు విద్యుత్ సమస్యలకు పరిష్కారం**

విద్యుత్ బిల్లుల్లో తప్పులు, బిల్లుల సవరణ, వోల్టేజ్ హెచ్చుతగ్గులు, ట్రాన్స్‌ఫార్మర్ లోపాలు తదితర విద్యుత్ సంబంధిత సమస్యలను ఈ వేదిక ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. వినియోగదారులు తమ సమస్యలను సంబంధిత పత్రాలతో అధికారుల దృష్టికి తీసుకురావచ్చని సూచించారు.

**నాలుగు సెక్షన్ల వినియోగదారులకు అవకాశం**

రామగుండం సబ్ డివిజన్ పరిధిలోని రామగుండం, అంతర్గాం, పాలకుర్తి, మేడిపల్లి (NTPC) సెక్షన్లకు చెందిన విద్యుత్ వినియోగ దారులు ఈ ప్రత్యేక వేదికను సద్వినియోగం చేసుకోవాలని CGRF వరంగల్ చైర్‌పర్సన్ కె. మాధవరావు కోరారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగకుండా, ఈ ప్రత్యేక వేదికకు హాజరై తమ సమస్యలను నేరుగా తెలియజేయాలని ఆయన సూచించారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు, విద్యుత్ సంబంధిత సమస్యలకు సత్వర పరిష్కారం చూపించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

# ఫిట్ మంచిర్యాల.. ఉరుకులు పెట్టిన యువత

**5కే/10కే రన్‌కు భారీ స్పందన**



**మంచిర్యాల, (సింగిడి):** ఉదయపు చల్లని వాతావరణం.. ఉత్సాహంతో పరుగులు తీస్తున్న యువత.. వారితో కలిసి అడుగులు కలిపిన మహిళలు, వాకర్స్, రన్నర్స్, వైద్యులు, ఉద్యోగులు.. ఇలా అన్ని వర్గాల ప్రజ లతో మంచిర్యాల పట్టణంలో ఆదివారం సం దడి నెలకొంది. 'ఫిట్ మంచిర్యాల' నినాదంతో సేవాభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన 5కే/10కే రన్‌కు విశేష స్పందన లభించింది. 1,200 మందికిపైగా పాల్గొని ఆరోగ్యంపై తమకున్న ఆసక్తిని చాటారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ రన్ ఐబీ చౌరస్తా నుంచి ప్రారంభమై ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. యువతతో పాటు మహిళలు, వాకర్స్, రన్నర్స్, డాక్టర్లు, ఉద్యోగులు, వివిధ వర్గాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పరుగుతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశంగా నిర్వాహకులు తెలిపారు.

**జెండా ఊపి ప్రారంభించిన రఘునాథ్..**

సేవాభారతి రాష్ట్ర సభ్యులు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి 5కే/10కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రన్‌కు 1,200 మందికిపైగా ప్రజలు హాజరు కావడం అభినందనీయమన్నారు. ఆరోగ్యంగా ఉండటా నికి నిత్య జీవితంలో వ్యాయామాన్ని ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు. 'ఫిట్ మంచిర్యాల'లో ప్రతి ఒక్కరూ భాగస్వా ములు కావాలని, వయసుతో సంబంధం లేకుండా నిత్యం కొంత సమయం శారీరక దృఢత్వం కోసం కేటాయించాలని పిలుపుని చ్చారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ఇటువం టి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొ న్నారు. ప్రస్తుత జీవనశైలిలో శారీరక శ్రమ తగ్గిపోతున్న నేపథ్యంలో రన్ వంటి కార్యక్రమాలు యువతలో ఫిట్‌నెస్‌పై అవగా హన పెంచేందుకు వేదికగా నిలుస్తున్నాయి. చదువు, ఉద్యోగం, వ్యాపార ఒత్తిళ్ల మధ్య ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా రోజువారీ జీవితంలో నడక, పరుగు, వ్యాయామానికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని ఈ కార్యక్రమం చాటిచెప్పింది. ఒకవైపు పోటీ భావనతో పరుగు సాగుతుండగా.. మరోవైపు ఆరోగ్యమే లక్ష్యంగా పెద్దలు, మహిళలు, యువత కలిసి అడుగులు వేయడం ప్రత్యేక ఆక ర్షణగా నిలిచింది. పట్టణ ప్రజల్లో ఫిట్‌నెస్‌పై ఆసక్తి పెరుగుతున్నదానికి ఈ కార్యక్రమానికి వచ్చిన స్పందన నిదర్శనంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏకలవ్య ఆశ్రమం అధ్యక్షులు ఓడ్నాల లక్ష్మీనారాయణ, బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నాగునూరి వెంకటేశ్వర్ గౌడ్, గాజుల ముఖేష్ గౌడ్, కస్తూరి నాగరాజు, బోట్ల సత్యం, అమిరిశెట్టి రాజ్‌కుమార్, రంగ శ్రీశైలం, సత్రం రమేష్, కుర్రె చక్రవర్తి, బియ్యాల సతీష్‌రావు, డేగ బాపు, ఆకుల అశోక్ వర్ధన్, ఆడే ప్రేమ్‌సింగ్, పచ్చ స్వప్నరాణి, బింగి ప్రవీణ్ పాల్గొన్నారు.

# వినాయకుల చెంతకు విజయ రమణారావు

**భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు**



**సుల్తానాబాద్,(సింగిడి):** గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకు ని ఆదివారం సుల్తానాబాద్ పట్టణ కేంద్రంతో పా టు పరిసర ప్రాంతా ల్లో కొలువుదీరిన గణనాథుల ను ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింత కుంట విజయరమణారావు దర్శించుకున్నారు. ఆయా గణేష్ మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా గణేష్ మండపాల నిర్వాహకులు, భక్తులతో విజయరమణారావు ఆత్మీయంగా మా ట్లాడా రు. పట్టణంలో గణపతి నవరాత్రి ఉత్సవా లు భక్తిశ్రద్ధ లతో, ప్రశాంత వాతావరణంలో కొనసా గుతున్నాయని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ ప్రజాప్రతి నిధులు, నాయ కులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

# కనీస వసతులే కరువు

# శ్రీరాంపూర్ బస్టాండ్ దుస్థితి

**శ్రీరాంపూర్ బస్టాండ్ కు మహర్దశ ఎప్పుడో? ఆధునీకరణకు ఎమ్మెల్యే చొరవ చూపాలి**



**మంచిర్యాల,(సింగిడి):** ఉదయం పూట బస్టాండ్‌కు చేరుకున్న ప్రయాణికుల హడావుడి.. చేతిలో సంచు లు పట్టుకుని బస్సు కోసం ఎదురుచూ స్తున్నవృద్ధులు.. పాఠశాల, కళాశాలలకు వెళ్లేందుకు ఆత్రుతగా నిల్చున్న విద్యార్థు లు.. పనులకు బయలుదేరిన కార్మికు లు.. దూర ప్రాంతాలకు ప్రయాణించా ల్సిన మహిళలు.. ఇదీ శ్రీరాంపూర్ బస్టాండ లో నిత్యం కనిపించే దృశ్యం. ఇంత మంది ప్రయాణికులకు ఆశ్రయం గా ఉన్న బస్టాండ్ మాత్రం కనీస సౌకర్యా లు లేక సమస్యల నిలయంగా మారింది. బస్సు కోసం వేచి ఉండాలం టే ఎండలో నిలబడాలి.. వర్షం వస్తే తడవాల్సిందే. దాహం వేస్తే బయటకు వెళ్లి నీరు కొనుక్కో వాల్సిన పరిస్థితి. అత్యవసర సమయంలో మరుగుదొడ్డి వినియోగించాలన్నా ఇబ్బం దులే. దీంతో బస్టాండ్‌కు వచ్చే ప్రయాణి కుల కష్టాలు వర్ణనాతీతంగా మారుతు న్నాయి. శ్రీరాంపూర్ పరిసర ప్రాంతాల నుంచి ప్రతిరోజూ పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ బస్టాండ్ ద్వారా వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుం టారు. ఉద్యోగులు, విద్యార్థులు, కార్మి కులు, వ్యాపారులు, చిరు వ్యాపారులు, మహిళలు, వృద్ధులు ఇలా అన్ని వర్గాల ప్రజలు బస్సుల కోసం ఇక్కడికి వస్తుంటారు. ప్రయాణి కుల సంఖ్యకు అనుగుణంగా బస్టాండ్‌లో వసతులు మాత్రం కనిపించడం లేదు. బస్సు ఎప్పుడు వస్తుందో తెలియక గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చినప్పుడు ప్రయాణికుల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతోంది. కూర్చు నేందుకు సరైన సౌకర్యం లేకపోవ డంతో వృద్ధులు, అనారోగ్యంతో ఉన్న వారు తీవ్ర ఇబ్బందు లు పడుతున్నారు. చిన్నారులతో వచ్చే తల్లులు కూడా అవస్థలు ఎదుర్కొంటు న్నారు. ప్రయాణికులకు రక్షణ కల్పించా ల్సిన షెడ్లు సరిపడా లేకపోవడంతో ఎండ, వాన నుంచి రక్షణ పొందడం కష్టంగా మారింది. మండే ఎండలో బస్సు కోసం వేచి ఉండే ప్రయాణికులు నీడ కోసం ఇబ్బంది పడుతున్నారు. వర్షం పడితే పరిస్థితి మరింత దారుణంగా మారు తోం ది. తడవకుండా నిలబడేందుకు అందు బాటులో ఉన్న కొద్దిపాటి ప్రదేశం లోనే ప్రయాణికులు గుమి గూడాల్సి వస్తోంది. ప్రయాణి కుల సంఖ్య పెరుగుతున్నా బస్టాండ్ వసతులు మాత్రం ఏళ్లనాటి పరిస్థి తుల్లోనే ఉన్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్ ప్రాంగ ణంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చెత్తాచెదారం పేరుకుపోవ డం, ఎక్కడికక్కడ అపరిశుభ్ర వాతావ ణం కనిపించడం ఇబ్బందికరంగా మారుతోంది. చెత్త కారణంగా దుర్వాసన వస్తోందని ప్రయాణికులు చెబుతున్నారు. దోమలు, ఈగల బెడద కూడా ఉంటోం దని వాపోతున్నారు. వర్షం కురిసినప్పుడు ప్రాంగణంలోని కొన్ని ప్రాంతాల్లో నీరు నిలిచిపోవ డంతో పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోంది. ప్రయాణి కులు బస్సు ఎక్కేందుకు వెళ్లే సమయంలో బురద, నీటిని తప్పించుకుంటూ వెళ్లాల్సి వస్తోంది.

**దాహం వేస్తే.. బయటకే పరుగులు..**

బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులకు స్వచ్ఛ మైన తాగునీరు అందుబాటులో ఉండటం అత్యవసరం. అయితే ఇక్కడ తాగునీటి సౌకర్యం పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపో వడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు ఇబ్బందులు పడుతు న్నారు. ము ఖ్యంగా వేసవి కాలంలో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారు తోంది. వృద్ధులు, చిన్నారులు, మహిళ లు దాహం తీర్చుకోవడా నికి బయట దుకాణాలను ఆశ్రయించాల్సి వస్తోం దని ప్రయాణికులు చెబుతున్నారు. ప్రజా రవాణా కేంద్రంలోనే తాగునీటి కోసం ప్రయాణికులు ఇబ్బందులు పడ టం అధికారుల దృష్టికి రావాల్సిన అంశ మని పేర్కొంటు న్నారు. బస్టాండ్ లో మరు గుదొడ్లు ఉన్నప్పటికీ వాటి నిర్వహణపై ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నా రు. ఎప్పటికప్పుడు శు భ్రపరచకపోవడం, అపరిశుభ్రత నెలకొనడం వల్ల వాటిని వినియోగిం చేందుకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని చెబుతున్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులకు మరు గుదొడ్ల సమస్య మరింత ఇబ్బంది కరంగా మారుతోంది. ప్రయాణికులు ఎక్కువ సేపు బస్సుల కోసం వేచి ఉండే ప్రదేశంలో మరుగుదొడ్ల నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ అవసరమని పలువురు కోరుతున్నారు.

**కూర్చునే చోటు కోసం అవస్థలు..**

బస్సు కోసం అరగంట, గంట వేచి ఉండా ల్సిన సంద ర్భాలు ఉంటాయి. అలాంటి సమయంలో ప్రయాణికులు కూర్చునేం దుకు తగినంత సౌకర్యం లేకపోవడం ప్రధాన సమస్యగా మారిం ది. వృద్ధులు, గర్భిణులు, చిన్నపిల్లలతో వచ్చే మహిళలు నిలబడాల్సి రావడం వారిని మరింత ఇబ్బందులకు గురిచేస్తోంది. 'ప్రయాణం సౌకర్యవం తంగా ఉండాలి' అని భావించి బస్టాం డ్‌కు వచ్చే ప్రజలకు, బస్సు ఎక్కే ముందు నుంచే ఇబ్బందులు ఎదురవు తు న్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**బస్టాండ్ ఆధునికరణ ఎప్పుడో?..**

శ్రీరాంపూర్ ప్రాంతం అభివృద్ధి చెందుతు న్న నేపథ్యంలో బస్టాండ్‌ను కూడా ప్రయాణికుల అవసరాలకు అనుగుణం గా ఆధునీకరించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతు న్నారు. ఆధునిక షెడ్లు, విశాలమైన వేచి ఉండే ప్రదేశం, తాగునీటి వసతి, పరిశు భ్రమైన మరుగుదొడ్లు, మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణ, కూర్చునే సౌకర్యాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. బస్టాండ్ రూపురేఖలు మార్చి ప్రయాణికులకు ఆహ్లాదకం మైన, సురక్షిత మైన వాతావరణం కల్పించాల్సిన అవస రం ఉందని అంటున్నారు. చిన్నచిన్న మరమ్మతుల తో సమస్యలకు తాత్కాలిక పరిష్కారం చూపడం కంటే సమగ్ర అభివృద్ధి చేపట్టాలని కోరుతున్నారు.

**ప్రజల ప్రశ్న ఒక్కటే..**

నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే శ్రీరాంపూర్ బస్టాండ్ అభివృద్ధికి ఎప్పుడు శ్రీకారం చుడతారు? కనీస వసతులు కల్పించేం దుకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారు? బస్టాండ్ ఆధునికరణకు ప్రణాళిక ఎప్పుడు సిద్ధమవుతుంది? అన్న ప్రశ్నలు ప్రయాణికుల నుంచి వినిపిస్తున్నాయి. ప్రజా రవాణా వ్యవస్థలో బస్టాండ్ కీలకమైన భాగం. అక్కడికి వచ్చే ప్రతి ప్రయాణికుడికి కనీస సౌకర్యాలు కల్పించడం సంబంధిత అధికారుల బాధ్యత. ఇప్పటికైనా అధికారులు శ్రీరాం పూర్ బస్టాండ్ దుస్థితిపై దృష్టి సారించి, తక్షణమే పారిశుద్ధ్యం మెరుగుపరచడం తో పాటు తాగునీరు, మరుగుదొడ్లు, కూర్చునే సౌకర్యాలు, షెడ్లు ఏర్పాటు చేయాలని ప్రయాణి కులు కోరుతున్నారు. దీర్ఘకాలికంగా బస్టాండ్‌ను ఆధునీకరించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల ని విజ్ఞప్తి చేస్తున్నారు.

**ఆధునీకరణకు ఎమ్మెల్యే చొరవ చూపాలి..**

మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు శ్రీరాంపూర్ బస్టాండ్ సమస్య పై ప్రత్యేక దృష్టి సారించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. అవసరమైన నిధులు మంజూరు చేయించి ఆధునిక సౌకర్యాలతో బస్టాండ్‌ను అభివృద్ధి చేయా లని విజ్ఞప్తి చేస్తున్నారు. బస్టాండ్ ఆధునికీ కరణకు ఎమ్మెల్యే చొరవ తీసుకుంటే ఏళ్లుగా ఎదురుచూస్తున్న సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ప్రయాణికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# భక్తి బాటలో కందుల సంధ్యారాణి..

**గణనాథుల చెంత ప్రత్యేక పూజలు! రామగుండం నియోజకవర్గంలో విస్తృతంగా మండపాల సందర్శన భక్తులకు అన్నప్రసాదం వడ్డించిన బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు**





**గోదావరిఖని, (సింగిడి):** గణపతి నవ రాత్రి ఉత్సవాల సందర్భంగా రామగుండం నియోజ కవర్గంలో భక్తిశ్రద్ధలు వెల్లివిరిశాయి. ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథుల మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**మండపం.. మండపానికీ భక్తి పర్యటన**

పాలకుర్తి మండలంతో పాటు మార్కండేయ కాలనీ, విఠల్‌నగర్, బస్టాండ్ కాలనీ, ఎన్టీపీసీ కృష్ణానగర్ తదితర ప్రాంతాల్లో కొలువుదీరిన గణనాథులను సంధ్యారాణి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొని గణనాథుని ఆశీస్సులు పొందారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని అందించారు.

**కేసీఆర్ కాలనీలో హోమ కార్యక్రమం**

కేసీఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన గణనాథుడి మండ పాన్ని కూడా కందుల సంధ్యారాణి సందర్శించారు. ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మండపం వద్ద నిర్వహించిన హోమ కార్యక్రమంలో పాల్గొని గణనాథుని ఆశీస్సులు పొందారు.

**ప్రజల సుఖసంతోషాలే ఆకాంక్ష**

ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ.. గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికతను పెంపొ ందించడంతో పాటు ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. గణనాథుని కృపతో రామగుండం నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ప్రశాంతంగా జీవించాలని ఆకాంక్షించారు.

**ఉత్సవాల్లో పాల్గొన్న నాయకులు**

ఈ కార్యక్రమాల్లో బీజేపీ లేబర్ సెల్ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ తడగొండ నరసయ్య, బియ్యాల మహేందర్, వెంకటేష్, జక్కన బాలు, పల్లపు సంపూర్ణ, సిలారపు కళ్యాణ్, స్వప్న, రజిత, లావణ్య, రమాదేవితో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# దళిత ప్రజాప్రతినిధుల ఫొటోలు ఎందుకు లేవు?

**ఎంపీ వంశీకృష్ణ పర్యటన ఫ్లెక్సీలపై దళిత వర్గం ఆగ్రహం**



**మంచిర్యాల,(సింగిడి):** ప్రజాప్రతినిధుల ఫొటోలతో ఏర్పాటు చేసే ఫ్లెక్సీలు.. రాజకీయ కార్యక్రమాల్లో ప్రాతినిధ్యానికి ప్రతీకగా మారుతున్నా యి. అయితే పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ మంచిర్యాల పట్టణ పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో దళిత సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధుల ఫొటోలు లేకపోవడం వివాదానికి దారితీసింది. దీనిపై దళిత ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. మంచిర్యాల ఐబీ చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపి, ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, కార్పొరేటర్ హరికృష్ణ మాట్లాడుతూ.. ఎంపీ అధికా రిక పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల్లో మంచిర్యాల నియోజకవర్గానికి చెందిన దళిత సామాజిక వర్గ ప్రజాప్రతినిధుల ఫొటోలు లేకపోవడం బాధాకరమన్నారు. ప్రజాస్వామ్యంలో అన్ని వర్గాలకు సమాన ప్రాతినిధ్యం, గౌరవం ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో వంశీకృష్ణ గెలుపు కోసం తాము అహర్నిశలు కృషి చేశామని వారు గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో తమను గుర్తించి, ఎన్నికల అనంతరం అధికారిక కార్యక్రమాల్లో విస్మరించడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు.

**దళిత ఎంపీ.. దళితులకే దూరమా?**

ఎంపీగా దళిత సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ఉండి కూడా అదే వర్గానికి చెందిన ప్రజాప్రతినిధులకు తగిన ప్రాతినిధ్యం దక్కకపోవడం తమను కలిచివేస్తోందని నాయకులు అన్నారు. ఫ్లెక్సీల్లో ఫొటోలు లేకపోవడం కేవలం ఒక చిన్న అంశంగా చూడకుండా.. ప్రజాప్రతినిధులకు ఇచ్చే గౌరవం, సామాజిక ప్రాతినిధ్యానికి సంబం ధించిన అంశంగా పరిగణించాలని కోరారు.

**ఫ్లెక్సీల తొలగింపుపైనా వివాదం..**

ఎంపీ పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను పట్టణ సుందరీకరణలో భాగంగా మున్సిపల్ అధికారులు తొలగించారని నాయకులు తెలిపారు. అయితే ఈ వ్యవహారంపై దళిత వర్గానికి చెందిన నాయకుల్లో అసంతృప్తి వ్యక్తమైంది. ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజాప్రతినిధుల పర్యటనల్లో నిబంధనల అమలు అందరికీ ఒకే విధంగా ఉండాలని వారు కోరారు. అధికారులు, మున్సిపల్ సిబ్బంది విషయంలో ఎలాంటి వేధింపులు లేదా అన్యాయం చోటుచేసుకున్నా చూస్తూ ఊరుకోబోమని నాయకులు హెచ్చరించారు. ప్రజాప్రతి నిధులకు గౌరవం, అన్ని సామాజిక వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించడంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**ఎన్నికల నుంచి అధికారిక కార్యక్రమాల వరకు..**

ఎన్నికల సమయంలో కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం కీలకంగా ఉంటుంది. అదే విధంగా అధికారిక పర్యటనల్లోనూ స్థానిక ప్రజాప్రతినిధు లకు ప్రాధాన్యం ఇవ్వడం రాజకీయ సంప్రదాయంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ఫ్లెక్సీల్లో కొందరి ఫొటోలు లేకపోవడం ఎందుకు జరిగిందనే ప్రశ్న ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇది ఉద్దేశపూర్వకమా? ఏర్పాట్లలో జరిగిన పొరపాటా? అన్నదానిపై సంబంధిత వర్గాల నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

singidinews@gmail.com

సినిమా సింగిడి
Cinma Singidi

సోమవారం
21-9-2026



# ఆ సమయంలో మానసికంగా ఇబ్బంది పడ్డా..

## నోరా ఫతేహి ఎమోషనల్ కామెంట్స్

బాలీవుడ్ హాట్ బ్యూటీ నోరా ఫతేహి తన కెరీర్ తొలినాళ్లలో పడ్డ కష్టాల గురించి తాజాగా ఒక పాడ్‌కాస్ట్‌లో ఆసక్తికరమైన విషయాలు పంచుకున్నారు. ఆమె గతంలో హిందీ బిగ్‌బాస్ సీజన్-9లో వైల్డ్ కార్డ్ కంటెస్టెంట్‌గా ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై మాట్లాడుతూ.. మొదట రియాలిటీ షోలను తాను చాలా చిన్నచూపు చూసేదానినని, కానీ తర్వాత పరిస్థితుల కారణంగా తన నిర్ణయం మార్చుకోవాల్సి వచ్చిందని నోరా తెలిపారు. ఆ సమయంలో తాను వరుసగా కొన్ని పాటల్లో నటించినప్పటికీ, తనకు రావాల్సిన రెమ్యునరేషన్ అందలేదని ఆమె చెప్పారు. నిర్మాతలు ఏజెన్సీకి డబ్బులు చెల్లించి ఉండవచ్చు కానీ, తనకు మాత్రం పైసలు రాలేదని అన్నారు. డబ్బుల కోసం తాను ప్రొడ్యూసర్లతో గొడవ పడాల్సి వచ్చిందని, ఆ సమయంలో మానసికంగా చాలా ఇబ్బంది పడ్డానని తెలిపింది. సరిగ్గా అదే సమయంలో బిగ్‌బాస్ టీమ్ నుంచి తనకు ఆఫర్ వచ్చిందని చెప్పారు. మొదట తాను ఆ షో చేయడానికి ససేమిరా ఒప్పుకోలేదని, తమకు తన ప్లానింగ్ ఏమిటో అర్థం కావడం లేదని వాళ్లతో వాదించినట్లు ఆమె గుర్తుచేసుకున్నారు. అయితే ఆ షో ఇస్తున్న భారీ మొత్తాన్ని చెప్పగానే తన ఆలోచన మారిపోయిందని నోరా చెప్పారు. డబ్బుల కోసమే తాను ఆ షోకి వెళ్లినట్లు ఆమె తెలిపారు. రియాలిటీ షోలు అంత చెడ్డవి కాదని, పైగా అవి మిమ్మల్ని క్షణాల్లో పాపులర్ చేస్తాయని ఆమె అభిప్రాయపడ్డారు. తాను వైల్డ్ కార్డ్ ద్వారా వెళ్లాను కాబట్టి ఎక్కువ రోజులు ఉండాల్సిన పనిలేదని భావించానని చెప్పారు. అంతేకాకుండా అదే ఛానెల్‌లో ప్రసారమయ్యే 'ఝలక్ దిఖ్లా జా' షో చేయాలని తాను బలంగా కోరుకున్నానని, అందుకే బిగ్‌బాస్‌కు వెళ్లేందుకు ఒక కండీషన్ పెట్టినట్లు వెల్లడించారు. బిగ్‌బాస్ చేస్తే తనకు 'ఝలక్ దిఖ్లా జా' అవకాశం ఇవ్వాలని ఛానెల్ వారిని కోరగా, వారు అంగీకరించడంతోనే తాను బిగ్‌బాస్‌లోకి అడుగుపెట్టినట్లు నోరా క్లారిటీ ఇచ్చారు.

# ఆఫర్లతో దూసుకుపోతున్న ప్రియాంక మోహన్..

## మరో క్రేజీ ప్రాజెక్ట్‌లో నటించే చాన్స్



కోలీవుడ్ క్యూట్ అండ్ టాలెంటెడ్ బ్యూటీ ప్రియాంక మోహన్ క్రేజ్ ఇప్పుడు పీక్స్‌కి వెళ్లిపోయిందనడంలో అతిశయోక్తి లేదు. ఏ భాషలో చూసినా వరుస ఆఫర్లతో ఈ అమ్మడు దూసుకుపోతున్న తీరు చూసి నెటిజన్లు సైతం షాక్ అవుతున్నారు. ప్రస్తుతం ఆమె చేతిలో 'అరసన్', 'మంజనత్తి', 'కవిన్-9' లాంటి క్రేజీ ప్రాజెక్ట్‌లు ఉండ గా, తాజాగా టాలీవుడ్ నుంచి మరో అదిరిపోయే బంపర్ ఆఫర్ ఆమె ఖాతాలో చేరినట్లు సోషల్ మీడి యాలో పలు పోస్టులు వైరల్ అవు తూ హాట్ టాపిక్‌గా మారాయి. ఇటీ వల 'ఇరుముడి'తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న మాస్ మహారాజా రవితేజ, టాలెంటెడ్ డైరెక్టర్ వివేక్ ఆత్రేయ క్రేజీ కాంబినేషన్‌లో రాబో తున్న భారీ చిత్రంలో ప్రియాంక మోహన్ హీరోయిన్‌గా ఫిక్స్ అయి నట్లు సమాచారం. భారీ విజయం తో ఫుల్ జోష్‌లో ఉన్న రవితేజ సరసన ఈ బ్యూటీ జోడీ కడుతుం డటం విశేషం. ప్రస్తుతం ఈ సిని మాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ పనులు శరవేగంగా జరుగు తున్నట్లు తెలుస్తోంది. అయితే వచ్చే అక్టోబర్‌లో దసరా పండుగ కానుకగా ఈ మూవీని అఫీషియ ల్‌గా పట్టాలెక్కించాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. లక్ష్మణ్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని, వచ్చే ఏడాది సమ్మర్ స్పెషల్‌గా థియేటర్లలోకి తీసుకురావడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. రవితేజ – వివేక్ ఆత్రేయ కాంబోకి ప్రియాంక మోహన్ గ్లామర్ తోడవడంతో, ఈ సినిమాపై అప్పుడే భారీ అంచనాలు క్రియేట్ అయిపోయాయి.

### వైరల్‌గా ఫస్ట్ లుక్ పోస్టర్ అండ్

# వరల్డ్ ఆఫ్ 'వేట్టువం' వీడియో



సరికొత్త కథా నేపథ్యాలతో అద్భుతమైన మేకింగ్‌తో ప్రేక్షకుల్ని మెస్మరైజ్ చేసే దర్శకుడు పా. రంజిత్ నుంచి రాబోతున్న మరో యాక్షన్ ఎంటర్‌టైనర్ 'వేట్టువం'. ఆర్య, వి.ఆర్. దినేష్, శోభిత ధూళిపాళ్ల, కలైయరాసన్, మైమ్ గోపి తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని లెర్న్ అండ్ టీచ్ ప్రొడక్షన్, నీలమ్ ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై ప్రొడ్యూసర్స్ ఎస్. సాయి దేవానంద్, ఎస్. సాయి వెంకటేశ్వరన్, పా.రంజిత్ నిర్మిస్తున్నారు. భారీ పాన్ ఇండియా యాక్షన్ మూవీగా తెరకెక్కుతున్న ఈ సినిమా డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సందర్భంగా తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్‌తో పాటు వరల్డ్ ఆఫ్ వేట్టువం వీడియో రిలీజ్ చేశారు. ఈ వీడియోకు తెలుగులో రానా దగ్గుబాటి, మలయాళంలో సౌబిన్ షాహిర్, కన్నడ వెర్షన్‌కు కిచ్చా సుదీప్, తమిళంలో పా. రంజిత్ వాయిస్ అందించారు. పూర్వకాల ప్రజల జీవన విధానం వల్ల ఏర్పడిన ప్రభావం ప్రస్తుతాన్ని ఎలా మార్చింది దాని ఫలితంగా ప్రకృతి సృష్టించే విపత్తు ఏంటి ? భవిష్యత్‌లో ఎలాంటి మార్పులు రాబోతాయంటూ మూడు కాలాల చుట్టూ ఈ చిత్రం తిరగుతున్నట్లు 'వరల్డ్ ఆఫర్ వేట్టువం' వీడియో చూస్తే అర్థం అవుతున్నది. ఎవరు బలవంతులు, అధికారం ఎవరికుండాలి అని నిరూపించుకోవడానికి కొన్ని తెగల మధ్య జరిగే పోరాటే ఈ "వేట్టువం" సినిమా అంటూ వరల్డ్ ఆఫ్ వేట్టువం తెలుపుతుంది. ఈ చిత్రంలో ధర్మరాజన్ అనే పాత్రలో ఆర్య, సేంబియన్ క్యారెక్టర్‌లో షబీర్, కలైయరాసన్ పాత్రలో వీరవర్మన్, రాధి క్యారెక్టర్‌లో శోభిత ధూళిపాళ్ల, వె.ర.దినేష్ నందన్‌గా కనిపిస్తూ ఆకట్టుకున్నారు.

Printed and Published by Mohan Pusala on behalf of Flamingo Media Networks, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar, Medchel Malkajgiri Dist.Hyderabad Telangana 500037.and Published from PLOT NO 74 A/D, KAMAKSHI NILAYAM, ESHWARIPURI COLONY, SAINIKPURI, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500094.
Editor : Pusala mohan, PRGI.REGN.NO. TGTEL/26/A4370. Cell 91 89199 18737